

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళగిరిలోని రాయల్ ఫంక్షన్ హాల్ నందు
నేటి ఉదయం 11గం॥లకు
ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగును

శనివారం | 5-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 171 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: తదియ పూర్తి; నక్షత్రం: స్వాతి రా. 9.33 తదుపరి విశాఖ; వర్జ్యం: తె. 3.45-5.32; దుర్ముహూర్తం: ఉ. 6.09-7.43; అమృతఘడియలు: ఉ. 11.40-1.28; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.57 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

5 రోజుల్లో రూ.16 లక్షల కోట్లు ఉఫ్

దాదాపు 5% క్షీణించిన సెన్సెక్స్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు.. ఎఫ్‌ఐఐల యూటర్నే కారణం



ముంబై: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్‌ఐఐ) చైనాకు తరలిపోతుండటం, ముడి చమురు ధరలు మళ్లీ ఎగబాకుతుండటంతో భారత స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. గడిచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 4,147.67 పాయింట్లు (4.83%), నిఫ్టీ 1,201 పాయింట్లు (4.65%) క్షీణించాయి. దాంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఐదు రోజుల్లో రూ.16.26 లక్షల కోట్లు పతనమై రూ.460.89 లక్షల కోట్లకు (5.49 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఈ వారాంతం సెషన్‌లో మార్కెట్ క్యాప్ రూ.4.18 లక్షల కోట్ల మేర తగ్గగా.. గురువారం ఏకంగా రూ.9.78 లక్షల కోట్లు క్షీణించింది. మార్కెట్ స్వల్పకాలం పాటు బేరిష్ ట్రెండ్‌లోనే కొనసాగవచ్చని ఈక్విటీ నిపుణులు భావిస్తున్నారు.

- ఈ వారంలో జరిగిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 3,883.4 పాయింట్లు (4.6%), నిఫ్టీ 1,164.35 పాయింట్లు (4.5%) తగ్గాయి. గడిచిన రెండేళ్లలో మార్కెట్‌కు ఇదే అత్యంత గడ్డు వారం.
- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోగా.. ఎం అండ్ ఎం షేరు అత్యధికంగా 3.58 శాతం క్షీణించింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 1.5 శాతం మేర తగ్గాయి.

వారాంతంలో సెన్సెక్స్ 809 పాయింట్లు డౌన్

ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఆరంభంలో స్వల్ప నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. త్వరగానే కోలుకుని మళ్లీ లాభాల్లోకి మళ్లింది. ఒక దశలో సూచీ 871 పాయింట్ల వరకు పెరిగి 83,368 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. కానీ, సూచీ మళ్లీ యూటర్న్ తీసుకుంది. మధ్యాహ్నం నుంచి అమ్మకాలు పోటెత్తడంతో తిరిగి నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 965 పాయింట్లు కోల్పోయి 81,532 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సెన్సెక్స్ 808.65 పాయింట్ల నష్టంతో 81,688.45 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 1,835.64 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ విషయానికొస్తే.. 235.50 పాయింట్లు కోల్పోయి 25,014.60 వద్దకు జారుకుంది. ఒక దశలో సూచీ 25,485.05 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని, 24,966.80 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది.

పసిడి కొత్త రికార్డు

ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.78,450

రూ.94,200కి చేరిన కిలో వెండి

దేశీయంగా పసిడి ధర సరికొత్త జీవితకాల రికార్డు స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం మరో రూ.150 పెరిగి రూ.78,450కి చేరుకుంది. పండగ సీజన్‌లో ఆభరణ వర్తకుల టోకు కొనుగోళ్లతో పాటు నగల రిటైల్ సేల్స్ సైతం పెరగడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. వెండి రేటు కూడా కిలోకు రూ.1,035 పెరుగుదలతో రూ.94,200కు ఎగబాకింది. కాగా, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 2,678.90 డాలర్లు, సిల్వర్ 32.37 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మున్ముందు బంగారం ధరలు మరింత ఎగబాకవచ్చని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ముడి చమురు పైపైకి..

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ కొండెక్కుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ఇప్పటికే 78 డాలర్లకు చేరుకుంది. డబ్ల్యూటీఐ క్రూడ్ 74 ఎగువన ట్రేడవుతోంది. మున్ముందు సంక్షోభం ముదిరితే ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని కమోడిటీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇజ్రాయెల్‌తో అమీతుమీకి సిద్ధమవుతున్న ఇరాన్ నుంచి సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడితే.. బ్రెంట్ క్రూడ్ ధర మరో 20 డాలర్ల వరకు పెరగవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అభిప్రాయపడింది. అదే గనక జరిగితే, ఈ పండగ సీజన్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గక పోగా మరింత పెరిగే అవకాశం ఉంది.

ఫారెక్స్ నిల్వలు @ 70,000 కోట్ల డాలర్లు

- సరికొత్త రికార్డు గరిష్ఠానికి చేరిక
- వరుసగా 7 వారాలుగా అప్..
- ఈ స్థాయి నిల్వలు కలిగిన నాలుగో దేశంగా భారత్

భారత విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. సెప్టెంబరు 27తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు ఏకంగా 1,258.8 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 70,488.5 కోట్ల డాలర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. ఈ నిల్వలు 70,000 కోట్ల డాలర్ల మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. అంతేకాదు, ఇప్పటివరకు నమోదైన అత్యధిక వారం రోజుల నిల్వ వృద్ధిలో ఇదొకటి. అలాగే, ఫారెక్స్ నిల్వలు వరుసగా ఏడు వారాలుగా వృద్ధి చెందుతూ వస్తున్నాయి. గత నెల 20తో ముగిసిన వారంలోనూ నిల్వలు 283 కోట్ల డాలర్ల మేర పెరిగాయి. ఏడు వారాల్లో నిల్వలు 3,476.7 కోట్ల డాలర్ల మేర పెరగగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 8,760 కోట్ల డాలర్ల మేర వృద్ధి చెందాయి. గత ఏడాది మొత్తానికి పెరిగిన 6,200 డాలర్ల కన్నా అధికమిది. 2026 మార్చి నాటికి భారత విదేశీ మారక నిల్వలు 74,500 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా వేసింది. కాగా, ప్రపంచంలో 70,000 కోట్ల డాలర్లకు పైగా ఫారెక్స్ నిల్వలు కలిగిన చైనా, జపాన్, స్విట్జర్లాండ్ తర్వాత నాలుగో దేశంగా భారత్ అవతరించింది. ఆకస్మిక అంతర్జాతీయ షాక్‌ల నుంచి తట్టుకునేందుకు మన ప్రభుత్వం 2013 నుంచి నిల్వలను క్రమంగా పెంచుకుంటూ వస్తోంది.

సైయెంట్ డీఎల్ఎం చేతికి ఆల్‌టెక్ ఎలక్ట్రానిక్స్

డీల్ విలువ రూ.245 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సైయెంట్ డీఎల్ఎం.. అమెరికాలో తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా అమెరికా కేంద్రంగా పనిచేసే 'ఆల్‌టెక్ ఎలక్ట్రానిక్స్'ను 2.92 కోట్ల డాలర్లకు (సుమారు రూ.245 కోట్లు) కొనుగోలు చేసింది. వైద్య, ఆరోగ్య, పారిశ్రామిక, రక్షణ రంగాలకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల డిజైన్, తయారీ రంగాల్లో ఆల్‌టెక్‌కు మంచి పేరుంది. అమెరికా రక్షణ శాఖ కూడా ఈ కంపెనీ సేవలు అందుకుంటోంది. ఈ కొనుగోలుతో అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ సేవల రంగంలో తమ పట్టు మరింత పెరుగుతుందని సైయెంట్ డీఎల్ఎం ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ బోదనపు అన్నారు.

ఏఎం గ్రీన్‌తో గెయిల్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ రంగంలోని గెయిల్ (ఇండియా)తో ప్రైవేట్ రంగానికి చెందిన 'ఏఎం గ్రీన్ బీవీ' కంపెనీతో చేతులు కలిపింది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఎంఓయూ ద్వారా రెండు కంపెనీలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 2,500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సౌర, పవన, హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాయి. అలాగే ఏఎం గ్రీన్ ఏర్పాటు చేస్తున్న ఈ-మెథనాల్ ప్రాజెక్టుల్లో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టే అవకాశాలను గెయిల్ పరిశీలిస్తుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,970 ▲	71,200 ▲	1,01,000 ▲
ముంబై	75,964 ▲	69,583 ▲	92,200 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	117
కర్నూలు	114	నెల్లూరు	117
విశాఖపట్నం	115	అనంతపురం	117
గోదావరి	120		

బీ న్యూలో దసరా ప్రత్యేక ఆఫర్లు



హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ దసరా పండగ సందర్భంగా పలు ఆఫర్స్‌ను ప్రకటించింది. దసరా సందర్భంగా మొబైల్స్‌తో పాటు గృహోపకరణాలపై కూడా వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బీ న్యూ సీఎండీ వైడీ బాలాజీ చౌదరి, సీఈఓ వై సాయి నిఖిలేష్ వెల్లడించారు. బీ న్యూలో ఎంఐ, వివో, ఒప్పో, రియల్‌మీ మొబైల్స్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతితో పాటు లక్కీడ్రాలో కారు, బైక్, రూ.10 లక్షల నగదు గెలుచుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వారు చెప్పారు. అలాగే ల్యాప్‌టాప్‌పై రూ.10,000, టీవీలపై రూ.5,000 వరకు క్యాష్‌బ్యాక్, ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50 శాతం వరకు డిస్కౌంట్‌ను పొందవచ్చన్నారు. అంతేకాకుండా ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై 10 కచ్చితమైన బహుమతులు పొందవచ్చని తెలిపారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసే స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్‌లపై రూ.5,000 క్యాష్‌బ్యాక్‌తో పాటు టీవీఎస్ కార్డు ద్వారా చేపట్టే ప్రతి కొనుగోలుపై ఒక ఈఎంఐ ఉచితమని వారు పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణలోని 150కి పైగా బీ న్యూ షోరూమ్స్‌లో ఈ దసరా ఆఫర్లు అందుబాటులో ఉంటాయని సీఈఓ సాయి నిఖిలేష్ వెల్లడించారు.



జీఆర్‌టీ జువెలర్స్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయ నిధికి చెరో రూ.25 లక్షల (మొత్తం రూ.50 లక్షలు) విరాళాన్ని అందించింది ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడికి రూ.25 లక్షల చెక్‌ను జీఆర్‌టీ జువెలర్స్ ప్రతినిధులు అందజేశారు. ఇటీవల వచ్చిన వరదలతో అతలాకుతలమైన వారికి చేయూతనందించటంతో పాటు సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వాలకి అండగా నిలిచేందుకు ఈ విరాళాలు తోడ్పడతాయని భావిస్తున్నట్లు జీఆర్‌టీ ప్రతినిధులు తెలిపారు.

మార్కెట్లోకి బీఎండబ్ల్యూ ఎం4 సీఎస్



న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ.. భారత మార్కెట్లోకి లగ్జరీ స్పోర్ట్స్ కారు ఎం4 సీఎస్ మోడల్‌ను విడుదల చేసింది. ఈ కారు ధర రూ.1.89 కోట్లు. ఈ ఏడాది బీఎండబ్ల్యూ దేశీయ మార్కెట్లోకి విడుదల చేసిన 25వ మోడల్ ఇది. కాగా భారత మార్కెట్లో ఈ కారు పూర్తిగా కంప్లీట్లీ బిల్టప్ యూనిట్ (సీబీయూ)గా అందుబాటులో ఉంటుందని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ విక్రమ్ పవాహ్ తెలిపారు. 3.0 లీటర్ ట్విన్ టర్బోచార్జ్‌డ్ ఇన్‌లైన్ 6- సిలిండర్ ఇంజన్‌తో కూడిన ఈ కారు 3.4 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని బీఎండబ్ల్యూ వెల్లడించింది. కాగా ఈ ఏడాది జనవరి-సెప్టెంబరు కాలంలో బీఎండబ్ల్యూ, మినీ కార్ల విక్రయాలు 10 శాతం వృద్ధితో 10,556 యూనిట్లకు చేరుకున్నట్లు విక్రమ్ తెలిపారు. కంపెనీ భారత మార్కెట్లోకి అడుగుపెట్టిన తర్వాత ఈ స్థాయిలో విక్రయాలు చేపట్టడం ఇదే తొలిసారని విక్రమ్ పేర్కొన్నారు.

పోరాటమే లేకుండా..

ఆరంభ మ్యాచ్‌లో భారత్ ఓటమి

58 రన్స్ తేడాతో కివీస్ ఘనవిజయం



కివీస్ ప్లేయర్ల ఆనందం



హర్మన్‌ప్రీత్ (15)

దుబాయ్: ఈసారైనా మహిళల టీ20 వరల్డ్‌కప్‌ను పట్టేయాలనే కసితో ఉన్న భారత జట్టుకు.. ఆరంభ మ్యాచ్‌లోనే షాక్ తగిలింది. శుక్రవారం గ్రూప్ 'ఏ'లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ సేన ఏకంగా 58 పరుగుల తేడాతో చిత్తయ్యింది. అటు బౌలర్లూ ఆకట్టుకోలేక.. ఇటు బ్యాటర్లూ రాణించలేక తమ సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. స్టార్లతో కూడిన బ్యాటింగ్ లైనప్‌లో కనీసం ఒక్కరు కూడా 20 పరుగులు చేయకపోవడం గమనార్హం. అటు వరుసగా పది మ్యాచ్‌ల ఓటములతో ఈ మెగా టోర్నీలో అడుగుపెట్టిన కివీస్ మాత్రం అద్భుత విజయంతో ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 160 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 7 ఫోర్లతో 57 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించగా.. ఓపెనర్లు ప్లిమ్మర్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 34), సుజీ బేట్స్ (24 బంతుల్లో 2 ఫోర్లతో 27) ఆకట్టుకున్నారు. పేసర్ రేణుకా సింగ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 19 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. సారథి హర్మన్‌ప్రీత్ (15) టాప్ స్కోరర్. పేసర్లు రోజ్‌మేరీ మెయిర్‌కు 4, తహుహుకు 3 వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సోఫీ డివైన్ నిలిచింది.

బ్యాటింగ్ పేలవం: స్లో పిచ్‌పై భారీ ఛేదన బరిలోకి దిగిన భారత్ ఏ దశలోనూ లక్ష్యంవైపు సాగలేకపోయింది. పవర్‌ప్లేలోనే జట్టు షఫాలీ (2), స్మృతి మంధాన (12), హర్మన్‌ప్రీత్‌లను కోల్పోవడంతో మ్యాచ్ ఫలితం తేలిపోయింది. ఆ తర్వాత కూడా వికెట్ల పతనం ఎక్కడా ఆగలేదు. ఇన్నింగ్స్ తొలి బంతినే ఫోర్‌గా మలిచి మంధాన ఆశలు రేపినా.. కివీస్ బౌలర్లు సమష్టి రాణింపుతో దెబ్బతీశారు. ఓపెనర్లను స్పిన్నర్ ఈడెన్ కర్సన్ పెవిలియన్‌కు చేర్చి వికెట్ల పతనాన్ని ఆరంభించగా.. పేసర్ తహుహు మిడిలార్డర్‌ను దెబ్బతీసింది. దీంతో ఒక్క బ్యాటర్ కూడా క్రీజులో నిలువలేకపోయారు. హర్మన్ వికెట్ తీసిన మెయిర్ ఆ తర్వాత టెయిలెండర్ల పనిబట్టడంతో భారత జట్టు అతికష్టమ్మీద 19వ ఓవర్‌లో వంద పరుగులకు చేరి ఆలౌటైంది.

డివైన్ దూకుడు: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. ఓపెనర్ల జోరుకు చివర్లో సోఫీ డివైన్ బాదుడు జత కలవడంతో కివీస్ ఈ పిచ్‌పై భారీ స్కోరు సాధించగలిగింది. దీనికి తోడు భారత ఫీల్డింగ్ వైఫల్యం కూడా కివీస్‌కు కలిసివచ్చింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ బేట్స్ రెండు ఫోర్లతో సత్తా చాటింది. ఇక మూడో ఓవర్‌లో మరో ఓపెనర్ ప్లిమ్మర్ 4,6తో చెలరేగగా స్పిన్నర్ దీప్తి 16 పరుగులు సమర్పించుకుంది. ఆరో ఓవర్‌లోనూ ఆమె రెండు ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 55 పరుగులతో దూసుకెళ్లింది. అదే ఓవర్‌లో బేట్స్ క్యాచ్‌ను కీపర్ రిచా వదిలేసింది. ఈ జోడీ తొలి వికెట్‌కు 67 పరుగులు జోడించాక వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేరింది. అయితే ఈ సంతోషాన్ని ఆవిరి చేస్తూ సోఫీ డివైన్ బ్యాట్ ఝుళిపించడంతో.. కివీస్ ఆటలో ఎక్కడా వేగం తగ్గలేదు. అమేలీ కెర్ (13) అవుట్ విషయంలో కాస్త హైడ్రామా నెలకొన్నా ఆమె ఎక్కువసేపు నిలువలేదు. అటు డివైన్ మాత్రం వరుస ఫోర్లతో భారత బౌలర్లపై ఒత్తిడి పెంచింది. దీంతో 15 ఓవర్లలో స్కోరు వంద దాటింది. 18వ ఓవర్‌లో బ్రూక్ హాలిడే (16) రెండు, డివైన్ మరో ఫోర్‌తో 16 పరుగులు వచ్చాయి. ఆఖరి ఓవర్‌లో డివైన్ చక్కటి ఫోర్‌తో హాఫ్ సెంచరీ పూర్తిచేయడంతో పాటు స్కోరును 160కి చేర్చగలిగింది. చివరి ఐదు ఓవర్లలో డివైన్ ధాటికి కివీస్ 51 పరుగులు రాబట్టింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 160/4 (డివైన్ నాటౌట్ 57, ప్లిమ్మర్ 34, బేట్స్ 27; రేణుకా సింగ్ 2/27, అరుంధతి 1/28, శోభన 1/22).

భారత్: 19 ఓవర్లలో 102 ఆలౌట్ (హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, స్మృతి మంధాన 12; మెయిర్ 4/19, తహుహు 3/15, కర్సన్ 2/34).

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు

ఆస్ట్రేలియా X శ్రీలంక
మధ్యాహ్నం 3.30 నుంచి

బంగ్లాదేశ్ X ఇంగ్లండ్
రాత్రి 7.30 నుంచి

స్టార్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్‌లో

దక్షిణాఫ్రికా ఘనవిజయం

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా అదరగొట్టింది. శుక్రవారం గ్రూప్ 'బి'లో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై పది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కెప్టెన్ వోల్వార్ట్ (59 నాటౌట్), బ్రిట్స్ (57 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలతో సునాయాసంగా మ్యాచ్‌ను ముగించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 118 పరుగులు చేసింది. స్టెఫానీ టేలర్ (44 నాటౌట్) మినహా అంతా విఫలమయ్యారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ లెఫ్టామ్ స్పిన్నర్ ఎంలబాకు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో సఫారీ జట్టు 17.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 119 పరుగులు చేసి గెలిచింది.

ఆనంద్ పరాజయం

లండన్: ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌కు గ్లోబల్ చెస్ లీగ్ (జీసీఎల్)లో పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన గేమ్‌లో వరల్డ్ బ్లిట్జ్ మాజీ చాంపియన్ మాగ్జిమ్ లగ్రావ్ (అప్‌గ్రాడ్ ముంబై మాస్టర్స్) 48 ఎత్తుల్లో ఆనంద్‌పై గెలుపొందాడు. ఇక..వరుసగా రెండో రౌండ్‌లోనూ విషీ ఆధ్వర్యంలోని గ్యాంగెస్ గ్రాండ్‌మాస్టర్స్ జట్టుకు ఓటమి తప్పలేదు. అప్‌గ్రాండ్ ముంబై మాస్టర్స్ టీమ్ 14-5తో గ్యాంగెస్‌ను ఓడించింది. గురువారం తొలి రౌండ్‌లో ఆల్‌పైన్ పైపర్స్ చేతిలోనూ గ్యాంగెస్ ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఇతర రౌండ్-2 మ్యాచ్‌ల్లో అలాస్కన్ నైట్స్ 14-2తో అమెరికన్ గ్యాంబిట్స్‌పై గెలుపొందగా, డిఫెండింగ్ చాంపియన్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ 17-4తో ఆల్‌పైన్ పైపర్స్‌ను చిత్తు చేసింది.



ముకేశ్ ఖాతాలో మరో స్వర్ణం

లిమా (పెరూ): తెలుగు కుర్రాడు ముకేశ్ నేలవల్లి జూనియర్ వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మరో పతకం కొల్లగొట్టాడు. శుక్రవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించాడు. ముకేశ్, రాజ్‌వర్ధన్ పాటిల్, హర్సిమర్‌సింగ్ రత్తాలతో కూడిన భారత త్రయం ఫైనల్స్‌లో అగ్రస్థానంతో విజేతగా నిలిచింది. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లోనూ పసిడి సాధించిన ముకేశ్‌కు ఇది టోర్నీలో నాలుగో స్వర్ణం కావడం విశేషం.

ఇంటివాడైన రషీద్ ఖాన్



న్యూఢిల్లీ: అఫ్ఘానిస్థాన్ స్టార్ క్రికెటర్ రషీద్ ఖాన్ ఇంట పెళ్లిబాజాలు మోగాయి. 26 ఏళ్ల రషీద్ పెళ్లి చేసుకున్నాడు. గురువారం రాత్రి అఫ్ఘాన్ రాజధాని కాబూల్‌లోని ఓ హోటల్‌లో జరిగిన ఈ వేడుకకు అఫ్ఘాన్ క్రికెట్ జట్టు ఆటగాళ్లు హాజరయ్యారు. అయితే రషీద్ పెళ్లి చేసుకున్న అమ్మాయి వివరాలు మాత్రం వెల్లడి కాలేదు. కాగా, ఇదే వేడుకలో రషీద్‌తో పాటు అతని ముగ్గురు సోదరులు అమీర్ ఖలీల్, జకియుల్లా, రజా ఖాన్‌ల పెళ్లి కూడా జరగడం విశేషం. ఈ సందర్భంగా రషీద్‌కు ప్రపంచవ్యాప్తంగా క్రికెటర్లు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏడేళ్ల తర్వాత మళ్లీ హాకీ లీగ్

న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్) ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ అభిమానులను అలరించనుంది. పూర్తిగా కొత్త రూపు సంతరించుకున్న పురుషులు, మహిళల హాకీ లీగ్ వచ్చే డిసెంబరు 28న ప్రారంభం కానుంది. పురుషుల విభాగంలో ఎనిమిది జట్లు, మహిళల్లో ఆరు జట్లు బరిలో దిగనున్నాయి. రూర్కేలాలో పురుషులు, రాంచీలో మహిళల పోటీలు నిర్వహిస్తారు. ఈనెల 13 నుంచి 15 వరకు ఆటగాళ్ల వేలం జరగనుంది. 2013లో తొలిసారి మొదలైన హెచ్‌ఐఎల్ ఐదు సంవత్సరాలు కొనసాగిన తర్వాత నిలిచిపోయింది. కాగా..హాకీ ఇండియా లీగ్ ఢిల్లీ ఫ్రాంచైజీ తన డైరెక్టర్‌గా దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్‌ను శుక్రవారం ప్రకటించింది.

బీసీసీఐ ఏసీయూ చీఫ్ శరద్ కుమార్



న్యూఢిల్లీ: బీసీసీఐ అవినీతి వ్యతిరేక యూనిట్ (ఏసీయూ) చీఫ్‌గా రిటైర్డ్ ఐపీఎస్ శరద్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. యూపీకి చెందిన 68 ఏళ్ల శరద్ కుమార్ 1979 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. గతంలో నాలుగు సంవత్సరాలు జాతీయ దర్యాప్తు సంస్థ అధిపతిగా పని చేశారు. మూడేళ్ల పాటు ఆయన ఏసీయూ చీఫ్ పదవిలో ఉంటారు.

'షాంఘై'లో బోపన్న జోడీ ముందంజ

షాంఘై: భారత టెన్నిస్ డబుల్స్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న షాంఘై మాస్టర్స్ టోర్నమెంట్‌లో ముందంజ వేశాడు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ ఆరంభ రౌండ్లో ఐదో సీడ్ బోపన్న/ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జంట 6-4, 6-3తో స్పెయిన్ ద్వయం పాబ్లో కారెనో బస్టా/పెడ్రో మార్టినెజ్‌పై వరుససెట్లలో గెలుపొందింది. ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత్ పోరాటం ఇప్పటికే ముగిసింది. రామ్‌కుమార్, సుమిత్ నగాల్ తొలి రౌండ్లోనే వెనుదిరిగారు.

ములానీ, తనుష్ తిప్పేశారు

రెస్ట్ తొలి ఇన్నింగ్స్ 416 ఆలౌట్

లఖ్‌నవూ: స్పిన్నర్లు షామ్స్ ములానీ, తనుష్ కోటియన్ తిప్పేయడంతో ముంబైతో ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్టాఫ్ ఇండియా మొదటి ఇన్నింగ్స్‌లో 416 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ముంబై శుక్రవారం ఆఖరికి ఆరు వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ 121 రన్స్‌తో కలిపి ముంబై మొత్తం 274 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ముంబై మొదటి ఇన్నింగ్స్‌లో 537 రన్స్ చేసింది. ఓవర్‌నైట్ 289/4తో నాలుగో రోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించగా..కిందటి రోజు బ్యాటర్లు అభిమన్యు ఈశ్వరన్, ధ్రువ్ జురెల్ ఐదో వికెట్‌కు 165 పరుగులు జోడించారు. అయితే ద్విశతకం దిశగా సాగుతున్న అభిమన్యు (191), సెంచరీకి చేరువైన జురెల్ (93)ను స్పిన్నర్ ములానీ వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. ఆపై మరో స్పిన్నర్ కోటియన్ విజృంభించడంతో 'రెస్ట్' బ్యాటింగ్ కుప్పకూలింది.

సంక్షిప్తస్కోర్లు: ముంబై తొలి ఇన్నింగ్స్: 537, రెండో ఇన్నింగ్స్: 153/6 (పృథ్వీ షా 76, కోటియన్ బ్యాటింగ్ 20, సారాన్ష్ జైన్ 4/67, సుతార్ 2/40).

రెస్టాఫ్ ఇండియా మొదటి ఇన్నింగ్స్: 416 (అభిమన్యు ఈశ్వరన్ 191, జురెల్ 93, కోటియన్ 3/101, ములానీ 3/122).

భారత్-బంగ్లా మూడో టీ20

టిక్కెట్ల అమ్మకం నేటినుంచే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా ఈనెల 12వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ఆఖరి మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలను శనివారం ప్రారంభించనున్నట్లు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు వెల్లడించాడు. టిక్కెట్లను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే విక్రయిస్తున్నామని, ఆఫ్‌లైన్ కౌంటర్లలో అమ్మడం లేదని చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ యాప్, వెబ్‌సైట్‌లో టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చునని తెలిపాడు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వర్చువల్ టిక్కెట్ పత్రాన్ని ఈనెల 8 నుంచి 12వ తేదీ మధ్య సికింద్రాబాద్ జింఖానా క్రికెట్ స్టేడియంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఏదైనా కార్డును చూపించి టిక్కెట్లను పొందవచ్చన్నాడు. టిక్కెట్ ప్రారంభ ధర రూ.750 కాగా, గరిష్ఠ ధర రూ.15 వేలు.

స్టాండ్ల వారీగా టిక్కెట్ల వివరాలు..

• నార్త్ ఫస్ట్ లేదా సెకండ్ టెర్రస్ - రూ.750 • సౌత్ వెస్ట్ లేదా ఈస్ట్ పెవిలియన్ సెకండ్ టెర్రస్ రూ.1000 • సౌత్ వెస్ట్ లేదా ఈస్ట్ పెవిలియన్ ఫస్ట్ టెర్రస్- రూ.1250 • ఈస్ట్ లేదా వెస్ట్ పెవిలియన్ ఫస్ట్ ఫ్లోర్- రూ.1750 • ఈస్ట్ లేదా వెస్ట్ పెవిలియన్ గ్రౌండ్ ఫ్లోర్- రూ.2500 • ఈస్ట్ లేదా వెస్ట్ పెవిలియన్ గ్రౌండ్ ఫ్లోర్ ప్రీమియం లాంజ్- రూ.4000 • నార్త్ పెవిలియన్ ఫస్ట్ ఫ్లోర్- రూ.5000 • సౌత్ ఈస్ట్ లేదా వెస్ట్ పెవిలియన్ ఫస్ట్ ఫ్లోర్ - రూ.5500 • నార్త్ పెవిలియన్ ఈస్ట్ లేదా వెస్ట్ గ్రౌండ్ ఫ్లోర్ -రూ.8000 • సౌత్ వెస్ట్ లేదా ఈస్ట్ పెవిలియన్ గ్రౌండ్ ఫ్లోర్ - రూ.9000 ● నార్త్ పెవిలియన్ ఈస్ట్ లేదా వెస్ట్, ఫస్ట్ లేదా సెకండ్ ఫ్లోర్ బాక్స్ - రూ.12000 • సౌత్ పెవిలియన్ ఈస్ట్ లేదా వెస్ట్, ఫస్ట్ లేదా సెకండ్ ఫ్లోర్ బాక్స్- రూ. 15000.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 5-10-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం

ధ్వజారోహణతో నాంది పలికిన అర్చకులు

తొలి రోజు పెద్దశేష వాహనంపై మలయప్ప విహారం 11

నేడు చిన్నశేష, హంస వాహనాలపై గోవిందుడి దర్శనం



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు

అడ్డంగా దొరికిపోయిన కల్తీ కేటుగాళ్లు

ఏఆర్ డెయిరీ తమిళనాడులోని దిండిగల్‌లో ఉంది. నిబంధనల ప్రకారం తమ డెయిరీ నుంచే ఈ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా చేయాలి. కానీ... తిరుపతి సమీపంలోనే ఉన్న వైష్ణవి డెయిరీ నెయ్యి ఏఆర్ డెయిరీ పేరుతో తిరుమలకు చేరుకుంది. కొన్ని ట్యాంకర్లు పెనుబాక నుంచి నేరుగా తిరుమలకు చేరుకున్నాయి. అవి దిండిగల్-తిరుపతి మధ్య ఉన్న టోల్‌గేట్లు దాటకపోవడమే దీనికి రుజువు!

- ఏఆర్ డెయిరీ నుంచి జూన్, జూలైలో 8 ట్యాంకర్లు
- అవన్నీ తిరుపతి సమీపంలోని వైష్ణవిలో నింపినవే
- యూపీలోని భోలేబాబా నుంచి వైష్ణవి కొనుగోళ్లు
- కొన్నది కిలో రూ.355కు.. అమ్మిన ధర 318.57
- అడ్డగోలుగా కల్తీ చేయకుంటే ఇదెలా సాధ్యం?
- 5 ట్యాంకర్లు పెనుబాక-దిండిగల్ మీదుగా తిరుమలకు
- మూడు ట్యాంకుల నెయ్యి నేరుగా తిరుమలకే
- టోల్‌గేట్లు దాటక పోవడమే స్పష్టమైన ఆధారం
- స్టేట్ జీఎస్టీ నివేదికలో విస్తుగొలిపే నిజాలు

తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా నిజం

మార్కెట్‌లో కిలో నెయ్యి రూ.600 కంటే తక్కువకు ఎక్కడా దొరకదు. భోలేబాబా డెయిరీ నుంచి తిరుపతి సమీపంలోని పెనుబాకలో ఉన్న వైష్ణవి డెయిరీ కిలో రూ.355 చొప్పున కొనుగోలు చేసింది.

అదే నెయ్యిని ఏఆర్ డెయిరీకి కిలో రూ.318.57కే విక్రయించింది. అంటే కిలోకు సుమారు 37 రూపాయల నష్టం! నెయ్యిని నానా రకాలుగా కల్తీ చేశారనేందుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి!

వైష్ణవి డెయిరీ నుంచి కిలో రూ.318.57 కొనుగోలు చేసిన (కల్తీ) నెయ్యిని ఏఆర్ డెయిరీ టీటీడీకి రూ.319.50 చొప్పున సరఫరా చేసింది. అంటే అంతా గోల్‌మాల్!

భోలేబాబా నుంచి వైష్ణవి.. దాని నుంచి ఏఆర్ నెయ్యి కొని తిరుమలకు సరఫరా చేసిందని రుజువైంది.

కల్తీ కేటుగాళ్ల మాయ ..10లో





లడ్డూ కల్తీపై స్వతంత్ర సిట్

ఐదుగురు సభ్యులతో ఏర్పాటు.. సుప్రీంకోర్టు నిర్ణయం

సీబీఐ, రాష్ట్ర పోలీసు శాఖ నుంచి ఇద్దరేసి అధికారులు.. ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి మరొకరు

- పర్యవేక్షణ సీబీఐ డైరెక్టర్‌కు.. ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలు
- రాష్ట్ర సిట్ అధికారుల విశ్వసనీయతను మేం శంకించడం లేదు
- భక్తుల్లో విశ్వాస కల్పనకే స్వతంత్ర దర్యాప్తు: సుప్రీం కోర్టు
- ఎన్‌డీడీబీ ల్యాబ్ నివేదిక ఆధారంగానే సీఎం మాట్లాడారు
- పంది కొవ్వు ఉందని అందులోనే ఉంది: ప్రభుత్వ లాయర్
- అది శాకాహార కొవ్వు అన్న వైవీ తరపు లాయర్
- కలుషిత ట్యాంకర్లను ఎలా అనుమతించారని ప్రశ్న
- గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టు ప్రకారం వచ్చాయన్న టీటీడీ

న్యూఢిల్లీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) స్థానంలో ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర సిట్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు రాష్ట్ర పోలీసు అధికారులతో పాటు భారత ఆహార భద్రత-ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)కి చెందిన సీనియర్ అధికారి సభ్యులుగా ఉంటారని, సీబీఐ డైరెక్టర్

మిగతా 10వ పేజీలో...

కాల్పులతో దద్దరిల్లిన అబూజ్‌మడ్

30 మందికి పైగా నక్సల్స్ మృతి

ఛత్తీస్‌గఢ్‌లో అతి భారీ ఎన్‌కౌంటర్

మృతుల సంఖ్య పెరిగే అవకాశం

- నెందూర్, తులతులి అడవుల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు ఇంటెలిజెన్స్ సమాచారం
- రంగంలోకి డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్
- మొత్తం 1,200 మందితో భారీ ఆపరేషన్
- ఇంకా కొనసాగుతున్న కూంబింగ్
- ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు.. 185 మంది మృతి



చర్ల, అక్టోబరు 4: ఛత్తీస్‌గఢ్ అడవులు కాల్పుల మోతతో మరోసారి దద్దరిల్లాయి. ఆ రాష్ట్రంలోని నారాయణపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులోని అబూజ్‌మడ్ అడవుల్లో శుక్రవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 30మందికిపైగా మావోయిస్టులు మృతి చెందారు. పెద్ద మొత్తంలో ఆయుధాలతో కూడిన డంప్‌ను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈస్ట్ బస్తర్ డివిజన్ ఇంద్రావతి ఏరియా కమిటీ ఎల్‌జీఏకు చెందిన ఆరుగురు బెటాలియన్ సభ్యులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కమలేశ్, నీతి, నందు, సురేశ్, మహేశ్, విమల

మిగతా 2వ పేజీలో...

రైతుకు నచ్చిన మిల్లుకే ధాన్యం రవాణా



- రైసు మిల్లుల ర్యాండమైజేషన్ విధానం రద్దు
- సంచులు, లేబర్, రవాణా సౌకర్యం ఏర్పాటు
- జీపీఎస్‌తో ధాన్యం రవాణా వాహనాల ట్రాకింగ్
- ధాన్యం సేకరణపై సీఎం చంద్రబాబు సమీక్ష

రాష్ట్రంలో 5 గ్లోబల్ ట్రేడ్ సెంటర్లు

- తిరుపతి, అమరావతి, విశాఖ, మరో రెండుచోట్ల ఏర్పాటు
- ప్రతి నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రియల్ పార్కు
- 'ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త' నినాదం 6



జీతాలు పడుతూనే ఉన్నాయ్!

ఇంకా రూ.1,500 కోట్లు పెండింగ్‌లో 6

టైం మెషిన్ ఎక్కండి.. యవ్వనం పొందండి!

వృద్ధులకు కాన్పూర్‌లో దంపతుల ఎర.. రూ.35 కోట్లతో పరార్



రష్మీ, రాజీవ్

కాన్పూర్, అక్టోబరు 4: 'టైం మెషిన్' ద్వారా అనుకుంటే వెనుకటి కాలానికి, ముందు కాలానికీ వెళ్లొచ్చు! ఈ కథాంశంతో 90లలో సినిమా వస్తే తెరమీద ఆ మాయాజాలానికి మైమరిచిపోయి భూత, భవిష్యత్తు కాలాల్లో మనమూ ప్రయాణించి మురిసిపోయాం! యూపీలోని కాన్పూర్‌లోనూ ఓ 'టైం మెషిన్' వచ్చేసింది. కాకపోతే ఇది కాలాన్ని వెనక్కి నెట్టేసి.. 65 ఏళ్ల ముసలివాళ్లను కొన్ని నెలల్లోనే పాతికేళ్ల నవ యవ్వనులుగా చేస్తుంది! ఈ మాట.. కాన్పూర్‌కు చెందిన ఓ దంపతులు చెబితే అక్కడి పెద్ద మనుషుల్లో చాలామంది నమ్మేశారు. డబ్బులు పోతేపోనీ గానీ.. ఈ నెరిసిన జుట్టు.. ముడతలు పడ్డ తనువు.. చేతికి ఊతకర్ర అన్నీ పోయి మళ్లీ యవ్వనసిరిని సంతరించుకొని చలాకీగా తిరగొచ్చునని ఆశపడ్డారు! ఆ దంపతులు చెప్పినంత మొత్తం కట్టేశారు. ఆ డబ్బంతా రూ.35 కోట్ల మేర పోగయ్యేసరికి బిచాణా ఎత్తేసిందా జంట! కాన్పూర్‌కు చెందిన రాజీవ్ కుమార్ దూబే, ఆయన భార్య రష్మీ దూబే చేసిన ఘరానా మోసమిది. వీళ్లు.. ఆ నగరంలో 'రివైవల్ వరల్డ్' పేరుతో ఫిజియో థెరపీ కేంద్రాన్ని తెరిచారు. లోపల.. 'టైం మెషిన్' పేరుతో కళ్లు చెదిరేలా ఓ యంత్రాన్ని పెట్టారు. ఈ టైం మెషిన్ ఇజ్రాయెల్‌లో తయారైందని, ప్రత్యేకంగా తెప్పించామంటూ కరపత్రాలు పంచిపెట్టారు. నగరంలో పలుచోట్ల హోర్డింగ్‌లు పెట్టించారు. రూ.6వేల నుంచి రూ.90వేల దాకా రకరకాల ప్యాకేజీలు పెట్టారు. స్కీంలో చేరాలనుకున్నవారు.. ఇతరులను చేర్పిస్తే డిస్కౌంట్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చారు. పెద్ద సంఖ్యలో చేరిన వృద్ధులను వైద్య పరీక్షల పేరుతో కొంతకాలం మభ్యపెడుతూ వచ్చారు. అయితే.. రేణు సింగ్ అనే ఓ పెద్దావిడకు అనుమానమొచ్చి రాజీవ్, రష్మీలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ఆ దంపతులకు రూ.7 లక్షలు కట్టానని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిజియో థెరపీ సెంటర్‌కొచ్చి ఆ టైం మెషిన్‌ను పరిశీలించారు. అయితే టైం మెషిన్ ప్రక్రియ విశ్వసనీయతపై బాధితుల్లో అనుమానాలు మొదలయ్యాయని గుర్తించగానే.. రాజీవ్, రష్మీ కలిసి విదేశాలకు చెక్కేసినట్లు భావిస్తున్నారు.

అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన కేజ్రీవాల్

▸ ఆప్ ఎంపీ బంగ్లాలో మకాం

న్యూఢిల్లీ, అక్టోబరు 4: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం అధికారిక నివాసాన్ని ఖాళీ చేశారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఆయన గతంలో మాట్లాడుతూ తాను ఉంటున్న బంగ్లాను దసరా పర్వదినాల్లో ఖాళీ చేస్తానని ప్రకటించారు. ఆ మేరకు ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని 6వ నెంబరు బంగ్లాను ఖాళీ చేసి తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కారులో మండీ హౌస్ సమీపంలోని ఫిరోజ్‌షా రోడ్‌లో ఉన్న మరో ప్రభుత్వ బంగ్లాకు తరలి వెళ్లారు. అక్కడ తమ పార్టీ రాజ్యసభ సభ్యుడు అశోక్ మిట్టల్ (పంజాబ్)కు కేటాయించిన అధికారిక బంగ్లాలో నివాసం ఉండనున్నారు.

లోకం తీరు





సచివాలయం పైనుంచి దూకిన 'మహా' డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు!

▸ కింద వలలు ఏర్పాటుచేసి ఉండటంతో తప్పిన ముప్పు

▸ ధన్‌గఢ్ కులాన్ని ఎస్టీల్లో చేర్చొద్దంటూ నిరసన..

ముంబై, అక్టోబరు 4: మహారాష్ట్రలో షెడ్యూల్ తెగల (ఎస్టీ) క్యాటగిరీలో ధన్‌గఢ్ సామాజిక వర్గాన్ని చేర్చాలన్న డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్న నేపథ్యంలో.. అధికార వర్గం ప్రజాప్రతినిధుల నుంచే తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. ఆదివాసీ వర్గానికి చెందిన ఎన్సీపీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ నరహరి ఝిర్వాల్, మరో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఓ బీజేపీ ఎంపీ శుక్రవారం మంత్రాలయ (సచివాలయం) మూడో అంతస్తు పై నుంచి దూకి తమ నిరసన తెలిపారు. అయితే సచివాలయంలో ఆత్మహత్యలను అడ్డుకునేందుకు గతంలోనే మొదటి అంతస్తుపై వలలు ఏర్పాటు చేసి ఉండటంతో వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. అనంతరం ఝిర్వాల్‌తో పాటు ఎంపీ హేమంత్ సావ్రా, ఎమ్మెల్యేలు కిరణ్ లహమాటే, హిరమన్ ఖోస్కర్, రాజేశ్ పాటిల్ పోలీసుల సాయంతో వలపై నుంచి నడుస్తూ బయటికొచ్చి బైఠాయించారు. ధన్‌గఢ్ సామాజిక వర్గాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎస్టీల్లో చేర్చవద్దంటూ వారు డిమాండ్ చేశారు. ఈ పరిణామాలతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాగా, ప్రస్తుతం ధన్‌గఢ్ కులం ఓబీసీ జాబితాలో ఉంది. దీంతో మిగతా రాష్ట్రాల్లో మాదిరి తమను ఎస్టీల్లో చేర్చాలని కొద్దిరోజులుగా ఆ వర్గం ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు.

ఈ నెలలో పాకిస్థాన్‌కు జైశంకర్

న్యూఢిల్లీ, అక్టోబరు 4: కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఈ నెలలో పాకిస్థాన్‌కు వెళ్లనున్నారు. ఆ దేశంలో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సుకు ఆయన హాజరుకానున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఇస్లామాబాద్‌లో నిర్వహించే ఎస్‌సీవో కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ (సీహెచ్‌జీ) సదస్సుకు పాక్ ఆతిథ్యమిస్తోందని, ఈ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధి బృందానికి కేంద్ర మంత్రి జైశంకర్ నాయకత్వం వహిస్తారని ఆయన చెప్పారు. ఈ సదస్సులో పాల్గొనాల్సిందిగా ప్రధాని మోదీని గత ఆగస్టులో పాక్ ఆహ్వానించింది. కాగా, గత తొమ్మిదేళ్ల కాలంలో భారత విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌కు వెళ్లడం ఇదే మొదటిసారి. సుష్మాస్వరాజ్ 2015 డిసెంబరులో ఇస్లామాబాద్‌లో అఫ్ఘానిస్థాన్‌పై జరిగిన సమావేశానికి హాజరయ్యారు.

పరువు నష్టం దావాలో రాహుల్‌కు సమన్లు

ముంబయి, అక్టోబరు 4: క్రిమినల్ పరువు నష్టం దావా విషయమై ఈ నెల 23న విచారణకు హాజరు కావాలని పుణె మేజిస్ట్రేటు కోర్టు శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి సమన్లు పంపించింది. గత ఏడాది లండన్‌లో స్వాతంత్ర్య సమర యోధుడు సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై కేసు నమోదయింది. సావర్కర్ సోదరుడి మనుమడు సాత్యకి సావర్కర్ గత ఏడాది ఏప్రిల్‌లో ఈ కేసు పెట్టారు. ప్రతి సందర్భంలోనూ సావర్కర్‌ను అవమాన పరిచేలా రాహుల్ విమర్శలు చేస్తున్నారని సాత్యకి ఆరోపించారు. దీంతో తమ కుటుంబం మనోభావాలు కూడా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఇదే విషయమై దాఖలైన మరో దావాలో ఇటీవలే నాసిక్ కోర్టు కూడా రాహుల్‌కు సమన్లు పంపింది.

ఆస్ట్రేలియాకు భారీగా తగ్గిన భారత విద్యార్థులు

న్యూఢిల్లీ, అక్టోబరు 4: ఆస్ట్రేలియాకు ఉన్నత విద్య కోసం వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దరఖాస్తులు సంఖ్యలో 66% తగ్గుదల ఉందని 'ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్' పత్రిక పేర్కొంది. ఆస్ట్రేలియా ప్రభుత్వం జూలైలో ఫీజులను భారీగా పెంచింది. గత ఏడాది వరకూ విదేశీ విద్యార్థులు తమ ఖాతాల్లో సేవింగ్స్ రూపంలో రూ.12 లక్షలు చూపించాల్సి వచ్చేది. దానిని రూ.17 లక్షలకు పెంచుతూ రెండు దఫాలుగా నిర్ణయం తీసుకుంది. దీనికితోడు వివిధ కారణాలు చూపుతూ అక్కడే ఉండిపోవడానికి ప్రయత్నించే వారిని అడ్డుకోవడానికి అనువుగా నిబంధనలను కఠినతరం చేసింది. దీంతో ఆస్ట్రేలియాకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 66,910 నుంచి 22,967కి పడిపోయింది.

12 రకాల మసాలా బ్రాండ్లలో అధికంగా సీసం!

న్యూఢిల్లీ, అక్టోబరు 4: భారత్‌కు చెందిన మసాలా బ్రాండ్లు.. పరాస్, ఈజీఎస్, మిమీస్ ప్రొడక్ట్స్, బౌల్ అండ్ బాస్కెట్, రాణి బ్రాండ్, జారా ఫుడ్స్ త్రీ రివర్స్, యు ఈ బ్రాండ్, బైలి ఫెంగ్, స్పైసీ కింగ్, బడియా, దీప్ వంటి 12 రకాల బ్రాండ్ల దాల్చిన చెక్క పొడి, ఇతర పొడి మసాలాల్లో అధిక స్థాయిలో సీసం ఉన్నట్లు అమెరికాకు చెందిన 'కన్జూమర్ రిపోర్ట్స్' సంస్థ నివేదికలో వెల్లడైంది. పరాస్ బ్రాండ్ మసాలాల్లో అయితే ఇది సాధారణ స్థాయి 1 పీపీఎం కంటే మరీ అధికంగా (3.52 పీపీఎం) ఉన్నట్లు గుర్తించారు. సీసం అనేది శరీరానికి అవసరమే అయినా.. ఇది మోతాదుకు మించితే ప్రమాదమేనని, అది శరీరాన్ని విషపూరితం చేస్తుందని ఆహార రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీ సమస్యలు, గుండె జబ్బులు, కాలేయ రుగ్మతలతో పాటు నాడీ సంబంధిత సమస్యలు కూడా అధికమవుతాయని చెబుతున్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్ పోర్టల్‌లో 2,200 వేకెన్సీలు

న్యూఢిల్లీ, అక్టోబరు 4: పీఎం ఇంటర్న్‌షిప్ పోర్టల్‌లో శుక్రవారం నాటికి 2,200 శిక్షణ అవకాశాలు(ఇంటర్న్‌షిప్ వేకెన్సీలు) నమోదైనట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్న ఈ పథకం అమలుకు రూ.800 కోట్లు వ్యయం కానుంది. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి 1.25 లక్షల మంది అభ్యర్థులకు శిక్షణ అందజేయాలన్న లక్ష్యంతో కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఈ పోర్టల్‌ను రూపొందించింది. ఆసక్తికల అభ్యర్థులు ఈ నెల 12 నుంచి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు.

రాయలసీమకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య, దక్షిణ బంగాళాఖాతం, లక్షద్వీప్, దానికి ఆనుకుని ఆగ్నేయ అరేబియా సముద్రంలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఆవరించాయి. ఆగ్నేయ అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం నుంచి కేరళ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. మరోవైపు రాష్ట్రంలో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. వీటన్నింటి ప్రభావంతో శుక్రవారం రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. కోస్తాలోని విగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. తునిలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో రాయలసీమలో ఎక్కువచోట్ల, కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

సమీక్ష అక్కర్లేదు



'ఎస్సీ వర్గీకరణ'పై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

▸ రివ్యూ పిటిషన్ల కొట్టివేత

న్యూఢిల్లీ, అక్టోబరు 4: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ చేసుకోవచ్చని, ఆ అధికారం రాష్ట్రాలకు ఉందంటూ అత్యున్నత న్యాయస్థానం ఆగస్టు 1న తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 మెజారిటీతో ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని విచారించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, విక్రమ్ నాథ్, బేలా త్రివేది, పంకజ్ మిత్తల్, మనోజ్ మిశ్రా, సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం.. తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. "పిటిషన్లు అన్నింటినీ పరిశీలించాం. ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును పరిశీలించాల్సిన అవసరం కనిపించలేదు. పిటిషన్లను కొట్టివేస్తున్నాం" అని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. గతంలో రాజ్యాంగ ధర్మాసనంలో భిన్నమైన తీర్పు ఇచ్చిన ఏకైక జడ్జి జస్టిస్ బేలా త్రివేది కూడా పిటిషన్ల కొట్టివేతకు మద్దతు తెలపడం విశేషం. రివ్యూ పిటిషన్లను కొట్టివేస్తూ గత నెల 24న ధర్మాసనం తీర్పు ఇవ్వగా.. శుక్రవారం దాన్ని అప్‌లోడ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణకు అవకాశం లేదంటూ 2004లో ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ ఏడాది ఆగస్టు 1న సీజేఐ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం తోసిపుచ్చింది. ఎస్సీల రిజర్వేషన్లను వర్గీకరించి, అదే వర్గంలో అత్యంత వెనకబడిన వర్గాలకు ప్రత్యేక కోటాలు కల్పించడానికి పచ్చజెండా ఊపింది. అయితే న్యాయసమీక్షకు లోబడే ఈ వర్గీకరణ ఉంటుందని స్పష్టం చేసింది. నిర్దిష్ట గణాంకాల ఆధారంగా, అత్యంత వెనకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకే దాన్ని ఉపయోగించాలని పేర్కొంది. రాష్ట్రాలు రాజకీయ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటే వాటిని న్యాయస్థానాలు సమీక్షించవచ్చని తెలిపింది.

ఖనిజ సంపదపై పన్ను అధికారం రాష్ట్రాలదే

ఖనిజ సంపదపై రాష్ట్రాలు పన్ను విధించవచ్చంటూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గనులు, ఖనిజాలతో కూడిన భూములపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలకే ఉంటుందంటూ అత్యున్నత న్యాయస్థానం ఈ ఏడాది జూలై 25న సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దేశంలోని గనులు, ఖనిజాలపై కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని పక్కనపెట్టేలా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 8:1 ఆధిక్యంతో తీర్పు ఇచ్చింది. గనులు, ఖనిజాలపై పన్ను విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదేనని, కేంద్రానిది కాదని స్పష్టం చేసింది. ఆ తీర్పును సమీక్షించాలంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషన్లన్నింటినీ పరిశీలించామని.. తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. రివ్యూ పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు గత నెల 24నే తీర్పు వెలువడగా.. ఇటీవల ఆ కాపీని అప్‌లోడ్ చేశారు.

విమర్శించినంత మాత్రాన పాత్రికేయులపై కేసులా?

ప్రభుత్వంపై విమర్శలు చేశారన్న కారణంతో పాత్రికేయులపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని శుక్రవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య దేశాల్లో భావ స్వేచ్ఛ హక్కును గౌరవించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ హక్కుకు రాజ్యాంగంలోని 19(1)(ఏ) అధికరణం ప్రకారం రక్షణ ఉంటుందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తనపై పెట్టిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ రాష్ట్రానికి చెందిన జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'యాదవ్ రాజ్ వర్సెస్ ఠాకూర్ రాజ్' అన్న శీర్షిక కింద 'ప్రభుత్వ యంత్రాంగంలో కుల సమీకరణలపై' ఆ పాత్రికేయుడు ఓ వ్యాసాన్ని రాశారు. కీలక పదవుల్లో అధికారులను నియమించడంలో 'కుల పరంగా మొగ్గు' కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై అభ్యంతరం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం లఖ్‌నవూలోని హజరత్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో గత నెల 20న ఆయనపై కేసు పెట్టింది. భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదయింది. జాతి సమగ్రతకు భంగం కలిగించడం, మతపర విద్వేషాలను రెచ్చగొట్టడం, పరువు నష్టం కలిగించడం సహా పలు ఆరోపణలు చేసింది. దీన్ని కొట్టివేయాలని కోరుతూ ఆయన చేసిన వినతిపై విచారణ జరిపిన ధర్మాసనం..ఇలాంటి కథనాలను ప్రభుత్వంపై చేసిన విమర్శలుగా భావించి క్రిమినల్ కేసులు పెట్టకూడదని తెలిపింది.ఆయనపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకూడదని ఆదేశించింది.

భారత్‌కూ ఐరన్ డోమ్ అవసరం



▸ వైమానిక దళ అధిపతి అమర్ ప్రీత్ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబరు 4 : ఇజ్రాయెల్ దేశానికి ఉన్న ఐరన్ డోమ్ వంటి అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థ మన దేశానికీ అవసరమని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్‌ల ఘర్షణను దృష్టిలో పెట్టుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కొన్ని గగన తల రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేస్తున్నామన్నారు. అటువంటివి ఇంకా అవసరమని చెప్పారు. ఇవి పరిమితంగా ఉన్నందున వాటిని కీలక ప్రాంతాల్లో మోహరించాల్సి ఉందన్నారు. మిగిలిన చోట్ల గగనతల దాడులను ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొన్ని దేశాల మధ్య ప్రస్తుతం జరుగుతోన్న యుద్ధాలు, ఘర్షణల వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆయుధ సరఫరాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. అయితే ఇటువంటి పరిస్థితుల్లోనూ మనకు సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుని, యుద్ధ సన్నద్ధతలో లోపం రాకుండా చూస్తున్నామన్నారు. వైమానికదళ సిబ్బంది నైపుణ్యం పైనా దృష్టి పెట్టామన్నారు. అందుకు నిరంతరం కసరత్తు జరుగుతూ ఉంటుందంటూ.. వాయు శక్తి, తరంగ్ శక్తి, గగన్ శక్తి కార్యక్రమాలను ఆయన ఉదహరించారు. మనకు అవసరమైన యుద్ధ విమానాలు, ఆయుధ వ్యవస్థలకు విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా తేజస్, తేజస్ ఎంకే2, ఏఎంసీఏ, అస్త్ర వంటి ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం అయ్యామన్నారు. 2047కల్లా వైమానిక దళానికి అవసరమైనవన్నీ స్వదేశంలోనే అభివృద్ధి చేసి, ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యమన్నారు. భారత్-చైనా సరిహద్దులో మొత్తంగా పరిస్థితి స్థిరంగా ఉన్నా... చైనా వైపు వేగంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నందున మనవైపు కూడా అంతే వేగంగా చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

వీధి కుక్కలకు నేను సమాధానం చెప్పాలా?

రియల్టర్ విజయ్ తాతా ఆరోపణలపై కేంద్ర మంత్రి కుమారస్వామి వ్యాఖ్య

బెంగళూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చెన్నపట్టణ ఉప ఎన్నిక కోసం రూ.50 కోట్లు డిమాండ్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి విజయ్ తాతా చేసిన ఫిర్యాదు వివాదం మలుపులు తిరుగుతోంది. కేంద్ర మంత్రి కుమారస్వామితో పాటు జేడీఎస్ ఎమ్మెల్సీ రమేష్‌గౌడపై ఆయన ఈ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రతిగా రమేష్‌గౌడ శుక్రవారం అమృతహళ్లి పోలీసు స్టేషన్‌లో రియల్టర్ విజయ్‌పై ఫిర్యాదు చేశారు. వ్యాపారాల్లో నష్టం వచ్చిందని, రూ.100కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని అందులో పేర్కొన్నారు. కోరినంత ఇవ్వకుంటే కేంద్రమంత్రికి వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ బెదిరించారన్నారు. ఇదే విషయమై బెంగళూరులో కేంద్రమంత్రి కుమారస్వామి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. వీధి కుక్కలు, నక్కలకు సమాధానం చెప్పాలా అంటూ విరుచుకుపడ్డారు. కాగా, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు ఆధారాలు చూపాలని విజయ్ తాతాకు పోలీసులు శుక్రవారం నోటీసులిచ్చారు.

30 మందికిపైగా నక్సల్స్ మృతి



(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఛత్తీస్‌గఢ్‌లో ఇది అతిపెద్ద ఎన్‌కౌంటర్ అని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. ఇప్పటికే వరుస ఎన్‌కౌంటర్లలో తీవ్రంగా నష్టపోయిన మావోయిస్టులకు ఇది కోలుకొని దెబ్బని.. మావోయిస్టుల ఏరివేత కోసం ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కొన్నాళ్లుగా కూంబింగ్ చేస్తున్న కేంద్రబలగాలకు ఇది 'అతిపెద్ద విజయం'గా పోలీసులు చెబుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్‌సాయి ట్వీట్ చేశారు. మరో 4 మృతదేహాలు లభ్యమయ్యే అవకాశం ఉందని సమాచారం. ఇది అత్యంత భారీ ఆపరేషన్ అని పేర్కొన్న సీఎం విష్ణు దేవ్‌సాయి, కేంద్ర బలగాలకు అభినందనలు తెలిపారు. గత తొమ్మిదినెలల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రెండుసార్లు ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించారని, 2026 మార్చి వరకు సమస్యకు చరమగీతం పలుకుతామన్నారని ఆయన స్పష్టం చేశారని గుర్తుచేశారు.

దద్దరిల్లిన అబూజ్‌మడ్


శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా నారాయణపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులోని అబూజ్‌మడ్ అడవులు కాల్పులతో దద్దరిల్లాయి. నారాయణపూర్, దంతెవాడ సరిహద్దు నెందూర్, తులతులి అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు సమావేశమైనట్లు బలగాలకు ఇంటెలిజెన్స్ నుంచి శుక్రవారం సమాచారం అందింది. ఈ రెండు జిల్లాలకు చెందిన జిల్లా రిజర్వ్ గార్డు (డీఆర్‌జీ), ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్)తో పాటు ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ బెటాలియన్లకు చెందిన మొత్తం 1200 మంది మావోయిస్టుల కోసం సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఓర్చా, బారాసూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు గోవెల్, నెందూర్, తులతులి సమీపంలో శుక్రవారం ఉదయం అబూజ్‌మడ్‌లో బలగాలు కూంబింగ్ మొదలుపెట్టాయి. ఈ క్రమంలో నెందూర్-తులతులి సమీపంలో మావోయిస్టులు తారసపడి కాల్పులు మొదలుపెట్టడంతో ప్రతిగా బలగాలు తీవ్రంగా స్పందించాయి. ఇరువర్గాల మధ్య భారీస్థాయిలో కాల్పులు జరిగాయి. సాయంత్రం అడవుల్లో గాలించగా 28 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులను గుర్తించాల్సి ఉంది. గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. బలగాల్లో ఎవ్వరికీ గాయాలు కాలేదని బస్తర్ పోలీసులు తెలిపారు. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన 12 భారీ ఎన్‌కౌంటర్లలో 185 మంది మావోయిస్టులు మృతిచెందారు.

మావోయిస్టు పార్టీ 20 ఏళ్ల వార్షికోత్సవాలను సెప్టెంబరు 21 నుంచి నెల రోజుల పాటు నిర్వహిస్తోంది. సమావేశాల్లో 20 ఏళ్లలో మావోయిస్టు పార్టీ ఎదుర్కొన్న ఆటుపోట్లు, అవరోధాలను నక్సల్స్ చర్చించనున్నారు. అడవుల్లో సభలు సమావేశాలు కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది.

గ్రామస్థులూ ఉన్నారా?

ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య గంటగంటకూ పెరిగింది. ఈ క్రమంలో మృతులంతా మావోయిస్టులేనా? లేదంటే వారిలో గ్రామస్థులూ ఉన్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కాంకేర్ జిల్లా అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో 12 మంది గ్రామస్థులను బలగాలు పట్టుకుని చంపాయని గ్రామస్థులు, మావోయిస్టులు ఆరోపించారు. తాజాగా ఎన్‌కౌంటర్‌లో కూడా ఇలానే జరిగిందా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

పాక్ నుంచి సైబర్ నేరగాళ్ల బెదిరింపు.. యూపీలో ఉపాధ్యాయురాలి మృతి



న్యూఢిల్లీ, అక్టోబరు 4: పాకిస్థాన్ నుంచి వచ్చిన ఓ బెదిరింపు ఫోన్ కాల్‌కు తీవ్ర ఆందోళన చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గుండెపోటుతో మరణించారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగింది. ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్న మాలతి వర్మకు గత నెల 30వ తేదీన ఓ ఫోన్ వచ్చింది. 'మీ కూతురు సెక్స్ రాకెట్‌లో ఇరుక్కుంది. ఇప్పటి వరకూ ఆమె మీద కేసు నమోదు చేయలేదు. మీ పరువు ప్రతిష్ఠలు మంటగలవకూడదంటే రూ.లక్ష పంపించండి' అని గుర్తు తెలియని వ్యక్తి ఒకడు బెదిరించాడు. ఆ కాల్ ప్రొఫైల్ పిక్చర్‌గా.. పోలీసు అధికారిలా డ్రెస్సు వేసుకున్న వ్యక్తి ఫొటో ఉంది. దీంతో నిజంగానే ఎవరో పోలీసు తనకు ఫోన్ చేశాడనుకొని తీవ్ర ఆందోళన చెందిన మాలతి.. తన కుమారుడికి ఫోన్ చేసి జరిగింది చెప్పారు. కాల్ ఏ ఫోన్ నుంచి వచ్చిందో ఆ నెంబరు తెలియజేశారు. సదరు నెంబరు +92తో ప్రారంభం కావటంతో, అది పాకిస్థాన్ నుంచి వచ్చిన కాల్ అని మాలతి కుమారుడికి అర్థమైంది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్ నుంచి ఇలా సైబర్ నేరగాళ్లు పోలీసుల్లాగా ఫోన్లు చేసి బెదిరించి డబ్బులు దోచుకుంటున్నారని, భయపడొద్దని తల్లికి ధైర్యం చెప్పాడు. కానీ, మాలతి ఆందోళన తగ్గలేదు. అదే బాధతో స్కూల్ నుంచి ఇంటికొచ్చారు. వస్తూనే తీవ్రమైన ఒత్తిడికి లోనై గుండెపోటుతో కుప్పకూలారు. చుట్టుపక్కలవాళ్లు పరిగెత్తుకొచ్చి ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మాలతి మరణించారు. మరో ఘటనలో ముంబైకి చెందిన ఓ 31 ఏళ్ల మహిళ.. సైబర్ నేరగాళ్ల బారిన పడి రూ.6 లక్షలు పోగొట్టుకున్నారు. గత నెల 26వ తేదీన ఏటీఎంకు వెళ్లిన సదరు మహిళ.. తన మొబైల్‌లోని బ్యాంకు యాప్ ద్వారా కార్డుతో ప్రమేయం లేకుండా రూ.5 వేలు తీసుకోవటానికి ప్రయత్నించారు. అయితే, డబ్బులు రాలేదు కానీ, సీఎం సహాయనిధికి రూ.5 వేలు వెళ్లిపోయాయని సెల్‌కు మెసేజ్ వచ్చింది. దీనిపై ఫిర్యాదు చేయటానికి ఇంటర్నెట్‌లో వెదుకుతున్న క్రమంలో ఆమె సైబర్ నేరగాళ్ల బారిన పడ్డారు. ఆమెకు సహాయం చేస్తామంటూనే వాళ్లు ఆమె బ్యాంకు వివరాలు, పాస్‌వర్డు తెలుసుకొని ఖాతా నుంచి రూ.6 లక్షలు విత్‌డ్రా చేశారు.

ఇజ్రాయెల్ అంతం త్వరలోనే

చేతిలో రైఫిల్‌తో ఇరాన్ సుప్రీం లీడర్ ప్రసంగం



▸ ఐదేళ్లలో తొలిసారి శుక్రవారం సందేశం ఇచ్చిన అయతుల్లా ఖమేనీ

▸ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ముస్లింలంతా ఏకం కావాలని పిలుపు

టెహ్రాన్, టెల్ అవీవ్, అక్టోబర్ 4: ఇజ్రాయెల్ ఇక ఎంతో కాలం మనుగడ సాగించలేదని, త్వరలోనే అంతం అవుతుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. టెహ్రాన్‌లోని మొసల్లా మసీద్ వద్ద శుక్రవారం ప్రార్థనల అనంతరం జరిగిన హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా సంతాప సభలో ఖమేనీ ఇజ్రాయెల్‌పై నిప్పులు కురిపించారు. ఐదేళ్లలో తొలిసారి శుక్రవారం సందేశం ఇచ్చిన ఆయన ఇటీవల ఇజ్రాయెల్‌పై జరిపిన క్షిపణి దాడులను సమర్థించుకున్నారు. 80 ఏళ్ల ఖమేనీ తన చేతిలో రైఫిల్ పట్టుకుని ప్రసంగం కొనసాగించారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తున్న పాలస్తీనా, లెబనాన్‌కు తమ మద్దతు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. హిజ్బుల్లా, హమస్‌పై ఇజ్రాయెల్ ఎప్పటికీ విజయం సాధించలేదని ఆయన జోస్యం చెప్పారు. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా బలిదానం వృథా పోదని, నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. 40 నిమిషాల పాటు ప్రసంగించిన ఖమేనీ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ముస్లింలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. అఫ్ఘనిస్థాన్‌నుంచి యెమెన్ దాకా అంతా ఒక్కటవ్వాలన్నారు. పశ్చిమాసియా వనరులు, భూములను కాజేసేందుకు అమెరికా ఇజ్రాయెల్‌ను పరికరంగా వాడుకుంటోందని ఆయన ఆరోపించారు. గత ఏడాది అక్టోబర్ 7న హమస్ ఇజ్రాయెల్‌పై జరిపిన దాడులను కూడా ఖమేనీ సమర్థించారు.

ఇజ్రాయెల్ ప్రతిదాడి జరిపితే విధ్వంసమే!

అక్టోబర్ ఒకటిన తాము జరిపిన క్షిపణి దాడులకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ కనుక ప్రతిదాడి జరిపితే విధ్వంసం తప్పదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ హెచ్చరించారు. ఇజ్రాయెల్ ప్రతిదాడి చేస్తే తాము ఆ దేశ చమురు కేంద్రాలు, విద్యుత్ స్థావరాలపై దాడి చేస్తామని ఐఆర్‌జీసీ డిప్యూటీ కమాండర్ అలీ ఫదావీ హెచ్చరించారు. మరోవైపు, వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 18 మంది పాలస్తీనీయులు చనిపోయారు. ఇదిలా ఉండగా, యెమెన్‌లోని హౌతీల ప్రధాన స్థావరాలే లక్ష్యంగా అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఇంకా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

హిజ్బుల్లా కొత్త చీఫ్ హతం?

లెబనాన్ రాజధాని బీరుట్‌లో జరిపిన వైమానిక దాడిలో హిజ్బుల్లా కొత్త చీఫ్ హాషిమ్ సఫీద్దీన్ హతమైనట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. అయితే హిజ్బుల్లా ఈ విషయాన్ని ఇంకా నిర్ధారించలేదు. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హతమయ్యాక హాషిమ్ సఫీద్దీన్ వారం క్రితమే కొత్త చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. నస్రల్లాకు దగ్గరి బంధువు కూడా అయిన హాషిమ్ సఫీద్దీన్ ప్రస్తుతం హిజ్బుల్లా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ హెడ్‌గా ఉన్నాడు. మరోవైపు గురువారం జరిపిన దాడుల్లో హిజ్బుల్లా కమ్యూనికేషన్ విభాగం చీఫ్ మహ్మద్ రషీద్ స్కాఫీ హతమైనట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. మరోవైపు, ఇజ్రాయెల్ తాజా వైమానిక దాడులతో లెబనాన్-సిరియా సరిహద్దు వద్ద ప్రధాన మార్గం మూసుకుపోయింది. కాగా, లెబనాన్‌లో 4 రోజుల్లో మొత్తం 250 మంది హిజ్బుల్లా ఉగ్రవాదులు హతమయ్యారని ఐడీఎఫ్ తెలిపింది.


Vijaydigital
The Electronics Super Store Since 1982
Festival Sales
UP TO 60%* OFF
This Dussehra, light up your celebrations with exclusive savings bundles
మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దసరా నవరాత్రుల శుభాకాంక్షలు
FOLLOW US ON Instagram
BAJAJ FINSERV
TVS CREDIT
IDFC FIRST Bank
HDB FINANCIAL SERVICES
HDFC BANK
We understand your world
benow it's easy
onsitego
Expert care for your devices
ICICI Bank 7.5% Cash Back*
₹1* డౌన్ పేమెంట్‌తో 24 నెలలు* వడ్డీ లేకుండా సులభ వాయిదాలతో*
Cash Backs, No Cost EMI*
BAJAJ FINSERV Anywhere EMI*
Follow us on
Upto 50% Off
OLED
CASH BACK
55 (139 cm)
MRP ₹ 2,20,000/-
Offer Price ₹ 1,14,990/-*
T & C Apply*
LED TV
55 UHD (139 cm)
Offer Price ₹ 36,990/-*
43 UHD (108 cm)
Offer Price ₹ 26,990/-*
32 HD (80 cm)
Offer Price ₹ 11,990/-*
Combo
Special Offers on Sound Bars*
Air Conditioners
1.5 Ton Range
Starts from
₹ 29,990/-*
LG
SAMSUNG
BLUE STAR
HITACHI
LLOYD
GENERAL
IFB
Carrier
Panasonic
DAIKIN
Godrej
Whirlpool
Haier
MITSUBISHI
VOLTAS
VESTAR
Haier
190 Ltr Single Door Fridge
Offer Price
₹ 11,990/-*
Haier
240 Ltr Double Door Fridge
Offer Price
₹ 20,990/-*
IFB
6 Kg. Front Load
Offer Price
₹ 22,990/-*
LG
8 Kg. Front Load
Offer Price
₹ 33,990/-*
LLOYD
570 Ltr Side by Side Fridge
Offer Price
₹ 44,990/-*
SAMSUNG
653 Ltr Side by Side Fridge
Offer Price
₹ 68,990/-*
Whirlpool
6.5 Kg. Fully Automatic
Offer Price
₹ 12,990/-*
LLOYD
7.5 Kg. Fully Automatic
Offer Price
₹ 14,490/-*
Galaxy A35 5G
Samsung S24 Ultra
Upto ₹12,000* Cash Back
EMI ₹ 5,000/-*
Samsung A35
Upto ₹5,000* Cash Back
EMI ₹ 3,444/-*
Vivo V40E
Upto 10%* Cash Back
EMI ₹ 3,625/-*
Vivo V40E
Upto 10%* Cash Back
EMI ₹ 4,375/-*
Oppo F27 Pro plus
Upto 10%* Cash Back
EMI ₹ 3,500/-*
Reno 12 Pro
Upto 10%* Cash Back
EMI ₹ 4,625/-*
Premium Kitchen Appliances
(₹20,000/- and above Cash Back)
Chimney Range Starts from
₹ 9,990/-*
(₹20,000/- and above Cash Back)
DELL lenovo hp
Range Starts from
₹ 24,990/-*
Upto ₹10,000* Cash Back + Extended Warranty Offers available*
FREE BAG + KEY BOARD MOUSE*
*Conditions Apply *Selected Models *Cashback on select banks and cards only
KALYANI ADS
OUR STORES
Our Customer Care ✆ 0863-2268838
GUNTUR : Opp. Incometax Office, Lakshmipuram ✆ 0863-2226463, Mahatma Gandhi Inner Ring Road, ✆ 9246655559, Chandana Brothers Complex, Jinna Tower, ✆ 0863-2226464, Haier Exclusive Showroom, Revenue Complex ✆ 0863-2345559, L.G. Best Shopee, ✆ 0863-2336464, Arundelpet, Main Road ✆ 0863-2217717, 27 VIJAYAWADA : Main Road, Poranki ✆ 0866-2499008, 2499009, Bhavanipuram, Swathi Theatre, Road, Sivalayam Center, ✆ 0866-2414193, 2414194, Eluru Road, Gunadala, VIJAYAWADA, ✆ 0866-2999922
MACHILIPATNAM : Opp. Raithu Bazar ✆ 9182053171, TIRUVURU : Ganesh Bomma Centre ✆ 8121437111, NUZIVEEDU : Main Road, Near Municipal office, ✆ 7396476111 MANGALAGIRI : RR Towers, Near Old Bus Stand, ✆ 08645-233664
TENALI : Opp. Saibaba Temple Bose Road, ✆ 08644-226337, Gandhi Chowk, ✆ 08644-238827, 47 ONGOLE : Near Power Office, Prasanna Nilayam, Kurnool Road, ✆ 08592-282620, 282621, Old LIC Office Building, G.T. Road, Ramnager, ✆ 08592-282818
CHILAKALURIPET : Sai Karthik Citi Centre, G.T. Road, ✆ 9640755559, 9640855559 NARASARAOPET : Bank Street, Arundelpet, ✆ 08647-222559, 229559, PIDUGURALLA : Pillutla Road, ✆ 9182053174, AMARAVATHI : Main Road, Beside Church, ✆ 9182053161, PONNURU : G.B.C. Road, Beside Sajja Chandramouli Hospital, ✆ 7093335111 BAPATLA : College Road, Bapatla, ✆ 08643 - 220017 JAGGAYYAPETA : Kodhada Road, Jaggayyapeta, ✆ 9642559111, 7396476111

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పీకే కొత్తపార్టీ

రాజకీయపక్షాలకు, నాయకులకు అద్దెబుర్రలుగా పనిచేస్తూ, ఎన్నికల్లో విజయానికి నానా సలహాలూ ఇచ్చే వ్యూహకర్తలే స్వయంగా ఎన్నికలరంగంలోకి దిగితే విజయం వరిస్తుందా? ప్రచారకర్తలుగా, సలహాదారులుగా తెరవెనుకే మిగిలిపోకుండా, తామే స్వయంగా ఏలికలు కావాలన్న ఆశతో వచ్చే ఆ వ్యూహాత్మక నిపుణులను ప్రజలు ఆదరిస్తారా? ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఒక రాజకీయపార్టీని ఆరంభించి బిహార్ ఎన్నికల బరిలోకి దిగారు. ఎన్నో రాజకీయపక్షాలను గద్దెనెక్కించిన తాను, ప్రజల హృదయాలను గెలవలేనా? అన్న విశ్వాసంతో అక్టోబర్ 2 గాంధీజయంతి నాడు 'జన్ సురాజ్' పార్టీని ప్రకటించారు. వచ్చే ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో, అన్ని స్థానాల్లోనూ పోటీచేసి, అధికం గెలిచి, అధికారాన్ని కైవసం చేసుకోగలనన్నది ఆయన విశ్వాసం. తనమీదతనకు అంత నమ్మకంతో పాటు, బిహార్ ప్రజలమీద ఆయనకు అంత విశ్వాసం ఉన్నందుకు సంతోషించాల్సిందే కానీ, పార్టీ ప్రభావంమీద మాత్రం భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

గాంధీ జయంతినాడు ఆయన మద్యనిషేధం గురించి కాక, ఇప్పటికే ఉన్న నిషేధాన్ని తొలగించి మద్యాన్ని ప్రవహింపచేస్తానని ఆయన ప్రకటించాడు. బిహార్‌లో మద్యనిషేధం అమలు, విజయం మీద భిన్నాభిప్రాయాలున్నాయి. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తన నిర్ణయం సూపర్ హిట్ అని ఎలాగూ చెప్పుకుంటారు. మహిళలు నితీశ్‌ఫోటోను ఆరాధిస్తున్నారని, నిరుపేదల కుటుంబాలు బాగుపడి, కాస్తంత దాచుకుంటున్నాయని ఆయన పార్టీ ప్రచారం చేసుకుంటుంది. మిగతా రాజకీయపక్షాలు ఏవో విమర్శలు చేస్తుంటాయి కానీ, నిషేధం అట్టర్‌ఫ్లాప్ అయినందున దానిని ఎత్తేయాలని అనడానికి మాత్రం సంకోచిస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో, తాను బిహార్‌లో అధికారంలోకి వచ్చిన పావుగంటలో మద్యనిషేధాన్ని ఎత్తేస్తానని, రాష్ట్రంలో కుప్పకూలిన విద్యారంగాన్ని ఉద్ధరించడానికి ఆ సొమ్మును ఖర్చుచేస్తానని పీకే ప్రకటించారు. మద్యం అమ్మకాలద్వారా వచ్చే రాబడి ఎంత, విద్యారంగాన్ని బాగుచేయడానికి ఐదేళ్ళకాలంలో ఎంతకావాలన్న జమాఖర్చులు ఆయన ప్రజలకు విప్పి చెప్పారు.

బిహార్‌కు రావాల్సిన డబ్బును మోదీ తన గుజరాత్‌కు తరలించుకుపోతున్నాడని, కేంద్రం నుంచి బిహార్‌కు రావ్వాల్సినదాన్ని రాష్ట్రనేతలు సాధించడం లేదని కొన్ని రాజకీయవ్యాఖ్యలు విమర్శలు సైతం పీకే చేశారు. ప్రజాకర్షణ వ్యాఖ్యలు, మిగతాపక్షాలపై విమర్శలను అటుంచితే, పార్టీ నిర్మాణం, ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర ప్రజాప్రతినిధుల ఎంపిక ప్రక్రియల విషయంలో 'జన్ సురాజ్' అనుసరించబోయే విధానం భిన్నంగానైతే ఉంది. అమెరికా తరహాలో ఆర్నెల్లముందే అభ్యర్థులను ఎంపిక చేయడం, నెగ్గినవారు నచ్చకపోతే వెనక్కురమ్మనడం వంటి ఆసక్తికరమైన ప్రతిపాదనలున్నాయి. పార్టీ వ్యవస్థాగత నిర్మాణంలోనూ, రేపు ప్రభుత్వంలోనూ ఆయా కులాల జనాభా దామాషా ప్రాతిపదికన పదవుల పంపకాలు ఉంటాయని, ఇటీవలి కులగణనను అందుకు ఆధారంగా చేసుకుంటామని ఆయన ప్రకటించాడు. కమ్యూనిస్టులనుంచి ఆరెస్సెస్ కార్యకర్తలవరకూ అందరూ తనవారేనంటూ, గాంధీ, అంబేడ్కర్ ప్రవచించిన మానవత్వమే తన పార్టీ ఐడియాలజీ అనీ ఆయన చెప్పుకున్నాడు. తాను పదవులకు దూరంగా ఉండటం, పార్టీ అత్యున్నతస్థానాలకు దళితులు, ఓబీసీలు, మైనారిటీలు ఇత్యాది వర్గాలు నాయకత్వం వహించడం, నిర్ణయాలు, విధానాలన్నీ అట్టడుగుస్థాయిలో జరగడం వంటివి మాటలకు మాత్రమే పరిమితమా, రేపు ఆచరణలో కనిపిస్తాయా అన్నది వేరే విషయం.

మహాత్ముడు తొలి సత్యాగ్రహాన్ని ఆరంభించిన చంపారణ్‌నుంచి ప్రశాంత్ కిశోర్ రెండేళ్ళక్రితం తన పాదయాత్ర మొదలుపెట్టి, మూడువేల కిలోమీటర్ల ప్రయాణంలో ప్రజలతో మమేకం కావడమే కాక, పార్టీకి పునాదులు కూడా వేసుకున్నాడు. ప్రధానంగా వ్యవసాయ, భూసంస్కరణలకు కూడా హామీ పడ్డాడు. రాష్ట్రం నుంచి బ్యాంకులకు సమకూరుతున్నదానిలో నాలుగోవంతు మాత్రమే తిరిగి రుణంగా అందుతున్న తీరును మార్చి, రెట్టింపు వ్యాపార, వ్యవసాయ రుణాలు ఎలా తేగలనో కొన్ని లెక్కలు కూడా చెప్పాడు. కాస్తంత పేరున్న రాజకీయ నాయకులు, ఉన్నతస్థాయి మాజీ అధికారులు కొందరు ఇప్పటికైతే ఆయన చుట్టూచేరినమాట నిజం. దశాబ్దాలుగా వెనుకబడిన బిహార్‌ను ఒకటిరెండు దశాబ్దాల్లో ఉద్ధరించడానికి జెఎస్పీకి నిర్దిష్టమైన ఆచరణమార్గాలు ఉన్నాయని వారంతా చెబుతున్నారు. బిహార్ రాజకీయరంగంలో మరోపక్షానికి తగినంత జాగా ఉన్నమాట నిజమే కానీ, పీకే అధికారంలోకి రావడం మాత్రం కల్ల అని కొందరు తీసిపారేస్తున్నారు. ఓ పాతిక ముప్పై స్థానాలు రాకపోవా అని మరికొందరు లెక్కలు వేస్తున్నారు. ఇంతవరకూ ఎంతోమందికి అద్దెబుర్రగా వ్యవహరించిన ప్రశాంత్‌కిశోర్ ఆరంభించిన ఈ పొలిటికల్ స్టార్టప్ భవిష్యత్తు ఎలా ఉంటుందో చూడాలి.

స్వాతంత్ర్య శతాబ్దికి మన భాగ్య చక్రం

నేను ఒక బ్రేకింగ్ న్యూస్ ఇవ్వదలిచాను అయితే ఇది చాలా భిన్నమైనది. చట్టాన్ని ఉల్లంఘించడానికి సంబంధించినది కాదది. తలలు పగులగొట్టడం లేదా గృహాలను ధ్వంసం చేయడం గురించిన న్యూస్ కాదది. గతంలో అనేక పర్యాయాలు వీక్షకులను ఉత్కంఠభరితులను చేసిన బ్రేకింగ్ న్యూస్ కాదది.

హింసాత్మక నేరాల పెరుగుదలను జాతీయ నేరాల నమోదు బ్యూరో నమోదు చేసినప్పుడు అది చట్టాల ఉల్లంఘనకు సంబంధించిన న్యూస్ అవుతుంది. నిఘా బృందాలు ఒక యువ జంటను చావబాదినప్పుడో లేదా ఒక వ్యక్తిని చిత్రవధతో చంపివేసినప్పుడో అది తలలు పగులగొట్టడం, ఎముకలను విరిచివేయడానికి సంబంధించిన న్యూస్ అవుతుంది. కబ్జా చేసిన ప్రదేశాలలో నిర్మించిన గృహాలను కూల్చివేసేందుకు అధికారులు బుల్డోజర్లను వినియోగించినప్పుడు అది ఇళ్ల కూల్చివేత న్యూస్ అవుతుంది. గౌరవనీయ ప్రధానమంత్రి ప్రతిపక్షాన్ని ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీని తుక్డే తుక్డే గ్యాంగ్ అనో లేదా అర్బన్ నక్సల్స్ అనో నిందించినప్పుడు ఆ బ్రేకింగ్ న్యూస్ ఒక పెద్ద ఆవలింతకు కారణమవుతుంది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

నేను మీతో పంచుకోదల్చిన అత్యంత ముఖ్యమైన బ్రేకింగ్ న్యూస్ మీ నమ్మకాలను వమ్ము చేస్తుంది, మీ ఆశలను కూల్చివేస్తుంది. మీ హృదయాలను పగులగొడుతుంది. కె.వి. కామత్ ఒక ప్రముఖ బ్యాంకర్. భారతదేశ అగ్రగామి ప్రైవేట్ బ్యాంక్‌గా ఐసిఐసిఐను అభివృద్ధిపరిచింది ఆయనే. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (బ్రిక్స్ దేశాల బ్యాంక్) ప్రథమ ఛైర్మన్ కూడా ఆయనే. కె.వి. కామత్ ఇప్పుడు నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు.

ఇటీవల ఒక ప్రముఖ దినపత్రికలో ఒక పుస్తకాన్ని సమీక్షించారు. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి మన దేశం 'వికసిత్ భారత్' హోదా పొందేందుకు అనుసరించాల్సిన బాట గురించి ఆయన పేర్కొన్నారు. ఇంతకూ కామత్ సమీక్షించిన పుస్తక రచయిత ఎవరో చెప్పలేదు కదూ? ప్రముఖ ఆర్థికవేత్త కృష్ణమూర్తి సుబ్రమణియన్. 2018 నుంచి 2021 దాకా భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా ఉన్నారు. స్థూల దేశీయోత్పత్తి 12.5 శాతం సగటు వార్షిక పెరుగుదలతో ప్రతి ఆరు సంవత్సరాలకు రెట్టింపు అవుతుందని, తద్వారా 2023లో 3.28 ట్రిలియన్ డాలర్ల నుంచి 2047లో 55 ట్రిలియన్ డాలర్లకు అంటే 16 రెట్లు పెరుగుతుందన్న కృష్ణమూర్తి అభిప్రాయంతో కామత్ ఏకీభవించారు. నేనూ హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాను. అటువంటి సుస్థిరాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవాలని నేనూ వాదించాను.

కామత్ సమీక్షలో చివరి పేరాలు అసంతృప్తి కలిగించాయి. ఆయన పేర్కొన్న అంశాలు సంతోషదాయకమైనవి కావు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను సమగ్ర అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించేందుకు దోహదం చేసే నాలుగు సుస్థిర ప్రాతిపదికలను పేర్కొన్నారు. అవి: స్థూల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం; సమ్మిళిత సామాజిక, ఆర్థిక పురోగతి; ప్రైవేట్ రంగంలో నైతిక పద్ధతులతో సంపద సృష్టి; ప్రైవేట్ పెట్టుబడులకు ప్రాధాన్యం. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఈ అంశాల స్థితిగతులు ఎలా ఉన్నాయో చూద్దాం.



12.5 శాతం సగటు వార్షిక వృద్ధిరేటుతో స్థూల దేశీయోత్పత్తి ప్రతి ఆరు సంవత్సరాలకు రెట్టింపు అవుతుందని, తద్వారా 2023లో 3.28 ట్రిలియన్ డాలర్ల నుంచి 2047లో 55 ట్రిలియన్ డాలర్లకు అంటే 16 రెట్లు పెరుగుతుందన్న కృష్ణమూర్తి సుబ్రమణియన్ అభిప్రాయంతో కామత్ ఏకీభవించారు. నేనూ హృదయ పూర్వకంగా అంగీకరిస్తున్నాను. అటువంటి సుస్థిరాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవాలని నేను వాదిస్తూ వస్తున్నాను.

ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం, వడ్డీరేటు, కరెంట్ ఖాతా లోటు, రుణాలు/ జీడీపీ నిష్పత్తి మొదలైనవి స్థూల ఆర్థికాభివృద్ధి గురించిన స్థూల చిత్రాన్ని అందిస్తాయి. ద్రవ్యలోటు జీడీపీలో 3 శాతంగా ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అది ఇప్పుడు 5.6 శాతంగా ఉన్నది. ద్రవ్యలోటును 3 శాతానికి పరిమితం చేసేందుకు మనం ఇంకా చాలా దూరం పయనించవలసి ఉన్నది. ద్రవ్యోల్బణం ఇప్పటికీ 4 శాతానికి పైగా ఉన్నది. రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు మే 2022 నుంచి 6.5 శాతంగా ఉన్నది. కరెంట్ ఖాతా లోటు 2023–24 ఆర్థిక సంవత్సరాంతానికి 23.2 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అయితే ప్రవాస భారతీయులు పంపిస్తున్న నిధులు మనలను ఆదుకుంటున్నాయి. రుణాలు/ జీడీపీ నిష్పత్తి రేటు 18.7 శాతంగా ఉన్నది. ఇది భరించదగినదే.

సమ్మిళిత సామాజిక ఆర్థిక పురోగతి ఎలా సాధ్యమవుతుంది? అసమానతలను తగ్గించేందుకు మోదీ ప్రభుత్వం విఫల ప్రయత్నం మాత్రమే చేసింది. దీనివల్ల భారీ నష్టం సంభవించింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడి సాంద్ర పరిశ్రమల్లో ప్రభుత్వ మదుపులు, కార్పొరేట్ పన్నుల తగ్గింపు, వినియోగ వస్తువులపై పన్నులు, ఇంధన ధరల పెరుగుదల, చాలీచాలని కనీస వేతనాలు, కౌలు రైతులను నిర్లక్ష్యం చేయడం, తదితర విధానాలు ఎగువన ఉన్న ఒక శాతం మందికి, దిగువన ఉన్న 20 శాతం మందికి మధ్య ఆర్థిక అసమానతలను విపరీతంగా పెంచాయి. విద్వేష ప్రచారాలు, మతోన్మాద ఘర్షణలు సమ్మిళిత సామాజిక అభివృద్ధికి అవరోధమవుతున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థలచే నైతిక పద్ధతుల్లో సంపద సృష్టి విషయాన్ని చూద్దాం. బ్యాంకుల్లో మోసాలు, కార్పొరేట్ కంపెనీల పతనాలు గత పదేళ్లలో గణనీయంగా పెరిగాయి. అనుచిత నిబంధనలు, నియంత్రణల ఎరుగుదల, పన్నుల పాలనా వ్యవస్థ మరింత కఠినంగా ఉండడం మొదలైనవి నైతిక విలువలను పాటించే వ్యాపారవేత్తలను తీవ్రంగా నిరుత్సాహపరుస్తున్నాయి. వారి వ్యాపార నిర్వహణలో క్రమశిక్షణకు భంగం కలిగిస్తున్నాయి. ఎంతో మంది యువ వ్యాపారవేత్తలు విదేశాలకు వలస వెళ్లేందుకు ఆరాటపడుతున్నారు. 4300 మంది భారతీయ మిలియనీర్లు భారత్ నుంచి నిష్క్రమించారు. కాంపిటీషన్ కమిషన్ వాస్తవానికి గుత్తాధిపత్యాలను మాత్రమే ప్రోత్సహిస్తోంది.

పౌర విమానయానం, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, టెలికమ్యూనికేషన్స్, చమురు శుద్ధి, సౌరశక్తి మొదలైన పరిశ్రమలలో పోటీ చాల స్వల్పస్థాయిలో మాత్రమే ఉంది. గుత్తాధిపత్యాలు పెరగడమే అందుకు కారణం. సిమెంట్, ఉక్కు, విద్యుత్, రిటైల్ మొదలైన పారిశ్రామిక, వ్యాపార రంగాలలో పోటీ పెరుగుతుందా లేక తగ్గిపోతుందా అనేది ఒక చర్చించదగిన అంశం. ఈ ధోరణులు పోటీ విపణి ఆర్థిక వ్యవస్థ పురోగతికి దోహదం చేసేవి కావు. కాల పరీక్షకు తట్టుకుని నిలిచిన పోటీ విపణి ఆర్థిక వ్యవస్థలో మాత్రమే ప్రైవేట్ రంగ సంస్థలు నైతిక పద్ధతులలో సంపదను సృష్టించగలుగుతాయి.

ప్రైవేట్ పెట్టుబడుల విషయాన్ని చూద్దాం. అవును, ప్రైవేట్ పెట్టుబడులతో మాత్రమే భాగ్యచక్రం తిరుగుతుంది. దురదృష్టవశాత్తు ప్రభుత్వ మదుపుల కంటే ప్రైవేట్ మదుపులు బాగా వెనకబడి ఉన్నాయి. ప్రభుత్వం ఎంతగా ప్రోత్సహిస్తున్నా, రాయితీలు ప్రకటిస్తున్నా నయాన భయాన చెబుతున్నా ప్రైవేట్ పెట్టుబడులు పెరగడం లేదు వ్యాపారవేత్తలను ప్రభుత్వం విశ్వసించడం లేదు. ప్రభుత్వ సమర్థత, ఉదారతలో వ్యాపారవేత్తలకు నమ్మకం కుదరడం లేదు. పలు వ్యాపార సంస్థలను సంశయాస్పద పద్ధతులలో స్వాధీనం చేసుకుంటున్న తీరుతెన్నులు కూడా వ్యాపార వాతావరణాన్ని సానుకూలంగా ఉంచడం లేదు. 2000 సంవత్సరం నుంచి ఇంతవరకు 8000 భారతీయ కంపెనీలు సింగపూర్‌లో నమోదు అయ్యాయి. దర్యాప్తు సంస్థలు ప్రతి విషయాన్నీ తరచి తరచి చూస్తున్న తీరు వ్యాపారవేత్తలలో భయాందోళనలకు బాగా ఆస్కారమిస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలో మదుపు చేయకుండా భారతీయ వ్యాపార సంస్థలను నిలువరిస్తున్నదేమిటి? సెప్టెంబర్ 2022లో గౌరవనీయ ఆర్థిక మంత్రి అడిగిన ప్రశ్న అది. ప్రస్తావిత అంశాలు అన్నిటిపైనా సాధికారంగా మాట్లాడేందుకు ఉత్కృష్ట అర్హతలు ఉన్న వ్యక్తి కామత్ మాత్రమే.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

గాజా: నేరస్థులు, సహాపరాధులు

హమాస్ 7 అక్టోబర్ 2023న ఇజ్రాయిల్ పౌరులపై ఒక క్రూరమైన దాడికి పాల్పడింది. ఆ ఘాతుకానికి 1100 మందికి పైగా మరణించారు. వారిలో నాలుగింట మూడు వంతుల మంది పౌరులు. ఇజ్రాయిలీ రాజ్యవ్యవస్థ వెన్వెంటనే ప్రతీకార దాడులను ప్రారంభించింది. హమాస్ నియంత్రణలో ఉన్న పాలస్తీనా ప్రాంతం గాజాపై శతఘ్ని గుండ్ల వర్షాన్ని కురిపించింది. వందలాది క్షిపణులను ప్రయోగించింది. పట్టణాలు, పల్లెలు ఎన్నో నేలమట్టమైపోయాయి. ఈ ప్రతీకారాగ్నులు కొద్ది రోజులలో కాకపోయినా కొన్ని వారాలకు నిలిచిపోగలవని ఎవరైనా భావిస్తారు, ఆశిస్తారు. అయితే ఇజ్రాయిలీలు తమ అమానుష దాడులను కొనసాగించారు. అవి ఇప్పటికీ నిర్విరామంగా జరుగుతూనే ఉన్నాయి.

ఏడాది కాలంగా ఎడతెగకుండా జరుగుతున్న ఆ బీభత్సకాండలో 50 వేల మందికి పైగా పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ సేనలు నిర్దాక్షిణ్యంగా హతమార్చాయి. ఈ హతులలో 90 శాతం మంది పౌరులే. ఇజ్రాయిల్ కక్షకు పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు, పడుతున్న యాతనలు అనంతమైనవి, మాటల్లో అభివర్ణించలేనివి. మానవత ఒక మృగతృష్ణగా మిగిలిపోయిన విషాద సందర్భమిది. గాజా జనాభాలో పది లక్షల మందికి పైగా సర్వం కోల్పోయి కట్టుబట్టలతో నిర్వాసితులయ్యారు. గాజాలో విధ్వంసం అనంతరం ఇజ్రాయిల్ ఇప్పుడు తన దృష్టిని లెబనాన్ పైకి సారించింది. గాజాలో మాదిరిగానే లెబనాన్‌లో కూడా ఉగ్రవాదులు, అమాయక పౌరుల మధ్య తేడాను పాటించకుండా ఇజ్రాయిల్ సేనలు మారణ హోమం చేస్తున్నాయి. నిర్దిష్ట వ్యక్తులను తుదముట్టించే ప్రయత్నంలో వందలాది లెబనీస్ పౌరులను ఇజ్రాయిల్ బలిగొన్నది. ఇంకా ఎన్నో వేల మంది నిరాశ్రయులైపోయారు.

ఇజ్రాయిల్ ప్రభుత్వమూ, హమాస్ రెండూ యుద్ధ నేరాలకు పాల్పడ్డాయని ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసిసి) అభిశంసించింది. ఇది పూర్తిగా న్యాయసమ్మతమైన తీర్పు. ఈ యుద్ధం చారిత్రక ఘటనల పరంపరలో భాగంగా సంభవిస్తోందని వాదించేందుకు ఎంతగా ప్రయత్నించినా గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ కిరాతక దాడులు సమర్థించలేనివి. ఇజ్రాయిల్ నేరాలు అంతకంటే తీవ్రమైనవి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. హమాస్‌పై ప్రతీకారం తీర్చుకునే నెపంతో ఇజ్రాయిల్ విచక్షణారహితంగా అమానుష దాడులకు పాల్పడుతోంది. గాజాలోని పాఠశాలలు, ఆసుపత్రులను పూర్తిగా నేలమట్టం చేసింది. వేలాది పాలస్తీనియన్లను హతమార్చడంతో పాటు గాజా వాసులకు ఆహారం, మంచినీరు, విద్యుత్ సరఫరాలపై కఠిన ఆంక్షలు విధించింది. ఫలితంగా అసంఖ్యాకులు ఆకలిమంటల బారిన పడ్డారు.



ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో మధ్యప్రాచ్య సంక్షోభంపై చర్చలో స్లోవేనియా ప్రధానమంత్రి పాల్గొంటూ గాజాలో యుద్ధాన్ని నిలిపివేయమని బెంజమిన్ నెతన్యాహుకు నిష్కర్షగా చెప్పారు. 'లెబనాన్ తదుపరి గాజా కాకూడదని' ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి చాలా దూరదృష్టితో హెచ్చరించారు. స్లోవేనియా, ఆస్ట్రేలియా రెండూ అమెరికాకు సన్నిహిత దేశాలే అయినప్పటికీ అవి తమ అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పాయి. ఆ ధైర్యం మన ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రిలో పూర్తిగా కొరవడింది!

గాజాలో ఘర్షణలపై వార్తా నివేదన ప్రధానంగా స్పర్థిస్తున్న పక్షాల (ఇజ్రాయిలీలు, హమాస్) పరంగా ఉంటోంది. అయితే ఆ ఘర్షణలకు కారకులవడంతో పాటు అవి నిరంతరాయంగా కొనసాగేలా చేస్తున్న ఇతర బృందాల, దేశాలపై ఈ కాలమ్‌లో నేను దృష్టి పెడుతున్నాను. సమస్త యుద్ధ నేరాలలో కానప్పటికీ చాలా వాటిలో నేరస్థులకు సహాపరాధులు ఉన్నారు. ఒక వైపు హమాస్‌కు, మరో వైపు ఇజ్రాయిల్‌కు తోడ్పడుతున్నది ఎవరు? హమాస్‌కు ప్రధానంగా తోడ్పడుతున్నది మత ప్రమేయ రాజ్యమైన ఇరాన్, లెబనాన్‌లోని ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లా. పాశ్చాత్య దేశాల మీడియా ప్రతిరోజూ ఇరాన్, హెజ్‌బొల్లాను తప్పు పడుతున్నాయి. మధ్య ప్రాచ్యంలో యుద్ధాగ్నులు అంతకంతకూ ప్రజ్వరిల్లడానికి బాధ్యత ఇరాన్, హెజ్‌బొల్లాదేనని తెగేసి చెపుతుంటాయి. మరి ఇజ్రాయిల్‌కు తోడ్పడుతున్న దేశాలను గుర్తించి, ఆక్షేపించేందుకు పాశ్చాత్య మీడియా సంకోచిస్తోంది. అవి చెప్పని వాస్తవాలను మనం చెప్పి తీరాలి.

ఇజ్రాయిల్ నేరపూరిత చర్యలను సమర్థిస్తున్నదీ, ప్రోత్సహిస్తున్నదీ అమెరికాయే. ఈ అగ్రరాజ్యం ఇజ్రాయిల్‌కు ఎడతెగకుండా ఆయుధ సరఫరా చేస్తోంది. గాజాను (ఇప్పుడు లెబనాన్‌ను) అతలాకుతలం చేసేందుకు అవసరమైన సైనిక సామగ్రిని ఇజ్రాయిల్‌కు అమెరికానే సమకూరుస్తోంది. ఇజ్రాయిల్‌కు ఆయుధాలనే కాదు దౌత్యపరమైన అండదండలు సైతం అమెరికా ఇస్తోంది. కాల్పుల విరమణ పాటించాలని, పాలస్తీనా పౌరుల కష్టనష్టాలను నివారించాలని ఐక్యరాజ్యసమితిలో వివిధ దేశాలు ప్రతిపాదించిన తీర్మానాలను అమెరికా వ్యతిరేకిస్తోంది. భద్రతా మండలిలో ఇజ్రాయిల్ వ్యతిరేక నిర్ణయాలను వీటో చేస్తోంది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఇజ్రాయిల్ ఘాతుకాలలో తన భాగస్వామ్యాన్ని గుర్తించేందుకు అమెరికా నిరాకరిస్తోంది. కొద్ది రోజుల క్రితం అమెరికా మాజీ ప్రథమ మహిళ, మాజీ సెనేటర్, మాజీ విదేశాంగ మంత్రి, గతంలో అధ్యక్ష పదవీ ఎన్నిక అభ్యర్థి అయిన హిల్లరీ క్లింటన్‌తో చేసిన ఒక ఇంటర్వ్యూను విన్న తరువాత ఆ వాస్తవం నాకు విశదమయింది. కొలంబియా విశ్వవిద్యాలయం (ఇప్పుడు ఆమె అక్కడ విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు)లో బోధనా నుభవాల గురించి ఆమెను ప్రశ్నించారు. ఆమె అక్కడ విజిటింగ్ ప్రొఫెసర్‌గా చేరిన కొద్ది కాలానికే గాజాలో ఇజ్రాయిల్ మారణకాండకు నిరసనగా విద్యార్థులు ఆందోళనకు దిగారు (ఒక్క కొలంబియాలోనే కాదు, అమెరికా అంతటా పలు విశ్వవిద్యాలయాలలో ఇజ్రాయిల్ వ్యతిరేక నిరసనలు పోటెత్తాయి). హిల్లరీ క్లింటన్ ఆ నిరసనలను తూష్ణీభావంతో కొట్టి వేశారు. 'వెలుపల' నుంచి అందుతున్న మద్దతుతో అవి ప్రారంభమయ్యాయని ఆమె గట్టిగా అభిప్రాయపడ్డారు. విద్యార్థి నిరసనకారులలో పలువురు యూదు వ్యతిరేకులు కూడా ఉన్నారని ఆమె ఆరోపించారు. తన ఆరోపణకు ఆమె ఎటువంటి రుజువులు చూపలేదు. 'బయటి' నుంచి వచ్చి ఆందోళనలను రెచ్చగొట్టినవారు బహుశా ఉండవచ్చునేమో కానీ నిరసనకారులలో అత్యధికులు సంబంధిత విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులే ననడంలో సందేహం లేదు. తమ అంతరాత్మ ప్రేరణతోనే వారు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఉద్యమించడం జరిగింది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఆ నిరసనకారులలో యూదు విద్యార్థులు కూడా చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారన్నది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం.

గాజాలో యుద్ధం ప్రారంభం కావడానికి చాలా కాలం ముందు నుంచే అంతర్జాతీయ న్యాయ నియమాలను ఇజ్రాయిల్ యథేచ్ఛగా ఉల్లంఘించేందుకు అవసరమైన మద్దతును అమెరికా అధ్యక్షులు, అమెరికా ప్రభుత్వాలు సంపూర్ణంగా సమకూరుస్తున్నాయి. పాలస్తీనా ప్రాంతాలలో యూదుల జనావాసాల విస్తరణకు అమెరికా మద్దతు నిచ్చింది. ఇజ్రాయిల్ దుందుడుకు చర్యలను అమెరికా మృదువుగా ఆక్షేపించినప్పటికీ ఆ యూదు దేశాన్ని నిలువరించేందుకు ఎటువంటి నిర్దిష్ట చర్యలు చేపట్టలేదు.

అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడంలో ఇజ్రాయిల్‌కు ప్రధానంగా తోడ్పడుతున్నది అమెరికాయే, సందేహం లేదు. బ్రిటన్, ఫ్రాన్స్ జర్మనీ సైతం ఇజ్రాయిల్ సహాపరాధులేనని చెప్పాలి. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే మన భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం కూడా ఈ యుద్ధం విషయంలో నిర్దోషి కానే కాదు.. ఇజ్రాయిల్ దాడుల్లో మరణిస్తున్న పాలస్తీనియన్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇటువంటి విషమ సందర్భంలోనైనా మనం ఆత్మ పరిశీలనతో అమెరికన్లకు భిన్నంగా వ్యవహరించడం మన విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా ఉండదూ?

మన ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు కనీసం రెండు విధాలుగా తోడ్పడుతోంది: (1) గాజాలో కాల్పుల విరమణ పాటించి, అంతర్జాతీయ చట్టాలకు ఇజ్రాయిల్ నిబద్ధమవాలని పిలుపునిస్తూ ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ ఆమోదించిన తీర్మానాలకు భారత్ మద్దతునివ్వలేదు; ఇజ్రాయిల్ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడేందుకై భారతీయ వలస కార్మికులను ఆ యూదు దేశానికి పంపడం. బీజేపీ పాలిత రాష్ట్రాలు ఈ వలసలను బాగా ప్రోత్సహించాయి.

ఇజ్రాయిల్‌కు ప్రస్తుత భారత ప్రభుత్వమిస్తున్న మద్దతుకు రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి వ్యక్తిగతమైనది. నరేంద్ర మోదీ, బెంజమిన్ నెతన్యాహుల మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న స్నేహసంబంధాలు; రెండోది సైద్ధాంతిక సంబంధమైనది. మతాన్ని రాజ్యపాలనతో ఇజ్రాయిల్ మేళవించిన తీరుతెన్నులు హిందుత్వవాదులకు బాగా నచ్చింది. పైగా ముస్లింలను 'ఇతరులు'గా పరిగణించడంలో ఇజ్రాయిల్, భారత పాలకవర్గాలలో ఒక ఏకీభావమున్నది.

ఇజ్రాయిల్ పక్షం వహించి ఆ దేశం పాల్పడుతున్న హింసాకాండను మన్నించడం ద్వారా భారత్ అంతర్జాతీయంగా తన స్థాయిని తానే తగ్గించుకున్నది. గత నెల ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో మధ్యప్రాచ్య సంక్షోభంపై చర్చ జరిగినప్పుడు 'శాంతి' గురించి భారత్ నిరర్థక, చిత్తశుద్ధిలేని మాటలు మాట్లాడింది. అదే చర్చలో స్లోవేనియా ప్రధానమంత్రి పాల్గొంటూ గాజాలో యుద్ధాన్ని నిలిపివేయమని బెంజమిన్ నెతన్యాహుకు నిష్కర్షగా చెప్పారు. ఆ తరువాత ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి మాట్లాడుతూ కాల్పుల విరమణ పాటించాలన్న ఐక్యరాజ్య సమితి పిలుపును పునరుద్ఘాటించారు. 'లెబనాన్ తదుపరి గాజా కాకూడదని' ఆయన చాలా దూరదృష్టితో హెచ్చరించారు. స్లోవేనియా, ఆస్ట్రేలియా రెండూ అమెరికాకు సన్నిహిత దేశాలు. అయినప్పటికీ అవి తమ అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పాయి. ఆ ధైర్యం మన ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రిలో పూర్తిగా కొరవడింది! మధ్య ప్రాచ్యంలో ఏకైక ప్రజాస్వామిక దేశంగా ఇజ్రాయిల్ వాసికెక్కింది. ప్రపంచంలో అత్యంత సంపద్వంత, శక్తిమంతమైన ప్రజాస్వామిక దేశం అమెరికా. ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా భారత్ ఆత్మస్తుతి చేసుకోవడం పరిపాటి. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు పెచ్చరిల్లిపోవడంలో ఈ దేశాలు అందిస్తున్న అండదండల నేపథ్యంలో ఆ ఘనతలు ప్రయోజనశూన్యమైనవి కావూ? ఆ స్వీయ ప్రశంసలు బోలు మాటలుగా మాత్రమే చరిత్రలో ప్రతిధ్వనిస్తాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఎయిడెడ్ విలీనం.. జగన్ రాజకీయం!

విద్యా రంగంలో గత ప్రభుత్వం తీసుకొన్న అనాలోచిత నిర్ణయాలలో ఎయిడెడ్ సంస్థల సిబ్బందిని ప్రభుత్వ సర్వీస్‌లో విలీనం చేయడం ఒకటి. ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన ఎయిడెడ్ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వంలో కొనసాగుతున్న అధ్యాపకుల సర్వీస్‌కు సమానంగా ఎయిడెడ్ సిబ్బందిని కూడా విలీనం చేసేసి, తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్న చందాన వ్యవహరించింది. గత ప్రభుత్వం ఎయిడెడ్, ప్రభుత్వ సంస్థలలో పనిచేసే ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రత్నప్రభ ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ సూచనలతో, కొందరు అధికారుల సలహాలతో హడావుడిగా అనాలోచిత నిర్ణయం తీసేసుకొని ఎయిడెడ్‌లో పనిచేసే సిబ్బందిని రాత్రికి రాత్రే తక్షణం ప్రభుత్వ విద్యాసంస్థల్లో రిపోర్ట్ చేయమని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం దాని పర్యవసానాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కళాశాలల్లో విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువులు, అలాగే విద్యాసంస్థల కార్యాలయాలలో పరిపాలనను నిర్వహించే అధ్యాపకేతర సిబ్బందిలో ప్రమోషన్ల కొరకు పోట్లాడుకొనే పరిస్థితి వచ్చింది. ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులకు మంచి విద్యాబోధన కల్పించి, వారు ముందుకు సాగేలా చూడాల్సిన ఉన్నత విద్యారంగ సిబ్బంది, విద్యాసంస్థల్లో రాజకీయ వాతావరణాన్ని కల్పించి ఎలాగైనా కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనే పన్నాగాలకు నాంది పలికారు.

వాస్తవానికి ఎయిడెడ్ సిబ్బందికి గతంలో కూడా వేతనాలు ప్రభుత్వం ద్వారానే చెల్లిస్తున్నా వారిమీద నియంత్రణ ప్రభుత్వం చేతిలో గాకుండా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండేది. దీనిని అవకాశంగా తీసుకొన్న కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ఉద్యోగాలను అమ్ముకోవడం, తమ సంస్థల్లో విద్యార్థుల అడ్మిషన్లను ఎక్కువ చూపి, వారికి వచ్చే ఉపకార వేతనాలు తమ స్వంత ఖాతాల్లోకి మళ్లించుకోవడం, దాతల ద్వారా వచ్చిన ఆస్తులను కమిటీల పేరుతో అమ్మేసుకోవడం వంటివి జరిగేవి. వీటన్నింటికీ గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే స్వస్తి చెప్పే విధానానికి శ్రీకారం చుట్టి, ప్రైవేట్ ఎయిడెడ్ విద్యాసంస్థలను ఒక గాడిన పెట్టగలిగారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ ఎయిడెడ్ ఆస్తులపై కన్నేసి, వివిధ రకాలుగా విద్యాసంస్థల యాజమాన్యాన్ని భయపెట్టి, అందులో పనిచేసే సిబ్బందిని ఉన్నపళంగా ప్రభుత్వంలో విలీనం చేసి వారిని త్రిశంకుస్వర్గంలో నెట్టివేసింది. ఇప్పుడు కొంతమంది వారి అనుకూల సంఘాలలోని సిబ్బందితో ఈ విలీనాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను రద్దుపరచి, ఎయిడెడ్ విద్యాసంస్థలకు పూర్వవైభవం తీసుకురావాలని ఆందోళనలకు శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వ సర్వీస్‌లోని ఎయిడెడ్ సిబ్బందిని వెనుకకు పంపాలంటే అనేక కోర్టు కేసులు, సర్వీస్ నిబంధనలు ఉంటాయి. గత ప్రభుత్వం ఎయిడెడ్‌లో రద్దు చేసిన సుమారు 2000 ఉద్యోగులను ప్రస్తుత ప్రభుత్వం తిరిగి ఎయిడెడ్‌కు కేటాయించినా, అక్కడ వారికి విద్యార్థులు లేక ఎటువంటి బోధనాపని లేకున్నా, వారిని కూర్చోబెట్టి వేతనాలను చెల్లించాలి. ఇది ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని ఆర్థికంగా ఇరుకున పెట్టడమే. ఉన్నత విద్యా కార్యాలయం, కాలేజియేట్ కమిషనర్ కార్యాలయంలోని అధికారులు... ఇంకా గత వైసీపీ ప్రభుత్వానికి మేలు కలిగేలా చేసిన కొంతమంది ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే సిబ్బందిని రెచ్చగొట్టి, ఆందోళనలకు మద్దతు ఇస్తూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశంతో ఇప్పుడిప్పుడే విద్యారంగాన్ని గాడిని పెడుతున్నా, కొంతమంది అధికారుల అనాలోచిత నిర్ణయాలు దీనికి మేలు కన్నా కీడు చేసే ప్రమాదం ఉంది. ఏది ఏమైనా రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలలో జరుగుతున్న పరిణామాల పట్ల నిఘా వుంచి, బడుగు బలహీన విద్యార్థులకు నాణ్యమైన, చక్కటి విద్యను ప్రభుత్వం అందించాలి.

— గోవిందు సురేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రభుత్వ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్

బాలగోపాల్ సంస్మరణ సదస్సు

సంక్లిష్టమైన భారత సామాజిక జీవితంలో అసమానతలు భిన్నపాయలుగా పెనవేసుకుపోయిన స్థితిలో, వాటిని రూపుమాపటానికి మనం చేయవలసిన కృషిని తన జీవితాచరణ ద్వారా మనకు మార్గదర్శనం చేశాడు బాలగోపాల్. అంతరాలు నిండిన, అసమానతలతో కూడుకున్న సమాజం మనుషులకు వైకల్యంతో కూడిన ప్రాపంచిక దృక్పథాన్ని మాత్రమే అందించగలదని, మనుషులను మనుషులుగా చూడగలిగే మానవీయ దృక్కోణాన్ని సంకల్పపూర్వకంగా అలవర్చుకోవలసినదిగా, దానికి వైయక్తిక సంకల్పమే కాదు, సామాజిక ఆచరణ కూడా అంతే అవసరం అని చెప్పినవాడు బాలగోపాల్. ఈ సమానత్వ ప్రాపంచిక దృక్కోణాన్ని, మానవ ఆచరణను, సామాజిక నీతి నియమాలు, నిబంధనలు ఎంతగా ప్రభావితం చేస్తాయో కూడా తన రచనల ద్వారా ఆయన వివరించాడు. ఒక్క మానవ తాత్వికతను మాత్రమే కాదు, దాని సామాజిక చలన సూత్రాలను, సామాజిక ఉద్యమాలలో దాని మూలాలను విశ్లేషించి విడదీయరాని సంబంధాన్ని నెలకొల్పిన ఉద్యమకారుడు కూడా ఆయనే. తన జీవితాన్ని ఈ సామాజిక తాత్విక దృక్పథానికి ఒక తిరుగులేని ప్రయోగశాలగా మార్చిన అతి అరుదైన వ్యక్తి ఆయన. మరణించి (8 అక్టోబర్, 2009) పదిహేనేళ్ళు గడుస్తున్నా అతని ప్రాసంగికత ఇప్పటికీ స్థిరంగా ఉన్నది. ఆయన ఈ రోజు లేకపోవచ్చు కానీ, అందించిన తాత్విక దృక్పథం రచనల ద్వారా అందుబాటులోనే ఉన్నది. తెలుగు సమాజం ఇప్పుడు ఎదుర్కొంటున్న అనేక సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ సమస్యలకు ఆయన రచనలలో పరిష్కారాలు లభిస్తాయి.



అక్టోబర్ 6, ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ బాలగోపాల్ 15వ సంస్మరణ సదస్సు జరుగుతుంది. ఈ సందర్భంగా మూడు ప్రసంగ కార్యక్రమాలు–పాలస్తీనాలో ఇజ్రాయిల్ నరమేధం మీద రచయిత అచిన్ వనైక్ ప్రసంగం, ప్రజా ఉద్యమాల్లో క్వీర్ భాగస్వామ్యంపై క్వీర్ రైట్స్ యాక్టివిస్ట్ తాషీ జోసెఫ్ ప్రసంగం, డిజిటల్ మీడియా సెన్సార్‌షిప్–నియంత్రణల మీద ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అపర్ గుప్తా ప్రసంగం–ఉంటాయి. అలాగే, హ్యూమన్‌రైట్స్ ఫోరమ్ ప్రచురించిన మూడు పుస్తకాలు– ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై బాలగోపాల్ తెలుగు–ఇంగ్లిష్ వ్యాసాల సంకలనం, బీలకోసం–బతుకుకోసం–సోంపేట ఉద్యమచరిత్ర, చత్తీస్‌గఢ్ బస్తర్ డివిజన్‌లో పరిస్థితులపై సిటిజన్ రిపోర్ట్–ఆవిష్కరణలు జరుగుతాయి. వీటితోపాటు ఉమర్ ఖాలీద్–ఇతర తోటి రాజకీయ ఖైదీలపై లలిత్ వచానీ రూపొందించిన డాక్యుమెంటరీ 'ప్రిజనర్ నం.626710 ఈజ్ ప్రెజెంట్' ప్రదర్శన ఉంటుంది.

— టి.హరికృష్ణ (మానవ హక్కుల వేదిక)

డిక్లరేషన్‌పై అనవసర రాద్ధాంతం!

హిందువుల మనోభావాలతో ఆడుకుంటూ డిక్లరేషన్‌పై మాజీ సీఎం జగన్‌రెడ్డి అనవసర రాద్ధాంతం చేసారు. ఆలయాలకు సంప్రదాయాలు, నిబంధనలు ఉంటాయి. అన్యమతస్తులు ఎవరైనా ఆలయంలోకి వెళ్లాలంటే ఆ నియమాలు పాటించి తీరాల్సిందే. ఈ నియమాలు కేవలం ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలకు, హిందుమతానికే పరిమితం కాదు. దేశంలో అన్ని ఆలయాలలో నియమాలు పాటించాలి. పూరి జగన్నాథ్ ఆలయం, కేరళ గురువాయూర్ ఆలయం, వారణాసి కాశీ విశ్వనాథుని ఆలయం, భువనేశ్వర్‌లోని లింగరాజ్ ఆలయం, కేరళ అనంత పద్మనాభస్వామి ఆలయం, తమిళనాడు కామాక్షి అమ్మ ఆలయం, రాజస్థాన్ దిల్వారా ఆలయం... ఇలా ఎన్నో చోట్ల ఆలయాల్లోకి హిందువులకి మాత్రమే అనుమతి ఉంది. ఆఖరికి పొరుగు దేశం నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయంలోకి హిందువులకి మాత్రమే అనుమతి ఉంది. వేరే మతస్థులు హిందూ ఆలయాల్లోకి వెళ్లి, తెలిసో తెలియకో తమ మత పద్ధతుల ప్రకారం ప్రార్థన చేస్తే లోపల గొడవలు అయ్యే అవకాశముంటుంది. అందువల్ల ఆ గుడి ప్రార్థనా పద్ధతులు, నియమాల సమాచారం తెలుసుకుని, వాటికి అనుగుణంగా ఉంటానని డిక్లరేషన్ ఇవ్వాలి.

శ్రీవారిని దర్శించుకునేందుకు ముందుగా డిక్లరేషన్ ఫారంపై సంతకం చేసే సంప్రదాయం బ్రిటిష్ కాలం నుంచే అమల్లో ఉంది. ఇతర మతాలకు చెందిన వ్యక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తే కచ్చితంగా డిక్లరేషన్ ఇవ్వాలని 1990 ఏప్రిల్ 11న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవాదాయ శాఖ చట్టం 30/1987ని అనుసరించి జీఓను విడుదల చేసింది. చేతిలో అధికారం ఉందని అన్యమతస్తుడైన జగన్‌రెడ్డి ఆలయంలోకి డిక్లరేషన్ లేకుండానే ప్రవేశించారు. గతంలో పని చేసిన టీటీడీ ఛైర్మన్ జగన్ సేవలో తరించారు కాబట్టి డిక్లరేషన్‌ను పక్కనబెట్టారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకొంటానని, తర్వాత రద్దు చేసుకోవడం ద్వారా జగన్ తన వికృత నైజాన్ని మరోసారి చాటుకొన్నారు. హిందూ ఆచారాలకు, సంప్రదాయాలకు తాను వ్యతిరేకినని బయటపెట్టుకొన్నాడు. దళితులు కూడా హిందువులేనని, వారికి తిరుమల శ్రీవారిని దర్శించుకొనే హక్కు వుందని జగన్‌రెడ్డి తెలుసుకోవాలి. డిక్లరేషన్‌పై సంతకం చెయ్యడం ఇష్టం లేకనే కులాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సీఎంగా పనిచేసిన జగన్‌రెడ్డికి టీటీడీ విధించిన నిబంధనలు మతానికో, కులానికో కాదని తెలియదా? తిరుమల శ్రీవారి ఆలయంలో డిక్లరేషన్ మీద సంతకం చేయాల్సి వస్తుందని, ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే జగన్‌రెడ్డి తిరుమల దర్శనాన్ని రద్దుచేసుకొని, పైగా తనను అడ్డుకొన్నారని సాకులు చెప్పారు.

దేశవ్యాప్తంగా ఇతర మతస్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నప్పుడు డిక్లరేషన్ ఇస్తారు. అంతమాత్రాన వారు తమ సొంత మతాన్ని వదులుకున్నట్లు కాదు, తమ ఆచారాలను వదిలేసినట్లూ కాదు. గతంలో అనేక మంది ప్రముఖులు ఎలాంటి భేషజాలకు పోకుండా డిక్లరేషన్‌పై సంతకం చేశాకే దర్శనానికి వెళ్లారు. వెంకటేశ్వరస్వామి దర్శనానికి తాను వెళ్లకుండా ఆంక్షల పేరిట అడ్డుకుందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేసి, పర్యటనను రద్దు చేసుకొన్న జగన్‌రెడ్డి బెంగళూరు వెళ్లిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో పూజలు చేయాలంటూ వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన ఆయన కార్యక్రమం అమలు తీరునూ సమీక్షించ లేదు. సాకులు చెబుతూ దైవదర్శనాన్ని రద్దు చేసుకుని అనవసర రాద్ధాంతం చెయ్యడమేమిటని ప్రజలు విస్తుపోతున్నారు.

— నీరుకొండ ప్రసాద్


దసరా సూపర్ సేల్
upto 50% OFF
BAJAJ FINSERV
₹10000 Cash Back
HDB Cash Back ₹21000
Gold Coin FREE
for purchases ₹50000 & above
SATHYA
SPREADING HAPPINESS
Assured GIFT
iPhone16 (128)
EMI ₹3329
EMI Per Day ₹107
Flat 30% off on
iPhone16 Plus (128)
EMI ₹3746
EMI Per Day ₹121
Flat 30% off on
oppo
F27 Pro Plus 5G
(8+128 GB)
EMI ₹1749
Cash Back ₹2099
Per Day EMI ₹58
SAMSUNG
Galaxy S24 5G
19% OFF
EMI ₹2708
0 Down Payment
₹12000 Cash Back
Per Day EMI ₹90
Buy Any Mobile Phone worth ₹10,000 - ₹20,000 & Get Swiss Militry Power Bank OR Swiss Miltry Neckband FREE
Buy Any Mobile Phone worth ₹20,000 - ₹30,000 & Get Hapipola Earbuds FREE
Buy Any Mobile Phone worth ₹30,000 & above & Get Calling Smartwatch FREE
Buy 1+1 Combo Calling Smartwatch ₹12000 worth ₹1999 only
SAMSUNG vivo oppo xiaomi realme
Buy 75" UHD TV
32" Android TV FREE
Buy 65" OLED TV
₹9999 worth Samsung 4G Smartphone FREE
Buy 55" OLED TV
₹12999 worth Samsung 5G Smartphone FREE
Buy 55" UHD TV
₹22990 worth Sound Bar FREE
Buy 55" QLED TV
₹30900 worth Sound Bar FREE
Buy 55" UHD TV
₹9990 worth Web Cam FREE
Buy 43" QLED TV
₹15499 worth Sound Bar FREE
BPL UHD Smart TV
32" 38% OFF
43" 30% OFF
55" 57% OFF
impex UHD Google TV
32" 42% OFF
43" 50% OFF
55" 43% OFF
upto ₹15000 Cash Back
Fixed EMI ₹1999
1 EMI FREE
SONY SAMSUNG LG Haier Panasonic LLOYD BPL TCL HappyU ONIDA impex
1.5 Ton 5 Star Inverter AC
₹9,399 worth Microwave Oven FREE
1.5 Ton 3 Star Inverter AC
₹5,620 worth 3L Instant Water Heater FREE
Cash Back upto ₹4000
Fixed EMI ₹1888
VOLTAS LG BLUE STAR DAIKIN Haier Carrier GENERAL SAMSUNG Godrej Panasonic HITACHI LLOYD IFB ONIDA
Haier
190 Ltr Single Door Direct Cool Fridge
35% OFF
EMI ₹1333
Whirlpool
184 Ltr Single Door Direct Cool Fridge
25% OFF
EMI ₹1249
Godrej
253 Ltr Double Door Frost Free Fridge
26% OFF
EMI ₹2083
SAMSUNG
236 Ltr Double Door Frost Free Fridge
25% OFF
EMI ₹2249
Stabilizer + Stand
LG
185 Ltr Single Door Direct Cool Fridge
25% OFF
EMI ₹1249
VOLTAS beko
230 Ltr Single Door Direct Cool Fridge
50% OFF
EMI ₹1424
Haier
240 Ltr Double Door Front Free Fridge
39% OFF
EMI ₹1833
BPL
500 Ltr Side by Side Dios Fridge
39% OFF
EMI ₹3833
SAMSUNG
653 Ltr Side by Side Dios Fridge
44% OFF
12.5% Cash Back
LG
617 Ltr Mood Up Series Refrigerator
FIXED EMI ₹9999
MRP ₹365399
upto ₹35000 Cash Back
VOLTAS beko
7.5 Kg Top Load Fully Automatic Washing Machine
50% OFF
EMI ₹1499
LG
8.0 Kg Top Load Fully Automatic Washing Machine
47% OFF
EMI ₹1666
SAMSUNG
8.0 Kg Top Load Fully Automatic Washing Machine
39% OFF
EMI ₹1666
LG
9 KG Front Load Washing Machine
20% Cash Back Maximum ₹20000
EMI ₹2999
SAMSUNG
12 KG Front Load Washing Machine
₹6000 Cash Back
EMI ₹1999
LG SAMSUNG Haier Whirlpool Godrej IFB BOSCH VOLTAS beko BPL
Buy Water Purifier
1.8 Ltr Kettle FREE
Buy Microwave Oven
Dosa Tawa FREE
Buy Dishwasher
Bath Set FREE
Buy Deep Freezer
₹1799 worth 5 Ltr Cooker FREE
Buy Water Dispenser
₹1249 worth 3 Ltr Cooker FREE
Morphy Richards
5L AIR FRYER
worth ₹11199
₹5490 only
*Conditions apply
Scan to find our Showroom Locations
Scan to know Prices, Offer details & to Shop Online
www.sathya.store
Whatsapp: 99166 98985 or Call: 88805 98985
For corporate bookings or bulk orders mail us: corporatesales@sathya.email
Naidupeta 8754469985 | Sulurpeta 91501 75985 | Chittoor 9003179985 | Tirupathi 7845229985 | Tirupathi Air Byepass Road 78453 63985 | Venkatagiri 7338740985 | Pileru 78453 45985 |
Tadipatri 95001 21985 | Chilkulurpeta 73583 80985 | Palamnar 73387 96985 | Bapatla 9043916985 | Koduru 9789778985 | Tenali 9866865813 | Nellore 9043976985 | Rajampeta 98402 66985 |
Vijayawada 73860 34465 | 81060 84659 | Guntur 9092038985 | 92878 79985 | Ongole 97439 00659 | Nandyala 98408 57985 | Kurnool 99403 54985 | 9092608985 | Machilipatnam 90259 15985 |
| Badvel 9087774985 | Narasaraopet 90879 65985 | Srikalahasti 9952352985 | Ananthapur 9789959985 | Puttur 89255 93985 | Punganur 98403 78985 | Kadapa 97897 78985 | Rayachoti
9092444985 | Tadepalli 90921 44985 | Kakkinada 78455 93985 | Adoni 63038 15540 | Eluru 89255 70985 | Bhimavaram 78455 71985
Now 37 Showrooms



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, పాల్గొన్న మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ కార్యదర్శి రామకృష్ణ తదితరులు

ఉక్కు ప్రైవేటీకరణపై తుది వరకు పోరాటం

- 6న విశాఖలో జరిగే మానవహారానికి మద్దతు
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానాలు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకునేవరకు పోరాటాన్ని కొనసాగించాలని సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 6న విశాఖపట్నంలో నిర్వహించ తలపెట్టిన మానవహారం కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించింది. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ స్టీల్ ఫ్యాక్టరీ విషయంలో బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు లేకపోవడంవల్ల ముడిసరుకు కొనుగోలుకే రూ.2 వేల కోట్ల పన్నుభారం పడుతోందని తెలిపారు. సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎంసీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం, మహిళా సమాఖ్య నాయకులు మాట్లాడారు.

రూ.100 కోట్లకు మరో దావా వేస్తా

- కొండా సురేఖ క్షమాపణ చెప్పినా తగ్గేది లేదు: నాగార్జున

న్యూఢిల్లీ, అక్టోబరు 4: తనపైన, తన కుటుంబంపైన అసత్య వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై రూ.100కోట్లకు మరో పరువు నష్టం దావా వేసే ప్రక్రియలో ఉన్నట్టు నటుడు అక్కినేని నాగార్జున చెప్పారు. ఆమె క్షమాపణలు చెప్పినా వెనక్కితగ్గే ప్రసక్తే లేదని.. ఇప్పటికే ఆమెపై వేసిన క్రిమినల్ పరువునష్టం దావాను ఉపసంహరించుకోబోమని తేల్చిచెప్పారు. ఈ వ్యవహారంపై 'టైమ్స్ నౌ' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగార్జున పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటానని ఆమె ఇప్పుడు చెబుతున్నారు. సమంతకు క్షమాపణ చెప్పారు. మరి.. నా కుటుంబం సంగతేమిటి? నాకూ, నా కుటుంబానికి క్షమాపణ చెప్పరా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇది ఏమాత్రం వ్యక్తిగత అంశం కాదని.. ఆమె చేసిన దారుణమైన ఆరోపణలు తనను, తన కుటుంబాన్ని దాటి వెళ్లాయని పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు యావత్ తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి లభిస్తున్న మద్దతు .. వ్యవస్థ లోలోతులకు విస్తరించిన తెగులును అరికట్టే ప్రక్రియలో తాము ఉన్నామన్న విషయాన్ని తనకు అర్థమయ్యేలా చేసిందని వ్యాఖ్యానించారు. "మీ రాజకీయ ప్రయోజనాల కోసం మా పేర్లను ఉపయోగించుకోవడం దారుణం. వినోద రంగంలో ఉన్న మేము ఇకపై ఎంతమాత్రం తేలికైన లక్ష్యాలుగా ఉండబోము. ఆమెపై చట్టపరంగా మేం తీసుకునే చర్యలు ఇతర రాజకీయ నాయకులకు ఒక హెచ్చరికగా ఉంటాయని, తమకు అపకీర్తి కలిగించే వ్యాఖ్యలు చేయకుండా నిరోధిస్తాయని భావిస్తున్నట్టు నాగార్జున తెలిపారు. పరువు నష్టం దావాలు కోర్టుల్లో ఏళ్ల తరబడి కొనసాగుతాయన్న విషయం తెలుసని.. అయినా, ఆ పోరాటానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తమకు సత్వర న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది తనకు ఒకదాని వెనుక ఒకటిగా సమస్యలు వస్తున్నాయన్న నాగార్జున.. అయినా ఇబ్బంది లేదని, తానొక బలమైన వ్యక్తినని, కుటుంబాన్ని రక్షించుకునే విషయంలో సింహంలా ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. తెలుగు చిత్రపరిశ్రమ మొత్తం మద్దతుగా వచ్చిందని.. తన తండ్రికున్న గౌరవం, ఆయన ఆశీస్సులే కారణమని అభిప్రాయపడ్డారు.

రైతుకు నచ్చిన మిల్లుకే

ధాన్యం రవాణా

- రైసు మిల్లుల ర్యాండమైజేషన్ విధానం రద్దు
- గోనె సంచులు, లేబర్, రవాణా సౌకర్యం ఏర్పాటు
- ధాన్యం సేకరణపై సీఎం చంద్రబాబు సమీక్ష
- మిల్లర్లు, రైతు సంఘాలతో మంత్రి నాదెండ్ల భేటీ



నూతన ఎంఎస్ఎంఈ విధానంపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న టీజీ భరత్

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ప్రతిబంధకంగా మారిన రైసు మిల్లుల ర్యాండమైజేషన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇకపై రైతులు సమీపంలోని తమకు ఇష్టమైన మిల్లులకే ధాన్యాన్ని తరలించుకునే వెసులుబాటు కల్పించాలని ధాన్యం సేకరణపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన ఈ ర్యాండమైజేషన్ విధానం వల్ల రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడాల్సివచ్చింది. రైతులు విక్రయించిన ధాన్యాన్ని సమీపంలోని మిల్లులకు కాకుండా ర్యాండమైజేషన్ పేరుతో దూరప్రాంతాల్లో ఉన్న వైసీపీ నేతలకు చెందిన మిల్లులకు రవాణా చేసేవారు. కొన్ని సందర్భాల్లో జిల్లాలను దాటించి వంద కిలోమీటర్లకు పైగా దూరాన ఉన్న మిల్లులకు తరలించాల్సి వచ్చేది. దానికయ్యే లేబర్, రవాణా ఖర్చులను కూడా తమ నెత్తినే రుద్దడం వల్ల రైతులు నలిగిపోయారు. కనీసం గోనె సంచులు కూడా సరఫరా చేయలేని దుస్థితి నెలకొంది. అయితే.. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యం సేకరణలో రైతులకు సాధ్యమైనంత వరకు ఇబ్బందుల్లేకుండా నిబంధనలను సరళతరం చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. సేకరణ ప్రక్రియలో రైసు మిల్లుల ర్యాండమైజేషన్ విధానాన్ని రద్దు చేసి, రైతులు సమీపంలోని తమకు ఇష్టమైన మిల్లులకే ధాన్యాన్ని రవాణా చేసుకునే వెసులుబాటు కల్పించాలని ఆదేశించారు. అందుకు అవసరమైన రవాణా వాహనాలు, గోనె సంచులను సమకూర్చడంతోపాటు ధాన్యం ఎగుమతి, దిగుమతులకు అయ్యే లేబర్ చార్జీలను కూడా చెల్లించాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వానికే విక్రయించేలా ప్రోత్సాహించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో అవకతవకలకు తావులేకుండా రైతుల బయోమెట్రిక్ ఆధారంగా ధాన్యాన్ని సేకరించాలని, ఆ ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసే వాహనాలను జీపీఎస్ పరికరాల ద్వారా ట్రాక్ చేయాలని సూచించారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. సమీక్ష అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో రైసు మిల్లర్లు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం అమలు చేయనున్న విధివిధానాలపై వారికి అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. భారత ఆహార సంస్థ అభ్యర్థన మేరకు 2 లక్షల బాయిల్డ్ రైసు (ఉడికించిన బియ్యం)ను కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల రైసుమిల్లర్లు సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ జి.వీరపాండియన్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ అమూన్‌తోపాటు రైతు సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఐదు గ్లోబల్ ట్రేడ్ సెంటర్లు

- తిరుపతి, అమరావతి, విశాఖ, మరో రెండుచోట్ల ఏర్పాటు
- ఎంఎస్ఎంఈ పాలసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చిన్న పరిశ్రమల మధ్య పోటీతత్వాన్ని పెంచేందుకు రాష్ట్రంలో ఐదు గ్లోబల్ ట్రేడ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తిరుపతి, అమరావతి, విశాఖపట్నంతో పాటు మరో రెండుచోట్ల వీటి ఏర్పాటుకు ప్రతిపాదించింది. స్థానికంగా ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఒక మైక్రో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడం ద్వారా 175 నియోజకవర్గాల్లో లక్షా 75వేల మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మైక్రో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ మంత్రులు, ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ఎంఎస్ఎంఈ పాలసీ రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా గ్రూపుల మహిళలతో విస్తృత స్థాయిలో సూక్ష్మ, చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిని కేంద్ర పథకాలతో అనుసంధానం చేయాలని సూచించారు. 'ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో ముందుకు సాగుదామని చెప్పారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసి తగిన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధికి భరోసా ఏర్పడుతుందని చెప్పారు. అధికారులు తయారు చేసిన ఎంఎస్ఎంఈ పాలసీ డ్రాఫ్ట్‌లో మార్పులు, చేర్పులను సీఎం సూచించారు. ఎక్కువమందికి ఉపాధి కల్పన, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంగా దూరదృష్టితో సాహసోపేతమైన చర్యల ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునే దిశగా అత్యుత్తమ ప్రణాళికలు సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం 6 నెలల్లో రూ.3,971 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రూ.3,971 కోట్ల ఆదాయం సాధించింది. గతఏడాది ఇదే సమయంలో వచ్చిన ఆదాయం కంటే 18 శాతం తగ్గడం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.13,500 కోట్లు ఆర్జించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. సీఎం చంద్రబాబు శుక్రవారం ఆదాయార్జన శాఖలపై సమీక్ష నిర్వహించారు. సొంత ఆదాయాలను మెరుగుపరచి ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.13,500 కోట్ల ఆదాయం సాధ్యం కాకపోవచ్చని, రూ.11,000 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు వెల్లడించారు. భూముల మార్కెట్ విలువ సవరిస్తే రూ.1000 కోట్ల అదనపు ఆదాయం సాధించవచ్చన్నారు.



ఉల్లి, టమాటా

ధరలు పైపైకి..

- దసరాకు సెంచరీ దాటే అవకాశం

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఉల్లి, టమాటా ధరలు ఎగబాకుతున్నాయి. వర్షాలు, వరదలకు ఇతర రాష్ట్రాల్లో టమాటా, ఉల్లి దిగుమతులు తగ్గడంతో ఏపీలో వీటికి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఉల్లి, టమాటా సెంచరీకి సిద్ధంగా ఉన్నాయి. గతవారం కొత్త ఉల్లి కిలో రూ.40, పాత ఉల్లి రూ.60 ఉండగా, ఇప్పుడు పాత ఉల్లిపాయలు రూ.80పైనే పలుకుతున్నాయి. టమాటా గతవారం రూ.50లోపు ఉండగా, ఇప్పుడు రూ.80చేరింది. తాజాగా మదనపల్లె మార్కెట్‌లో 10కిలోల టమాటాలు రూ.880 పలికింది. దీంతో కిలో రిటైల్ ధర రూ.90కు చేరింది. మళ్లీ ధర పెరిగితే.. రవాణా ఖర్చులతో కలిపి, నాణ్యమైన టమాటా కిలో రూ.100కు చేరే అవకాశం ఉందని వ్యాపారులు చెప్తున్నారు. ఇక మహారాష్ట్రలో నాణ్యమైన ఉల్లి క్వింటా రూ.3,500 వరకు పలుకుతోంది. దీంతో ఏపీ మార్కెట్‌లో పాత ఉల్లిని కొందరు బయటకు తీయడంలేదు. ధర తక్కువగా ఉన్న కొత్త సరుకును రిటైల్ మార్కెట్‌లో అమ్మేస్తున్నారు. ఇవే రకం ఇంటి ముందు తోపుడు బండ్లపై రూ.100కు 2కిలోలు ఇస్తున్నారు. రైతుబజార్లలో టమాటా కిలో రూ.65, ఉల్లి రూ.40చొప్పున విక్రయిస్తున్నా.. సరుకు నాణ్యత ఉండటం లేదని వినియోగదారులు చెప్తున్నారు. దసరా పండుగ లోపే ఉల్లి, టమాటా కిలో వందకు చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

సజ్జల భార్గవరెడ్డి అవుట్

- వైసీపీ సోషల్ మీడియా నుంచి తొలగింపు

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు సజ్జల భార్గవరెడ్డిని ఆ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా తొలగించారు. ఆ విభాగం బాధ్యతలను దొడ్డా అంజిరెడ్డికి అప్పగించారు. ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ హోదాలో అంజిరెడ్డి ఇకపై వైసీపీ సోషల్ మీడియాను పర్యవేక్షిస్తారు. ఇక.. పార్టీ రాజకీయ సలహా కమిటీ సభ్యునిగా షేక్ అసిఫ్‌ను నియమించారు. సజ్జల భార్గవరెడ్డిని సోషల్ మీడియా నుంచి జగన్ దూరంగా పెట్టారంటూ ఇటీవల విస్తృతప్రచారం జరిగింది. సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులకు బాధ్యుడిని చేస్తూ భార్గవరెడ్డిని అరెస్టు చేసే వీలుందన్న ప్రచారం కూడా జరిగింది. దీనిపై భార్గవరెడ్డికి పోలీసు నోటీసులు అందాయి. భార్గవరెడ్డి ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేస్తారంటున్న వచ్చిన వార్తలను సజ్జల రామకృష్ణారెడ్డి ఖండించారు. కానీ, భార్గవరెడ్డి ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేశారు. ఇది ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

జీతాలు పడుతూనే ఉన్నాయ్!

4వ తేదీ వచ్చినా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు ఇంకా పడుతూనే ఉన్నాయి. శుక్రవారం నాటికి జీతాల చెల్లింపులు రూ.1,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సాయంత్రం నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ అవుతున్నాయి.



ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పీలా గోవింద్, చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ



లిడ్‌క్యాప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పిల్లి మాణిక్యాలరావు, చిత్రంలో మంత్రి డోల వీరాంజనేయస్వామి



క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రవినాయుడు, చిత్రంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తమ్మిరెడ్డి శివశంకరరావు

కూడబెట్టిన సొమ్ము కొట్టేశారు

- చిలకలూరిపేటలో ఐసీఐసీఐ ఖాతాదారుల కన్నీరుమున్నీరు
- భారీగా తరలి వచ్చి ఆందోళన
- జాతీయ రహదారిపై రాస్తారోకో
- సర్దిచెప్పలేక అధికారుల సతమతం
- రంగంలోకి జోనల్ స్థాయి అధికారులు



ఖాతాలో డబ్బు ఉందో లేదో చూసి చెప్పాలని సిబ్బందిని అడుగుతున్న ఐసీఐసీఐ బాధితులు

చిలకలూరిపేట, అక్టోబరు 4: భారీగా అవకతవకలు జరిగిన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని ఐసీఐసీఐ బ్యాంకుకు బాధితులు శుక్రవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కూడబెట్టిన సొమ్ము కొట్టేశారంటూ పలువురు మహిళలు సహా బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తమ వద్ద ఉన్న పత్రాలను బ్యాంకు సిబ్బందికి చూపించి డిపాజిట్లు ఉన్నాయో.. లేదో చూడాలని కోరారు. బ్యాంకులో ఉంచిన తమ బంగారం ఏమైందని ప్రశ్నించారు. ఇల్లు, స్థలం అమ్ముకుని బ్యాంకులో డబ్బు దాచుకున్నామని కొందరు, జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సొమ్మును బ్యాంకులో వేశామని మరికొందరు వాపోయారు. ఇంతకాలంగా మోసం జరుగుతుంటే బ్యాంకు ఉన్నతాధికారులు ఎందుకు పసిగట్టలేకపోయారని వారు ప్రశ్నించారు. తమ పేరు మీద ఖాతాలే లేవని అంటున్నారని రోదించారు. బ్యాంకులో జరిగిన భారీ కుంభకోణం వెనుక చాలామంది పాత్ర ఉందని వారు ఆరోపించారు. గుట్టు చప్పుడు కాకుండా వందల సవర్ల బంగారాన్ని లేపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులతో బ్యాంకు ఆవరణ కిటకిటలాడిపోయింది. నెల కిందట సస్పెండ్ అయిన బ్యాంకు మాజీ మేనేజర్ నరేష్ పది రోజుల కిందట కూడా ఐడి కార్డు మేడలో వేసుకుని, బ్యాంకు యూనిఫామ్‌తో మేనేజర్ చాంబర్‌లో కూర్చుని బాధితులను దర్జాగా మోసం చేశాడని వారు ఆరోపించారు. విజయవాడ నుంచి జోనల్ స్థాయి అధికారులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

ముందు జాగ్రత్తగా బ్యాంకు వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను బందోబస్తుగా నియమించారు. తమకు న్యాయం చేయాలని బాధితులు నినాదాలు చేశారు. అనంతరం, బాధితులు బ్యాంకు ఎదుట ఉన్న జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అర్బన్ సీఐ పి. రమేశ్ జోక్యం చేసుకుని బాధితులతో మాట్లాడారు. బాధితులు తమకు సంబంధించిన పూర్తి వివరాలను ఆధారాలతో సహా జోనల్ స్థాయి అధికారులకు అందించాలని కోరారు. వీటన్నిటినీ బ్యాంక్ అధికారులు క్రోడీకరించి ఎంతమంది, ఏ విధంగా నష్టపోయారన్న విషయంపై ఒక అవగాహనకు వస్తారని చెప్పారు. బ్యాంకు కేంద్ర కార్యాలయంతో సంప్రదించి తగిన నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అనంతరం బాధితుల కోసం బ్యాంకు ప్రధాన ద్వారం ముందు రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. బాధితుల వివరాలు నమోదు చేశారు. వారం పది రోజులు తాము ఇక్కడే ఉంటామని, బాధితులు వీలు చూసుకుని వివరాలన్నింటినీ తమకు అందించాలని జోనల్ స్థాయి అధికారులు తెలిపారు. ఖాతాదారుల ప్రయోజనాల పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని బ్యాంకు అధికారులు చెప్పారు.

హిమాచల్‌లో 'టాయిలెట్ ట్యాక్స్' దుమారం

సిమ్లా, అక్టోబరు 4: హిమాచల్‌ప్రదేశ్‌లో 'టాయిలెట్ సీట్ ట్యాక్స్' అంశం తీవ్ర వివాదాస్పదమైంది. పట్టణ ప్రాంతాల్లో ఉండే ఇళ్లలో ఎన్ని టాయిలెట్లు ఉండే.. దానికి తగ్గట్టుగా ప్రతి దానికి రూ.25 పన్ను విధిస్తారన్న నోటిఫికేషన్‌పై రాజకీయ దుమారం రేగింది. ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇది సిగ్గుమాలిన చర్య అని బీజేపీ మండిపడింది. ఈ నేపథ్యంలో సీఎం సుఖ్విందర్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ స్పందించింది. అలాంటి పన్ను విధించడం లేదని స్పష్టం చేసింది. అది పాత నోటిఫికేషన్ అని, దాన్ని అదేరోజున ఉపసంహరించుకున్నామని తెలిపింది. ఈ వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'ప్రధాని మోదీ స్వచ్ఛతను ఒక ప్రజా ఉద్యమంలా చేస్తుండగా, కాంగ్రెస్ మాత్రం ప్రజలకు టాయిలెట్ల పన్నులు వేస్తోంది. ఈ విధమైన చర్య దేశానికి అవమానకరం' అన్నారు.

జెన్కోలో వైసీపీ మూలాలు అవుట్..!

- ఎన్టీటీపీఎస్‌లో 70 మంది బదిలీ
- పూర్తి ప్రక్షాళన దిశగా జెన్కో నిర్ణయం
- అంతర్గత బదిలీలకు ప్రాధాన్యమిచ్చిన యాజమాన్యం

అమరావతి (ఆంధ్రజ్యోతి), ఇబ్రహీంపట్నం, అక్టోబరు 4: ఏపీ జెన్కోలో వైసీపీ మూలాలను బయటకు పంపేస్తున్నారు. నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీటీపీఎస్) ఇంజనీరింగ్ విభాగంలో ఇప్పటికే 30 మందిని బదిలీ చేయగా.. శుక్రవారం మరో 70 మంది ఇంజనీర్లను బదిలీ చేస్తూ జెన్కో ఎండీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వారిలో పదిమంది అధికారులను బయట స్టేషన్లకు పంపగా.. మరికొంత మందిని వీటీపీఎస్, కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి జెన్కోకు పరస్పర బదిలీలు చేశారు. 32 మందిని జెన్కోలో అంతర్గత బదిలీలు చేశారు. గత ఐదేళ్లలో వైసీపీకి దన్నుగా ఉంటూ.. అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ వచ్చిన ఇంజనీరింగ్ అధికారులను బదిలీ చేశారు. ఇటీవల వరదల సమయంలో విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిని కూడా ఈ బదిలీల జాబితాలో చేర్చారు. మరికొంత మందికి బదిలీ తప్పదని భావిస్తున్నారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి ఏపీజెన్కో, ట్రాన్స్‌కో, జనరేషన్ ప్లాంట్లలోని ఇంజనీరింగ్ సిబ్బందిని బదిలీలు చేయాలంటూ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌పై తీవ్ర ఒత్తిడి వస్తోంది. అలాగే వైసీపీ అనుబంధ విభాగంగా కొందరు ఇంజనీర్లు పనిచేస్తున్నారంటూ కొందరు ఇంజనీర్ల పేర్లు మంత్రి రవికుమార్‌కు చేరాయి. ఈ నేపథ్యంలో ఇంజనీర్ల బదిలీ ప్రక్రియను మంత్రి రవికుమార్ శుక్రవారం ఒక కొలిక్కి తీసుకొచ్చారు. శుక్రవారం రాత్రి జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు బదిలీల ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యుత్‌సౌధలో ఒక్కసారిగా సందడి కనిపించింది.

అటవీశాఖలో భారీగా బదిలీలు

- 41 మంది ఐఎఫ్ఎస్‌లకు పోస్టింగ్‌లు
- వివాదాస్పద అధికారులు వెయిటింగ్‌లోకి..

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీశాఖలో భారీగా ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. ఇందులో 1989 నుంచి 2020 బ్యాచ్ వరకు ఐఎఫ్ఎస్ అధికారులున్నారు. 41 మంది అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం.. వివాదాస్పద అధికారులను పక్కన పెట్టింది. గత ప్రభుత్వంలో విశాఖ రుషికొండ వంటి అంశాల్లో తీవ్ర ఆరోపణలు వచ్చిన విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఎస్.శ్రీకంఠనాథ రెడ్డిని, చిత్తూరు డీఎఫ్‌వో చింతా చైతన్యకుమార్‌రెడ్డిని తదుపరి పోస్టింగ్ ఇచ్చే వరకు జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. మిగతా అందరికీ పోస్టింగ్‌లు ఇచ్చింది. పలువురు ఐఎఫ్ఎస్ అధికారులను ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో నియమించింది. వెయిటింగ్‌లో ఉన్న వారికీ పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పట్టణ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

- ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద్

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్యం, పార్కుల అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రూపొందించిన వివిధ పట్టణాభివృద్ధి పథకాల ద్వారా నిధులను సమీకరించి అన్ని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు అందిస్తామని ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ చెప్పారు. విజయవాడలో శుక్రవారం ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమృత్ పథకం, పట్టణ తాగునీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పథకాల కింద నిధులను దశలవారీగా ఆయా మున్సిపాలిటీలకు విడుదల చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలనే లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పారు.

లిడ్‌క్యాప్‌కు పూర్వ వైభవం తీసుకొస్తా

- లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లిడ్‌క్యాప్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు చెప్పారు. తాడేపల్లిలోని లిడ్‌క్యాప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ సర్కార్ లిడ్‌క్యాప్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. టీడీపీ హయాంలో లిడ్‌క్యాప్‌కు స్థలం కేటాయిస్తే, ఆ భూమిని గత సీఎం జగన్ విక్రయించేసి దళితులకు అన్యాయం చేశారన్నారు.

శాప్‌ను ప్రక్షాళన చేసి.. అవినీతికి తావు లేకుండా చేస్తా

- శాప్ చైర్మన్‌గా రవినాయుడు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో కష్టపడిన వారిని పార్టీ నాయకత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, మంచి అవకాశాలు కల్పిస్తోందని క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం శాప్ కార్యాలయంలో శాప్ చైర్మన్‌గా రవినాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరయిన మంత్రి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మండు వేసవిని లెక్క చేయకుండా రవినాయుడు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. రవినాయుడు కష్టాన్ని రాష్ట్రం మొత్తం కళ్లారా చూసిందని, ఆయనకు శాప్ చైర్మన్ పదవి రావడం అభినందనీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రవినాయుడు మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా శాప్ ఆధ్వర్యంలో ఉన్న ఆటస్థలాలు, ఇతర స్థలాలన్నింటినీ పరిశీలిస్తానని చెప్పారు. గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. శాప్ మొత్తాన్ని ప్రక్షాళన చేసి, ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, గద్దె రామ్మోహన్, భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్‌బాబు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు రవినాయుడును అభినందించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా తమ్మిరెడ్డి

విజయవాడ ఆటోనగర్, అక్టోబరు 4: నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు అన్నారు. విజయవాడ ముత్యాలంపాడులోని కార్యాలయంలో శుక్రవారం ఆయన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



కనకదుర్గానగర్‌లో నగరోత్సవం

ఇంద్రకీలాద్రిపై లేజర్ షో

క్యూలైన్లలో రద్దీ

ఉదయమంతా ఉత్సవాల వైభవం.. సాయంకాలం నగరోత్సవ వైభోగంతో ఇంద్రకీలాద్రి ముమ్మారు ముచ్చటపడి మురిసి పోతోంది. అమ్మకు ప్రీతికరమైన శుక్రవారం, గాయత్రీదేవి అలంకారం కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. వేకువజాము నుంచే క్యూలైన్లు కిటకిట లాడాయి. ఎండ తీవ్రత కారణంగా భక్తుల రాకపోకల్లో హెచ్చు తగ్గులు కనిపించినప్పటికీ రాత్రి వరకూ రద్దీ కొనసాగింది.

ప్రణతులివే పంచముఖీ

రెండోరోజు ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే అధికంగా..



(ఆంధ్రజ్యోతి-విజయవాడ/చిట్టినగర్) : శ్రీగాయత్రీదేవి అలంకారంలో కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో విజయవాడతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా వచ్చారు. వేకువజాము నుంచి రద్దీ కొనసాగింది. తర్వాత ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తాకిడి తగ్గింది. తిరిగి సాయంత్రం నుంచి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన భక్తులు ఆలయానికి ఎక్కువగా వచ్చారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులు రాత్రి ప్రయాణాలను ఎంచుకుంటున్నారు. ఆయా ప్రాంతాల నుంచి బయల్దేరి రాత్రికి నగరానికి చేరుకుంటున్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో నిద్రించి, తెల్లవారుజామున

- మిగతా 8లో

పోలీసుల అత్యుత్సాహం

కొండ కింద నుంచి పైవరకు ఓవరాక్షన్

- పాసులున్న దుర్గగుడి ఉద్యోగులు, మీడియా వారిని అడ్డగింపు
- పాసులు లాక్కుని బెదిరింపులు
- భక్తులతోనూ గొడవలు



భక్తులను నిలువరిస్తున్న పోలీసులు

వన్‌టౌన్, అక్టోబరు 4 : దసరా ఉత్సవాల్లో పోలీసులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. ఉత్సవాల ప్రారంభం రోజే విధులకు హాజరైన ఉద్యోగులను అడ్డుకున్నారు. కొందరు పోలీసులైతే ఉద్యోగుల వద్ద పాసులు లాక్కుని బెదిరింపులకు పాల్పడ్డారు. గురువారం రాత్రి కనకదుర్గానగర్ వద్ద ఓ డీఎస్పీ.. దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులను విధులకు వెళ్లకుండా అడ్డుకోగా, ప్రశ్నించిన ఏఈని అసభ్యకరంగా తిట్టి అతని వద్ద ఉన్న పాసును లాక్కున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఈఈ.. ఇదేమిటని ప్రశ్నిస్తే ఆమెను కూడా ఇష్టానుసారంగా మాట్లాడారు. డీఎస్పీ స్థాయిలో ఉన్న అధికారి ఇలా మాట్లాడటంపై ఉద్యోగులతో పాటు భక్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు టోల్‌గేట్ వద్ద విధుల్లో ఉన్న పోలీసులు భక్తులు క్యూలో వెళ్లటానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. వినాయకుడి గుడి వరకు వెళ్లాల్సిందేనని పట్టుబట్టారు. వారంతా కుమ్మరిపాలెం సెంటర్ వైపు నుంచి రావడంతో టోల్‌గేట్ దగ్గర ఉన్న క్యూలో వెళ్లటానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవటంతో సుమారు 40 నిమిషాలు పోలీసులకు, భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది.

జడ్జి వాహనం అడ్డగింపు

శుక్రవారం మధ్యాహ్నం సుమారు 11, 12 గంటల సమయంలో దర్శనానికి కారులో విచ్చేసిన మహిళా జడ్జిని టోల్‌గేట్ వద్ద ఉన్న పోలీసు అధికారులు అడ్డుకున్నారు. హైకోర్టు జడ్జి అని సిబ్బంది చెప్పినా వినలేదు. దీంతో న్యాయమూర్తి 10 నిమిషాల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత అనుమతించినప్పటికీ పోలీసుల తీరుపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. అలాగే, ఘాట్‌రోడ్డు ఓం టర్నింగ్ వద్ద డీఎస్పీ ఏ.సుభాష్ ఓవరాక్షన్ చేశారు. విధులకు వెళ్లే ఉద్యోగులను, కొండపైకి వెళ్తున్న మీడియా ప్రతినిధులను అడ్డుకున్నారు. పాసులు చూపించినప్పటికీ.. మాకు సంబంధం లేదంటూ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులతో వాదనకు దిగారు.

వ్యంగ్య మాటలు

కొండ దిగువన మహామండపం వద్ద విధుల్లో ఉన్న పోలీసులు ఉద్యోగులను, మీడియా ప్రతినిధులను అనుమతించకుండా వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. మీడియా ప్రతినిధులు, ఉద్యోగులు ఐడీ కార్డులు చూపించినప్పటికీ 'మేము పంపించం.. ఏం చేసుకుంటారో చేసుకోండి..' అంటూ అవహేళన చేశారు. మీడియా ప్రతినిధులు డ్యూటీకి వెళ్తున్నారా, ఇంక దేనికైనా వెళ్తున్నారా? మీరంతా దొంగలు.. అంటూ ఓ పోలీసు అధికారి వ్యాఖ్యానించారు.

కొండ ఎక్కిన ఉత్సవ కమిటీ

- ఈవోతో సమావేశం 8లో

అమృతాన్ని కాదని..

పీపీపీలోనే విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్

* అమృత్ భారత్ పథకం నుంచి తప్పించి ప్రైవేట్‌కు.. * రైల్వే జీఎం అరుణ్‌కుమార్ ప్రకటనపై విమర్శలు * రాష్ట్రమంతా ఒక విధానం.. విజయవాడకు మరొకటా..? * కార్మిక సంఘాల నుంచి వ్యతిరేకత

అనుకున్నదే అయ్యింది. విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్‌ను అమృత్ భారత్ పథకంలో కాకుండా పీపీపీకే అప్పగించాలని నిర్ణయించారు. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో ఎంపీల సమావేశం అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలో మొత్తం 56 రైల్వేస్టేషన్లను అమృత్ భారత్‌లో అభివృద్ధి చేస్తుండగా, ఒక్క విజయవాడను ప్రైవేట్‌కే ఇవ్వాలనడం వెనుక అనేక అనుమానాలు కలగడంతో పాటు విమర్శలు కూడా వస్తున్నాయి.



రైల్వే జీఎం అరుణ్‌కు మొక్కను అందజేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వేస్టేషన్‌ను కిందటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ హయాంలోనే పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. అప్పటి రైల్వే ప్రతిపాదనపై ప్రైవేట్ సంస్థలు ఆసక్తి చూపలేదు. రైల్వే విధానాలు తమకు నష్టదాయకంగా ఉంటాయని భావించటంతో వెనకడుగు వేశారు. ఆ తర్వాత రైల్వే అధికారులు రూటు మార్చారు. టెండర్లను రద్దు చేసుకున్నారు. తర్వాత అమృత్ భారత్ పథకంలో భాగంగా అనేక స్టేషన్లను రీ డెవలప్ చేస్తుండటంతో విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ అంశం చర్చనీయాంశమైంది. కళ్లముందే తిరుపతి, నెల్లూరు స్టేషన్లు రూ.311 కోట్లతో అభివృద్ధి చెందుతుంటే, దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ అయిన విజయవాడ విషయంలో మాత్రం తాత్సారం జరిగింది. రీ డెవలప్‌మెంట్ డిజైన్ల విషయంలో ఐదేళ్లుగా రైల్వే అధికారులు కసరత్తు చేస్తూనే ఉన్నారు. అయితే, ఈ జాప్యంపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. దీనివెనుక ప్రైవేట్ కోణం ఉందన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ప్రైవేట్ సంస్థలకు ప్రయోజనకరంగా ఉండే డిజైన్లు రూపొందుతున్నాయనే ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటినీ నిజం చేస్తూ శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ పీపీపీ విధానానికే ఓటు వేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌ను విస్తరిస్తున్నారా అని మీడియా అడిగిన ప్రశ్నలకు.. లేదని, సాధ్యం కాదని సమాధానమిచ్చారు. ఇప్పటికే శాటిలైట్ స్టేషన్‌గా రాయనపాడు ఉందని, ఈసారి గుణదలను అభివృద్ధి చేస్తామన్నారు. దీనిని బట్టి చూస్తే విస్తరణకు అవకాశం లేని పరిస్థితుల్లో రీ డెవలప్‌మెంట్‌ను పీపీపీకి అప్పగిస్తున్నారని తెలుస్తోంది.

తీవ్ర వ్యతిరేకత

ఈ పీపీపీ విధానం వల్ల విజయవాడ రైల్వేస్టేషన్ పూర్తి కమర్షియల్‌గా మారే అవకాశముంది. మౌలిక సదుపాయాల కంటే కూడా వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తృతం చేసుకునేలా విధానాలు ఉంటాయన్న అనుమానాలు వస్తున్నాయి. విజయవాడ వంటి అతి ముఖ్యమైన రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్‌ను పీపీపీ విధానంలో కాకుండా, అమృత్ భారత్ పథకంలో అభివృద్ధి చేయాలన్న డిమాండ్ వస్తోంది. పీపీపీ విధానాన్ని రైల్వే కార్మిక సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. రైల్వే అధికారులు విజయవాడ రైల్వేస్టేషన్‌ను కేవలం లాభాపేక్ష కోణంలోనే చూస్తున్నారని అంటున్నాయి. నిర్వహణ వ్యయం నుంచి తప్పించుకునేందుకు ప్రైవేట్ సంస్థలకు ప్రయోజనం కల్పించే విధానాలు తగవని పేర్కొంటున్నాయి.

నగర డ్రెయినేజీ సమస్యకు రైల్వే నేతృత్వంలో జేఏసీ

విజయవాడలో ఇటీవల బుడమేరు వరద సృష్టించిన విధ్వంసం అందరికీ తెలిసిందే. నగరంలో అంతర్గతంగా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటం కూడా సమస్యగా ఉంది. బుడమేరు కానీ, ఇతర మేజర్ కాల్వలను కానీ పునరుద్ధరించాలన్నా, ఆధునికీకరించాలన్నా రైల్వే ప్రమేయం తప్పనిసరి. ఇలాంటి సమయాల్లో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాక రైల్వేతో తలనొప్పులు వస్తున్నాయి. ఈ అంశాన్ని గుర్తించిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ నగరంలో డ్రెయినేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చొరవ చూపించారు. సమస్య మూలాలను వివరించిన ఆయన రైల్వే నేతృత్వంలో కార్పొరేషన్, రెవెన్యూ శాఖలను కూడా కలిపి ఒక జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు రైల్వే జీఎం తన సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని జీఎం అరుణ్‌కుమార్ మీడియా సమావేశంలో ప్రకటించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించటానికి తాను లేవనెత్తిన జేఏసీ ప్రతిపాదనను రైల్వే జీఎం ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ కేశినేని చిన్ని చేసిన మరికొన్ని ప్రతిపాదనలు

- ముస్తాబాద రైల్వేస్టేషన్ వద్ద బుడమేరు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా అవసరమైన స్థలం ఇవ్వాలి.
- 30 ఏళ్ల కిందటి జగ్గయ్యపేట రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించాలి. జగ్గయ్యపేట చుట్టూ అనేక పరిశ్రమలున్నాయి. కార్గో ఆదాయం ఎక్కువ. ఆ దిశగా చర్యలు చేపట్టాలి
- జగ్గయ్యపేట రైల్వేస్టేషన్‌లో పాసింజర్ రైళ్లు ఆగేలా ఏర్పాట్లు చేయాలి.

- మిగతా 8లో



దివ్య దర్శనం

వృద్ధాశ్రమాల్లోని వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకం

సీపీ చొరవతో సులువుగా దుర్గమ్మ దర్శన భాగ్యం

విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సాధారణ భక్తులు ఉచిత క్యూల్లో దర్శనాలకు వస్తారు. కాస్త పలుకుబడి ఉన్నవారైతే వీఐపీ కోటాలో దర్శనాలు చేసుకుంటారు. అధికార హోదాల్లో ఉన్నవారికి వీవీఐపీ దర్శనాలుంటాయి. మరి.. వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులు, దివ్యాంగులకు దుర్గమ్మ దర్శనమెలా? ఈ ప్రశ్న పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబును కదిలించింది. వృద్ధాప్యం, అంగవైకల్యంతో ఉంటూ దర్శనాలకు రాలేని వారికి దర్శనం కల్పించాలని ఆయన నిర్ణయించుకున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, దివ్యాంగులను పోలీసు శాఖకు చెందిన బస్సుల్లో పున్నమిఘాట్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన వాహనాల్లో ఇంద్రకీలాద్రిపైకి, అనంతరం వీల్‌ఛైర్‌లో తీసుకెళ్లి దర్శనాలు చేయించారు. ఇందుకోసం పోలీసు శాఖ నుంచి కొంతమందితో సేవాదళ్‌ను ఏర్పాటు చేశారు. ఇలా దర్శనాలు చేసుకున్న వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వేద మాతకు వందనం


దుర్గమ్మ దర్శన భాగ్యం..
కుంకుమ పూజల్లో భక్తులు
అమ్మ హారతి సేవలో..

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/చిట్టినగర్)
గాయత్రీ దేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం ఆలయానికి పోటెత్తారు. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో విజయవాడతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

మెట్ల మార్గంలో భక్తుల రద్దీ

రాజగోపురం మెట్ల వైపు నుంచి వెళ్లే మార్గంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్నట్టుండి ఇక్కడ భక్తుల రద్దీ పెరుగుతోంది. ఆలయానికి పక్కన క్యూలైన్ల బారికేడ్లు ఉన్నాయి. కుంకుమార్చనల్లో పాల్గొన్న ఉభయదాతలను పూజల అనంతరం ఈ బారికేడ్ల మార్గంలో దర్శనానికి పంపుతారు. వాళ్లంతా ఆలయానికి వెనుక ఉన్న క్యూలో నుంచి దర్శనానికి వెళ్తారు. దీనికి పక్కనే ఈవో కార్యాలయం ఉంది. రాజగోపురం నుంచి మెట్లు దిగితే ఈవో కార్యాలయం వద్ద ఉన్న ద్వారానికి చేరుకుంటారు. ఈ గేటు నుంచి కొంతమంది భక్తులు ఉభయదాతలు ఉన్న క్యూలో కలుస్తున్నారు. ఇది కాకుండా పూజల్లో పాల్గొనే ఉభయదాతలను పూజలు నిర్వహించే మహామండపంలోని ఆరో అంతస్తుకు పంపడానికి రాజగోపురం వద్ద ఒక మార్గం ఉంది. ఇందులో నుంచి వెళ్లే వారు దర్శనానికి వెళ్లే ఉభయదాతల క్యూలో కలుస్తారు. అమ్మవారిని దర్శించుకుని బయటకు వచ్చిన తర్వాత శివాలయం వైపునకు వెళ్లాల్సిన కొంత మంది భక్తులు కుడి వైపునకు తిరిగి ఆలయం పక్క నుంచి రాజగోపురం వైపునకు వస్తున్నారు. దర్శనానికి వెళ్లాల్సిన భక్తులు ముందుకు కదల్లేక, బయటకు రావాల్సిన వారు రాలేక అక్కడే ఆగిపోతున్నారు. దీంతో ఇక్కడ రద్దీ ఎక్కువగా కనిపించి గందరగోళ పరిస్థితి ఏర్పడుతోంది. ఈ రద్దీని నియంత్రించలేక అక్కడి సిబ్బంది గేట్లు మూసివేస్తున్నారు. దేవదాయ శాఖ ఏర్పాటు చేసిన వాహనాల్లో పైకి వచ్చి వీవీఐపీ మార్గంలో దర్శనం చేసుకున్న వారు తిరిగి వెళ్లడానికి వీలుగా నటరాజస్వామి ఆలయం వైపు నుంచి తిరిగి ఓం మలుపు వద్దకు చేరుకునేలా మార్గం ఏర్పాటు చేశారు. అయినా ఈ కోటాలోని భక్తులు మాత్రం రాంగ్‌రూటులో మెట్ల వద్దకు వచ్చి అలజడిని సృష్టిస్తున్నారు.

దర్శన టికెట్ తీసుకున్న సీపీ దంపతులు

ఆయన జిల్లా పోలీసు బాస్. నిత్యం ఇంద్రకీలాద్రి బందోబస్తు పర్యవేక్షణలో ఉంటారు. ఎప్పుడైనా దర్శనం చేసుకునే వీలుంటుంది. వీవీఐపీ జాబితాలో ఉన్నా టికెట్ తీసుకుని దర్శనానికి వెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సతీమణితో కలిసి శుక్రవారం దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. వీవీఐపీల దర్శనాల విషయంలో సామాన్య భక్తులకు ఎలాంటి అపోహలు లేకుండా, విమర్శలు రాకుండా రాజశేఖరబాబు ఆన్‌లైన్‌లో రెండు టికెట్లు తీసుకున్నారు. సాంప్రదాయ వస్త్రాల్లో ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. టికెట్‌ను వీవీఐపీ క్యూ వద్ద దేవదాయ శాఖ సిబ్బందితో స్కాన్ చేయించుకున్నారు. ఆ తర్వాత రాజగోపురం మెట్ల నుంచి దర్శనానికి వెళ్లారు. తాను దర్శనానికి వెళ్లాలనుకుంటే కచ్చితంగా టికెట్లు కొనుగోలు చేసి వెళ్తానని, తన వెంట వచ్చే వారికి టికెట్లు తీసుకుంటామని శరన్నవరాత్రులు ప్రారంభంకావడానికి ముందే వెల్లడించారు.


టిక్కెట్‌ను స్కాన్ చేయిస్తున్న సీపీ దంపతులు

ఉచిత క్యూలో మంత్రి రవీంద్ర

చిట్టినగర్ : ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఉచిత దర్శన మార్గంలో శుక్రవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయన వినాయకుడి ఆలయం నుంచి ఉచిత క్యూలో కాలినడక ఇంద్రకీలాద్రిపైకి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ అధికారులకు ఆయన అమ్మవారి తీర్థప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం మీడియా పాయింట్ మంత్రి మాట్లాడారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. క్యూలో వస్తున్నప్పుడు ఏర్పాట్లపై భక్తులను ఆరా తీశారు. భక్తులకు సేవ చేస్తున్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల వలంటీర్లను అభినందించారు.


దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరనాథ్

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

వన్‌టౌన్ : దసరా మహోత్సవాలలో భాగంగా గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మను శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరనాథ్, మంత్రి టీజీ భరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.


దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి భరత్


కొబ్బరికాయలు కొట్టే ప్రదేశం

నోటు ఇస్తేనే కాయ కొట్టేది!

ఆటోనగర్ : భక్తులు దుర్గమ్మ దర్శనానంతరం కొబ్బరికాయ తామే స్వయంగా కొట్టాలని ఎంతో ఆశపడుతుంటారు. అయితే కొండకింద కొబ్బరికాయలు కొట్టే ప్రదేశం వద్దకు భక్తులు రాగానే కొందరు దళారులు కాయలను బలవంతంగా తీసుకుని వారే కొట్టేస్తూ.. డబ్బులు వసూళ్లు చేస్తుండటంతో భక్తుల నుంచి విస్మయం చెందుతున్నారు.


టెంట్లు లేక ఎండలోనే భోజనం చేస్తున్న భక్తులు

మండిన సూరీడు!

» అరకొర వసతులతో భక్తుల అవస్థలు

వన్‌టౌన్ : దుర్గగుడి అన్న ప్రసాద కేంద్రంలో అరకొర వసతులతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇరుకైన ప్రదేశంలో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు నగరంలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటడంతో ఎండ వేడిమికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. షామియానా వేసినప్పటికీ సరిపోకపోవటంతో భక్తులకు నీడ కరువైంది. భోజనాలు చేసే సమయంలో ఎండ వేడికి మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రెండోరోజు ఆదాయం రూ.38.22 లక్షలు

వన్‌టౌన్ : దసరా ఉత్సవాల సందర్భంగా రెండోరోజు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు రూ.38,22,105లు ఆదాయం వచ్చినట్టు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. రూ.500 (3,117) టిక్కెట్ల ద్వారా రూ.15,08,500లు, రూ.300 (1,577) టిక్కెట్లు.. రూ.4,73,100లు, రూ.100 (3,724) టిక్కెట్లు.. రూ.3,72,400లు వచ్చినట్టు తెలిపారు. లడ్డూ ప్రసాద విక్రయాలు రూ.15 (12,425) 1,86,375లు, ఆరులడ్లు ప్యాకింగ్ రూ.100 (10,503) రూ.10,50,300లు, కుంకుమార్చన పూజ రూ.3000లు (4టిక్కెట్లు) రూ.12,000లు, కుంకుమార్చన రూ.5,000 (3) రూ.15,000లు వచ్చినట్టు తెలిపారు. చండీహోమం రూ.4వేలు (8టిక్కెట్లు) రూ.32వేలు, శ్రీచక్ర నవావరణార్చన రూ.3వేలు (27 టిక్కెట్లు) రూ.81,000లు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.3,190లు, తలనీలాలు రూ.40లు (2,206 టిక్కెట్లు) రూ.88,240లు లభించినట్టు ప్రకటనలో తెలిపారు.


శృంగేరీ మఠం సమీపంలో లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న సిబ్బంది

దుర్గమ్మకు అత్యంత ప్రీతిపాత్రం

బూందీ లడ్డూ ప్రసాదం

మూడు తరాలుగా అమ్మవారి లడ్డూ ప్రసాదానికి ఎంతో విశిష్టత ఉంది. అమ్మవారి మహాప్రసాదంగా భావించే బూందీ లడ్డూ ఎంతో మధురమైనదని, దీనిని ఆస్వాదించటంతోనే ఎంతో ఆధ్యాత్మిక భావన కలుగుతుందని ఆలయ ముఖ్య అర్చకులు రంగావఝ్జల శ్రీనివాస శాస్త్రి చెబుతున్నారు. మూడుతరాల నుంచి లడ్డూ ప్రసాదం అమ్మవారికి నైవేద్యంగా పెట్టి భక్తులకు విక్రయిస్తున్నట్టు చెప్పారు. ప్రసాదం తయారీ.. వివరాలు ఆయన మాటల్లోనే..

(వన్‌టౌన్) : రాష్ట్రంలోనే ప్రసిద్ధ ఆలయంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు నివేదించిన లడ్డూ ప్రసాదానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. తీపి బూంది, బెల్లం కలిపిన అన్నం, పులిహోర తదితరాలు దుర్గమ్మకు అత్యంత పీత్రిపాత్రం. అందుకే దుర్గమ్మ భక్తులు లడ్డూ ప్రసాదాన్ని అపురూపంగా.. ఎంతో పుణ్యంగా భావిస్తారు. లడ్డూ ప్రసాదాలను దసరా ఉత్సవాల సమయంలో, భవానీ దీక్షల విరమణ సమయంలో లక్షల్లోనే తయారు చేస్తుంటారు. దసరా మహోత్సవాల సందర్భంగా అధికారులు సుమారు 27 లక్షల లడ్డూలను విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. అమ్మవారికి నిత్యం దద్దోజనం, కట్టుపొంగలి, చక్రపొంగలి, పులిహోర, కేసరి, పూర్ణాలు, గారెలు, అరిసెలు, తదతర పలురకాల ఆహార పదార్థాలు నైవేద్యంగా పెడుతుంటారు. చక్రపొంగలి, లడ్డూ, పులిహోర ప్రసాదాలను భక్తులకు విక్రయిస్తుంటారు.

లడ్డూ తయారీ ఇలా..

లడ్డూ ప్రసాదాల కోసం ప్రత్యేక దిట్టం తయారు చేయబడుతుంది. లడ్డూ 80 గ్రాముల బరువుంటుంది. ఒక కళాయికి 516 లడ్డూలు తయారు చేస్తారు. వీటిలో 6 కేజీల నెయ్యి, 10 కేజీల శనగపిండి, 20 కేజీల పంచదార, 750 గ్రాముల జీడిపప్పు, కిస్‌మిస్ లేదా ఎండుద్రాక్ష 500 గ్రాములు, యాలకులు 75 గ్రాములు, జాజికాయ 15 గ్రాములు, పచ్చకర్పూరం 15 గ్రాములు చొప్పున దిట్టంగా ఎండోమెంట్ శాఖ నిర్ణయించింది. 2009కి ముందు 30 కేజీల పంచదార, 500 గ్రాముల జీడిపప్పు, 15 కేజీల శనగపిండిని వినియోగించేవారు. నాణ్యత తక్కువగా ఉందని దిట్టంలో మార్పులు తెచ్చిన తరువాత లడ్డూ ప్రసాదాల వినియోగం బాగా పెరిగింది. సాధారణ రోజుల్లో రోజుకు సుమారుగా 40 వేల లడ్డూ ప్రసాదాన్ని విక్రయిస్తారు. తిరుమల లడ్డూ ప్రసాదం తరహాలోనే కనకదుర్గమ్మ ఆలయంలో లడ్డూకు అంతే ప్రాధాన్యత ఉంది.

దుర్గమ్మ దివ్య ప్రసాదం..

లడ్డూ తయారీకి వంటశాలలో ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. లడ్డూ ప్రసాదాలను ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగిస్తుంటారు. ఏఈవోల పర్యవేక్షణలో ముడి పదార్థాలను తెచ్చి దిట్టం ప్రకారం బూందీని తయారు చేస్తారు. బూంది తయారు కాగానే అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొత్తం రాశిలో కలుపుతారు. దీంతో అది దివ్య ప్రసాదంగా మారుతుంది. సాధారణ రోజుల్లో రోజుకు 80 మంది చొప్పున లడ్డూలను తయారు చేస్తారు. దసరా సమయంలో మూడు షిఫ్టుల్లో మొత్తం 250 నుంచి 300మంది పనిచేస్తారు. ప్రసాదాల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. లడ్డూ బరువు 80 గ్రాములు ఉండేలా చూస్తారు.

రూ. 5 నుంచి రూ.15కు పెరిగిన ధర

తొలుత లడ్డూ ధర రూ.5లుగా ఉండేది. చాలకాలం తరువాత రూ.10లు మార్చారు. లడ్డూ దిట్టం పెరగటం, తయారీ విషయంలోను, ధరల పెరుగుదల కారణంగా రూ.15లు చేశారు.

కొండ ఎక్కిన ఉత్సవ కమిటీ

» ఈవోతో సమావేశం » సదుపాయాల చిట్టా విప్పిన సభ్యులు

విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు సంబంధించి దేవదాయ శాఖ ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ శుక్రవారం ఇంద్రకీలాద్రి పైకి వచ్చింది. మొత్తం 53 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటైన విషయం తెలిసిందే. వారిలో కొంతమందితో ఈవో రామారావు తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. కొద్దిసేపు జరిగిన సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు తమకు చేయాల్సిన సదుపాయాల గురించి ఆయనకు వివరించినట్టు తెలిసింది. కొండ మీద వాహనాల రద్దీ తగ్గించడానికి పోలీసు, రెవెన్యూ శాఖలు వీవీఐపీ వాహన పాస్‌లను రద్దు చేశాయి. ఒక్క ప్రొటోకాల్ జాబితాలో ఉన్న కొద్ది వాహనాలకు మాత్రమే ఈ పాస్‌లు ఇచ్చారు. ఆలయ సిబ్బందికి సంబంధించిన ద్విచక్ర వాహనాలను మాత్రమే ఘాట్‌రోడ్డులోకి అనుమతిస్తున్నారు. ఆవిధంగా తాము ద్విచక్ర వాహనాలపై కొండపైకి వచ్చేందుకు వీలుగా పాస్‌లు ఇవ్వాలని ఈవోను కోరినట్టు తెలిసింది. దీనితోపాటు కుటుంబసభ్యులను దర్శనాలకు తీసుకొచ్చేందుకు ప్రత్యేక పాస్ ఇవ్వాలని అడిగినట్టు విశ్వసనీయ సమాచారం. కమిటీ సభ్యులు కూర్చునేందుకు చాంబర్లను కోరినట్టు తెలిసింది. ఈ కోరికల చిట్టా విన్న అనంతరం ఈవో పరిశీలిస్తానని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. వారిని ఉత్సవ కమిటీ సభ్యులుగా గుర్తించడానికి ఒక గుర్తింపును ఇచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యుల కుటుంబసభ్యులను తప్ప ఇతరులను ఎవరినీ దర్శనాలకు ప్రోత్సహించవద్దని ఈవో సూచించినట్టు సమాచారం. కొండపైకి వచ్చిన ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాజగోపురానికి వెళ్లే ఖాళీ ప్రదేశంలో కూర్చుని ఉన్నారు. కొంతమంది సభ్యులు తొలి రోజు నుంచే నానా హంగామా చేయడం మొదలుపెట్టారు.

ఉత్సవాల్లో సైబర్ అవగాహన

విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెట్టుబడి పెట్టండి రెట్టింపు ఆదాయం పొందండి. మీ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి, విచారణకు రండి.. ఇవన్నీ సైబర్ నేరాల్లో భాగాలు. ఈ నేరాల్లో అనేకమంది లక్షలాది రూపాయలను కోల్పోతున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నా కేసులు పెరుగుతున్నాయి తప్ప రికవరీ పెద్దగా ఉండడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం ద్వారానే వాటికి అడ్డుకట్ట వేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఇందుకోసం వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి రద్శనానికి వచ్చే భక్తులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. క్యూలైన్ ప్రారంభమయ్యే వినాయకుడి ఆలయం వద్ద, స్నానపు ఘాట్లు, కేశఖండన శాలతోపాటు దుర్గా ఘాట్, కుమ్మరిపాలెం వైపున భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రులకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలామంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. వారికి కరపత్రాలు పంపిణీ చేయడంతోపాటు ఆయా నేరాలు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాల అన్న అంశాలను వివరిస్తూ విజిటింగ్ కార్డులు పంపిణీ చేయాలని భావించారు. ఇలా చేయడం వల్ల ప్రజల్లో ఎంతోకొంత అవగాహన పెరుగుతుందన్న భావనలో పోలీసులు ఉన్నారు.



దుర్గగుడి ప్రాంతంలో సైబర్ క్రైమ్ బ్యానర్


సామూహిక కుంకుమ పూజలో..

ప్రణతులివే పంచముఖీ..

(7వ పేజీ తరువాయి)

కృష్ణానదిలో స్నానాలు ఆచరించి క్యూల్లోకి వెళ్తున్నారు. ఉదయం 6 గంటల్లోపు దర్శనం చేసుకుని తిరిగి సొంత ప్రాంతాలకు పయనమవుతున్నారు. వీవీఐపీ, వీఐపీ దర్శనాలను కట్టడి చేస్తుండటంతో సామాన్య భక్తుల క్యూలు వేగంగా కదులుతున్నాయి. సాధారణ భక్తులతో పాటు భవానీమాలలు ధరించిన భక్తులు క్రమంగా పెరుగుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది. దీంతో క్యూల్లో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వినాయకుడి ఆలయం వద్ద నుంచి క్యూలు ఖాళీగా ఉండటంతో భక్తులు వేగంగా ఘాట్‌రోడ్డు వద్దకు చేరుకుంటున్నారు. అక్కడి నుంచి క్యూ కదలడానికి బ్రేకులు పడుతున్నాయి. ఇక్కడ భక్తులు ఆగిపోయినప్పుడు గాలి లేక ఉక్కపోతకు గురవుతున్నారు. క్యూలైన్లలో భక్తుల నీడ కోసం ఏర్పాటు చేసిన స్తంభాలకు రొటేషన్ ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే బాగుండేదని వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు అభిప్రాయపడుతున్నారు. వీవీఐపీ దర్శనాల్లో ఎవరెవరు వెళ్తున్నారో పరిశీలించడానికి ఈవో కేఎస్ రామారావు, ఏడీసీపీ జి.రామకృష్ణ మీడియా పాయింట్ ఎదురుగా ఉన్న ఎంట్రన్స్ వద్ద ఉంటున్నారు.


అన్న ప్రసాదం క్యూలైన్‌లో భక్తులు..

న్యూస్ బాక్స్


ఎండీయూ వాహనంపై యథావిధిగా జగన్మోహన్ రెడ్డి ఫొటో

ఎండీయూ ఆపరేటర్

స్వామి భక్తి!

» జగన్ బొమ్మతోనే రేషన్ పంపిణీ

రెడ్డిగూడెం : కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు మాసాలు దాటినా కొందరు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై స్వామి భక్తిని చాటుకుంటునే ఉన్నారు. రెడ్డిగూడెం శివారు రాఘవాపురం గ్రామంలో ఏపీ 39 టిక్యూ 7073 నెంబరు రేషన్ సరఫరా వాహనంపై జగన్ రెడ్డి ఫొటో పెట్టి ఎండీయూ ఆపరేటర్ బియ్యం సరఫరా చేస్తున్నాడు. వైసీపీ రంగులు సైతం వాహనంపై దర్శనమిస్తున్నాయి. అడిగే వారు లేక పోవడంతో కొందరు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైభవంగా నగరోత్సవం

లబ్బీపేట : దసరా ఉత్సవాల్లో రెండవ రోజు నగరోత్సవం వైభవంగా జరిగింది. పల్లకిలో ఆదిదంపతులు ఊరేగుతూ భక్తులకు కన్నుల పండుగగా దర్శనమిచ్చారు. నగరోత్సవం జరుగుతున్న సమయంలో కొండ కింద నుండి పై వరకు క్యూలైన్లో ఉన్న భక్తులు ఈ సమయంలో ఆదిదంపతులను దర్శించుకోవడం అని పరవశించారు.

అమృతాన్ని కాదని..

(7వ పేజీ తరువాయి)

- విజయవాడ రైల్వేస్టేషన్‌లో అదనపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ)లను ఏర్పాటు చేయాలి.
- విజయవాడ స్టేషన్‌లో ఎస్కలేటర్లను పునరుద్ధరించాలి.
- కొండపల్లి, ఈలప్రోలు, రాయనపాడు, గొల్లపూడి ఆర్వోబీ పనులను త్వరగా పూర్తి చేయాలి.
- హౌరా రైళ్లను విజయవాడ నార్త్ సెక్షన్ నుంచి ఆపరేట్ చేయాలి.
- 2023, మార్చి 2న రైల్వే జాయింట్ సర్వే ఆధారంగా ఆర్‌వోబీల నిర్మాణాన్ని 100 శాతం రైల్వే ఖర్చుతోనే జరపాలి.
- కొండపల్లి ఎల్‌సీ నెంబర్ 140, ఈలప్రోలు ఎల్‌సీ నెంబర్ 147 దగ్గర ఆర్‌వోబీని ఆమోదించాలి.
- రాయనపాడు వద్ద ఆర్‌వోబీతో పాటు ఆర్‌యూబీని కూడా మంజూరు చేయాలి.

హామీల అమలుకు నివేదికలివ్వండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు మచిలీపట్నం పర్యటనలో ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు అధికారులు తగు నివేదికలు తయారు చేయడంతోపాటు, చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం వివిధశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆంధ్రాజాతీయ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని సీఎం హామీ ఇచ్చారని, కళాశాలకు సంబంధించిన స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రా జాతీయ విద్యాపరిషత్ పరిధిలో జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఓరియంటల్ హైస్కూల్, బీఈడీ కళాశాల, ఐటీఐ, వ్యవసాయ పాలిటెక్నిక్ వంటి విద్యాసంస్థలు ప్రస్తుతం నడుస్తున్నాయని, ఈ సంస్థ దేవదాయశాఖ పరిధిలో ఉందని, కళాశాల కరస్పాండెంట్ కుటుంబరావు, ప్రిన్సిపాల్ మురళీమోహన్ వివరించారు. ఆంధ్రాజాతీయ విద్యా పరిషత్‌కు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను తనకు అందించాలని కలెక్టర్ అన్నారు. మచిలీపట్నంలో బీసీ కమ్యూనిటీ హాలు, డ్రెయిన్‌ల సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటివరకు చేపట్టిన పనులు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. బందరుపోర్టు పనులను వేగవంతం చేయాలని, పనులు జరుగుతున్న తీరుపై తనకు నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ వెంకట్రావ్, బందరుపోర్టు ఈఈ కేవీకే పల్లారావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535



లయోలాలో 5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీపై సదస్సు

భారతీనగర్, అక్టోబరు 4: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, ఇంజనీరింగ్ విభాగం, కమ్యూనికేషన్ రీసెర్చ్ గ్రూప్ ఆధ్వర్యంలో 5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, సహాయ డైరెక్టర్ ఫాదర్ డి బాలస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ. మహేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కాండీడికునా, డీన్ ప్రొఫెసర్ ఎం. రామకృష్ణ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె.ప్రశాంతి జాస్మిన్, ఈసీఈ విభాగం 3, 4 సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంతరం తాగునీరు, విద్యుత్ సరఫరాకు

సుజనా ఫౌండేషన్ చర్యలు

●పశ్చిమ నియోజకవర్గం 49వ డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టు

మొగల్రాజపురం, అక్టోబరు 4: పశ్చిమలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో లోపాలను అధిగమించి నిరంతరంగా సరఫరా చేసేందుకు వీలుగా సరికొత్త విధానం అమలు చేసేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 49వ డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ తెలిపారు. విన్నమనేని రోడ్డులో ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకోసం సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూర్ణగ్లోబల్ స్ట్రాటజీస్, స్మిత్ కన్సల్టెన్సీలు సర్వే చేశాయన్నారు. వీఎంసీ జోనల్ కమిషనర్ కీర్తన ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో మొత్తం డివిజన్లలో కొండప్రాంతాలలో 11, మైదాన ప్రాంతంలో 11 డివిజన్‌లు ఉన్నాయని కొండప్రాంతాల్లో పై వరకు బూస్టర్‌లలో మంచినీటి సరఫరా చేస్తున్నా ఇంకా సమస్యలు వస్తున్నాయన్నారు. అదే విధంగా విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయాలు వస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ అంతరాయాలు లేకుండా కన్సల్టెన్సీల సర్వే ప్రకారం 24గంటలు మంచినీరు, విద్యుత్ సరఫరా కోసం పైలట్ ప్రాజెక్టులకు 49వ డివిజన్‌ను ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి తద్వారా విద్యుత్ సరఫరా నిరంతరం ఉండే విధంగా ఇప్పటికే కోయంబత్తూర్‌లో అమలవుతున్న విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేస్తారని చెప్పారు. మంచినీటి వృధాను అరికట్టి ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు ఈ ప్రాజెక్టులో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేస్తామన్నారు. ఇక్కడ సక్సెస్ కాగానే రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నియోజకవర్గం మొత్తం అమలు చేసేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రయత్నం చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో వీఎంసీ జోనల్ కమిషనర్ కీర్తన, కన్సల్టెన్సీ ప్రతినిధులు రఘునందన్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, వీఎంసీ జోనల్ కమిషనర్ కీర్తన

కొండ ప్రాంతాల్లో రాళ్లు పడకుండా పటిష్ట చర్యలు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మాచవరం, అక్టోబరు 4 : వర్షం భారీగా పడినప్పుడు కొండ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశంపై ఆలోచనలు చేస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 6వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన స్థానిక ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కొండప్రాంతాల్లో రాళ్లు దొర్లి ఇళ్లపై పడ్డాయని, ఆరుగురు మృతి చెందారని తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో నేతలు పడాల గంగాధర్, పల్లి దుర్గాప్రసాద్, వడ్డేపల్లి కేశవ్, మజ్జి రామినాయుడు, పడాల వాసు, మొకర గురునాధం, షేక్ షకీలా తదితరులు పాల్గొన్నారు.



కొండ ప్రాంత వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె

వరద బాధితులకు పాత దుస్తులు పంపిణీ

వన్‌టౌన్, అక్టోబరు 4: మినర్వా గ్రాండ్ హోటల్ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల వరదలలో నష్టపోయిన బాధితులకు పాత వస్త్రాలను సేకరించి వాటిని పంపిణీ చేశారు. హోటల్ యాజమాన్యం ఇచ్చిన పిలుపు మేరకు చీరలు, షర్టులు, ట్రౌజర్‌లు, చిన్నపిల్లల దుస్తులు, దుప్పట్లు మొత్తం 6 వేల మేరకు సేకరించారు. వీటిని ఈనెల 2న గాంధీ జయంతి సందర్భంగా వాంబేకాలనీలో స్థానిక పేదలకు పంపిణీ చేసేందుకు కమ్యూనిటీ హాల్‌లో ప్రదర్శించారు. సుమారు 2 వేల కుటుంబాల వారు వారికి కావాల్సిన దుస్తులను ఎంపిక చేసుకుని తీసుకువెళ్లినట్లు జనరల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



పల్లా శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న టీఎన్‌టీయూసీ నేతలు

టీఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

పాయకాపురం, అక్టోబరు 4 : తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్(టీఎన్‌టీయూసీ) బలోపేతానికి మరింత కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ నేతలు పల్లా శ్రీనివాస్‌కు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, అశోక్‌బాబు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరిరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ పాల్గొన్నారు.

లిడ్‌క్యాప్ ఛైర్మన్ మాణిక్యరావుకు అభినందనలు

లబ్బీపేట, అక్టోబరు 4: ఏపీ లిడ్‌క్యాప్ ఛైర్మన్‌గా పదవి బాధ్యతలు తీసుకున్న పిల్లి మాణిక్యరావును హైకోర్టు న్యాయవాది నంబూరి నాగేశ్వరరావు, విద్యుత్ శాఖాధికారి గద్దల స్టాలిన్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాణిక్యరావు లిడ్ క్యాప్ సంస్థను అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆశిస్తున్నామని అన్నారు.



మాణ్యిరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాగేశ్వరరావు, స్టాలిన్

వరద బాధిత విద్యార్థులకు చేయూత



అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 4 : అజిత్‌సింగ్‌నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో వరద బాధిత విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఈజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదవి ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరేంద్ర, అకడమిక్ కో-ఆర్డినేటర్ జే. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సుమాకిరణ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జి. కోటేశ్వరరావు

పారదర్శకంగా ఎన్యూమరేషన్ చేయాలి

సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 4 : బుడమేరులో ఆక్రమణలను తొలగించి పటిష్టపరచాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుడమేరు వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, పారదర్శకంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేసి వరద బాధితులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ 58వ డివిజన్ కృష్ణాహోటల్ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్యూమరేషన్‌లో ముంపునకు గురైన కొంత మంది బాధితుల పేర్లు నమోదు కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు వరద బాధితులకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు, నేతలు లక్ష్మీనారాయణ, ఎస్‌కె. భాష, కంది ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారు, గాయత్రీదేవి అలంకారంలో విజయదుర్గా అమ్మవారు,చిట్టినగర్ మహాలక్ష్మి ఆలయంలో నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సెంట్రల్ ఫైనాన్స్ కొప్పురావూరి రోహిన్

కోర్కెలు తీర్చే చల్లనితల్లి బాలా త్రిపుర సుందరీదేవి

చిట్టినగర్, అక్టోబరు 4: కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, చల్లని దీవెలను అందించే కల్పవల్లిగా, ధగ ధగ మెరిసే పట్టు వ స్త్రాలతో, దివ్యమైన హారాలు ధరించి , అభయహస్తాన్ని ప్రదర్శిస్తూ అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. జ్ఞాన శక్తిని ప్రసాదించడంతో పాటు ముక్తిని కలిగించే తల్లి గనుక బాలా త్రిపుర సుందరీ అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. పాతబస్తీలో పలు దేవాలయాల్లో దసరా మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. చిట్టినగర్‌లో ఉన్న శ్రీ కొత్తమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

● చిట్టినగర్‌లో ఉన్న మహాలక్ష్మి అమ్మవారిని డిప్యూటీ డైరెక్టర్ సెంట్రల్ ఫైనాన్స్ కొప్పు రావూరి రోహిన్ దర్శించుకొని పూజలు చేశారు. నృత్య ప్రద ర్శనలు చేసి విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

●పాలఫ్యాక్టరీ ఎదురుగా ఫ్లైఓవర్ సమీపంలోని విజయదుర్గా అమ్మవారు గాయత్రిదేవి అలంకార లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమపూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● కొత్తపేటలో ఉన్న మంగళగౌరి అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

● వీఎంసీ కాలనీలో ఉన్న కనక దుర్గమ్మఅమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శించుకున్నారు.

● పాలఫ్యాక్టరీ నాగమ్మ సత్రం వద్ద గల వీ రాంజనేయస్వామి ధ్యాన మందిరంలోని కాశీ అన్న పూర్ణాదేవి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భ క్తులు దర్శించుకున్నారు.



సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కు అందిస్తున్న సీనియర్ సిటిజన్లు

వరద బాధితులకు సీనియర్ సిటిజన్స్ రూ.2 లక్షల విరాళం

పటమట, అక్టోబరు 4 : వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతుగా పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున సమకూర్చిన రూ.2 లక్షల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావు అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు కోనేరు వెంకటేశ్వరరావు, వి శంకరరావు, ఎల్. నాగేశ్వరరావు, డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.



శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో | ఊర్మిళానగర్‌లో ఉన్న గ్రామదేవత పోలేరమ్మ | బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, పాత శివాలయంలో | గాయత్రీదేవిగా ధనకొండ అమ్మవారు | బాలా త్రిపుర సుందరీదేవిగా కాళీమాత అమ్మవారు

ఆర్థిక బాధలతో కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య

వన్‌టౌన్, అక్టోబరు 4: ఆర్థిక ఇబ్బందులు తాళలేక, చేసిన అప్పులు తీర్చలేక విజయవాడ నగరపాలక సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న బండారు పవన్ కుమార్ (37) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక తిరుమలరావు వీధిలో పవన్‌కుమార్ భార్య, కుమార్తెతో ఉంటున్నాడు. ఇతను కృష్ణలంక హైస్కూల్ సమీపంలో ఉన్న వీఎంసీ డ్రెయినేజీ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంత కాలం నుంచి ఆర్థిక ఇబ్బందులతో పాటు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం డ్రెయినేజీ పంపు ప్రాంగణంలో ఉన్న గదిలో ఉరివేసుకుని ఉన్నాడు. కొద్దిసేపటి తరువాత రఘు అనే సహోద్యోగి వచ్చి చూడగా పవన్ కుమార్ వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతను స్థానికుల సహాయంతో కిందకు దించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. రఘు ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చిట్టినగర్, అక్టోబరు 4: వివాహేతర సంబంధం కారణంగా జరిగిన దాడిలో ఓ వ్యక్తి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటన కొత్తపేట స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం కొత్తపేట పోతిన వారివీధిలో ఏసీ మెకానిక్ పిల్లి సాయికుమార్(22) కుటుంబంతో ఉంటాడు. అతనికి, కొండా యోహోవా అలియాస్ చిచ్చా అనే వ్యక్తికి ఒక యువతితో వివాహేతర సంబంధం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి కొండా యోహోవా, అతని స్నేహితుడు కుమార్‌తో కలసి వచ్చి సాయికుమార్‌తో గొడవ పడి చాకుతో పొడిచాడు. గాయాలతో సాయికుమార్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అయితే స్థానికులు మాత్రం ఇక్కడ నిత్యం గంజాయి బాబులు గంజాయి తాగుతూ స్థానికులను ఇబ్బందులు పెడుతున్నారని, పోలీసులకు చెప్పినా పట్టించుకోవడంలేదని, తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వాపోతున్నారు. బ్లేడ్, గంజాయి బాబుల ఆగడాలపై నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు స్థానికులు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది.




దర్శిపేట రాజరాజేశ్వరి అమ్మవారు



శ్రీ మద్దిరావమ్మ తల్లి ఆలయంలో

సుప్రీం ఆదేశాలను స్వాగతిస్తున్నా: చంద్రబాబు



అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం జారీ చేసిన ఆదేశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. 'సుప్రీంకోర్టు ఆదేశాలను నేను స్వాగతిస్తాను. సీబీఐ, ఏపీ పోలీసు, జాతీయ ఆహార ప్రమాణాల సంస్థ అధి కారులతో కలిపి సిట్ వేసి లడ్డూ కల్తీపై విచారణ జరిపించాలని నిర్ణయించడం హర్షణీయం' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

స్వతంత్ర సిట్‌ను స్వాగతిస్తున్నాం



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్య

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి మహాప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై ఐదు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతించారు. స్వతంత్ర సిట్ విచారణ ద్వారా సత్యం వెలుగు చూస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం విషయం వెల్లడైనప్పటికి నుంచి సనాతన ధర్మాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఆందోళనలో ఉన్నారని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'గత ప్రభుత్వంలో టీటీడీ బోర్డుల హయాంలో లడ్డూ ప్రసాదం కావచ్చు.. స్వామివారికి చేసే కైంకర్యాలు కావచ్చు.. అన్నప్రసాదం కావచ్చు.. అన్నింటా నాణ్యతా ప్రమాణాలు లోపించాయనే భక్తుల ఆవేదనను పరిగణనలోకి తీసుకోవాలి. గత పాలక మండళ్లు తీసుకున్న నిర్ణయాలు, వారి పాలనను సమగ్రంగా సమీక్షించి, సంస్కరించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. అపవిత్ర చర్యలకు కారకులైన వారిని నిబంధనల ప్రకారం బాధ్యులను చేస్తాం' అని స్పష్టం చేశారు.

సిట్‌ను సుప్రీం బలోపేతం చేసింది: వర్ల

లడ్డూ కల్తీ వ్యవహారంపై విచారణకు రాష్ట్రప్రభుత్వం నియమించిన సిట్‌ను సుప్రీంకోర్టు మరింత బలోపేతం చేసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. 'సుప్రీం చర్య మరింత పకడ్బందీగా నిందితులను పట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. దొంగల టీం ఖచ్చితంగా జైలుకు వెళ్తుంది. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన అండతో టీటీడీని అడ్డగోలుగా దోచుకున్న ఆయన బంధువులు, మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి భాగోతాలు బయటకు వస్తాయి. జగన్ ఏరికోరి తెచ్చి ఈవోగా పెట్టిన ధర్మారెడ్డి అధర్మాలు కూడా బయటకు రావడం ఖాయం' అన్నారు.

జగన్ కనుసైగ చేస్తే టీడీపీ ఉండేది కాదు:సజ్జల

గుంటూరు, అక్టోబరు 4: 'జగన్ సీఎంగా ఉన్నప్పుడు కనుసైగ చేసినా టీడీపీ ఉండేది కాదు... అధికారంలోకొచ్చిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం అరాచకాలు చేస్తోంది.. వచ్చే ఎన్నికల వరకు వైసీపీ కార్యకర్తలూ మీరూ రెడ్ బుక్‌లు రాసుకోండి..' అని ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపిచ్చారు. గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల పార్టీ కోఆర్డినేటర్‌గా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పదవీ స్వీకారసభ శుక్రవారం గుంటూరులో జరిగింది. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడారు. తిరుమల లడ్డూ పవిత్రతపై సీఎం చంద్రబాబు చేసిన రాజకీయం.. సుప్రీంకోర్టు మొట్టికాయలతో బయటి ప్రపంచానికి తెలిసిందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాషాయ వస్త్రాలు ధరించి సనాతన ధర్మమంటూ హడావుడి చేస్తున్నారని.. తన పార్టీని త్వరలో బీజేపీలో కలిపేలా ఉన్నారని వ్యాఖ్యానించారు.

దర్యాప్తునకు సహకరించాలి

మాజీ పోలీసు అధికారి విజయ్‌పాల్‌ను ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ వ్యవహారంలో మాజీ పోలీస్ అధికారి విజయ్ పాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తదుపరి విచారణ వరకు ఆయనపై ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. రఘురామపై కస్టోడియల్ టార్చర్ వ్యవహారంలో విజయ్‌పాల్ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి వరాలేతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ వరకు ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోవద్దని సూచించింది. దర్యాప్తునకు పూర్తి స్థాయిలో సహకరించాలని విజయ్ పాల్‌ను ఆదేశించింది.

అడ్డంగా దొరికిపోయిన 'కల్తీ' కేటుగాళ్లు

తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా నిజం

నెయ్యి గోల్‌మాల్‌పై సెప్టెంబరు 26న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం



స్టేట్ జీఎస్టీ నివేదికలో విస్తుగొలిపే నిజాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కల్తీ నెయ్యి దొంగలు అడ్డంగా దొరికిపోయారు! భక్తులు పరమ పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిని అడ్డదిడ్డంగా కల్తీ చేశారని రుజువైంది. 'మాది స్వచ్ఛమైన నెయ్యి. మేం ఏ పాపమూ ఎరుగం' అని ఏఆర్ డెయిరీ చెప్పినవన్నీ అచ్చోసిన అబద్ధాలని స్పష్టమైంది. ఏఆర్ డెయిరీ పేరుతో వచ్చిన నెయ్యి 'పక్కా లోకల్' అని, తమిళనాడులోని దిండిగల్ నుంచి రాలేదని 'ఆంధ్రజ్యోతి' ఇది వరకే ప్రచురించిన కథనం అక్షర సత్యమని రుజువైంది. ఈ నెయ్యి ట్యాంకర్ల కదలికలు, కొనుగోళ్లు, వాటి మూలాలపై రాష్ట్ర జీఎస్టీ విభాగం టీటీడీ ఈవోకు సవివరమైన నివేదిక సమర్పించింది. ఉత్తరప్రదేశ్‌లోని భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్, తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీతోపాటు తిరుపతి జిల్లా పెనుమాకలో ఉన్న వైష్ణవి డెయిరీ మధ్య పెనవేసుకున్న 'నెయ్యి' బంధం జీఎస్టీ ఇన్‌వాయిస్‌లు, వే బిల్లులు, ట్యాంకర్ నంబర్లతో సహా స్పష్టమైంది. ఏఆర్ డెయిరీ నానారకాలుగా కల్తీ చేసిన నెయ్యినే తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి సరఫరా చేసిందనే విషయం ఆధారాలతో సహా రుజువైంది.



కల్తీ బంధం...

టీటీడీకి నెయ్యి సరఫరా చేసే టెండరు దక్కించుకున్న ఏఆర్ డెయిరీ అడ్డగోలు దందాలు చేసింది. పేరు మాత్రమే ఏఆర్ డెయిరీది. నెయ్యి మాత్రం... వైష్ణవి డెయిరీది. ఇక్కడ ట్యాంకర్లను నింపేసి.. ఇన్‌వాయిస్‌లు మార్చేసి ట్యాంకర్లను నేరుగా తిరుమలకు పంపించింది. ఇక్కడే పెద్ద మాయ జరిగింది. తిరుపతి జిల్లాలోని వైష్ణవి డెయిరీ... కాన్పూర్‌లో ఉన్న భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ నుంచి నెయ్యి కొనుగోలు చేసింది. జూన్, జూలై నెలల్లో పలుమార్లు యూపీ నుంచి నెయ్యిని దిగుమతి చేసుకుంది. భోలే బాబా నుంచి సగటున కిలో నెయ్యి రూ.355లకు కొనుగోలు చేసింది. ఇదే నెయ్యిని ఏఆర్ డెయిరీకి కిలో రూ.318.57లకు అమ్మింది. అంటే... కొన్న రేటుకంటే 37 రూపాయలు తక్కువ! నెయ్యిని నానారకాలుగా కల్తీ చేసి, అడ్డమైన కొవ్వులూ కలిపేస్తే తప్ప గిట్టుబాటుకాని ధర ఇది! ఇలా వైష్ణవి నుంచి కొనుగోలు చేసిన 8 ట్యాంకర్ల నెయ్యి ఏఆర్ డెయిరీ పేరుతో తిరుమలకు చేరుకుంది. ఇందులో నాలుగు ట్యాంకర్లతో లడ్డూలు తయారు చేసేశారు. వాటి నాణ్యతపై భారీగా ఫిర్యాదులు రావడంతో... తదుపరి దశలో వచ్చిన 4 ట్యాంకర్ల నుంచి శాంపిల్స్ తీసి గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వాడిన నెయ్యి ఘోరమైన స్థాయిలో కల్తీ జరిగినట్లు ఎన్‌డీడీబీ ప్రయోగశాల స్పష్టమైన నివేదిక ఇచ్చింది.

దారి తప్పి.. దాగుడు మూతలు...

- తిరుమలకు ఏఆర్ డెయిరీ పంపిన 8 నెయ్యి ట్యాంకర్ల 'కదలిక'లను రాష్ట్ర జీఎస్టీ అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు. ఇందులో విస్తుగొలిపే వాస్తవాలు బయటపడ్డాయి.
- ఏఆర్ డెయిరీ పేరుతో వచ్చిన 8 ట్యాంకర్లు... పెనుబాకలోని వైష్ణవి డెయిరీలోనే నెయ్యి నింపుకొన్నాయి. ఏదీ దిండిగల్ నుంచి బయలుదేరి తిరుమలకు రాలేదు.
- మొత్తం ఐదు వాహనాలు ఎనిమిది ట్రిప్పుల్లో నెయ్యిని తిరుమలకు తీసుకొచ్చాయి. ఇందులో నాలుగు తమిళనాడు రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న ట్యాంకర్లు. ఈ నాలుగు వైష్ణవిలో నెయ్యిని నింపుకొని... దిండిగల్‌కు వెళ్లి... అక్కడి నుంచి తిరుమలకు చేరుకున్నాయి.
- ఏపీ26టీసీ4779 అనే నెంబరు ఉన్న ట్యాంకర్ మాత్రం పెనుబాకలోని వైష్ణవి డెయిరీ నుంచి నేరుగా తిరుమలకు ట్రిప్పులు వేసింది. ఈ ట్యాంకర్ టీటీడీకి మూడుసార్లు నెయ్యిని తీసుకొచ్చింది.
- తిరుపతి-దిండిగల్ మధ్య గాదంకి, మహాసముద్రం, దానమయ్యగారిపల్లె, ఎల్ అండ్ టి కృష్ణగిరి తోపూర్, ఓమలూర్, రాసంపాళ్యం, వేలంశెట్టియూర్ టోల్‌గేట్లు ఉన్నాయి. కొన్ని ట్యాంకర్లు ఎస్‌వీపురం, తళ్లికొండ, వాణియంబాడి జంక్షన్ మీదుగా ప్రయాణించాయి. ఐదు వాహనాలు ఈ టోల్‌గేట్లను దాటి తిరుపతికి చేరుకోగా... ఏపీ26టీసీ4779 ట్యాంకర్ మాత్రం టోల్ గేట్ల మీదుగా ప్రయాణమే చేయలేదు. ఏఆర్ డెయిరీ పేరుతో పెనుబాక నుంచి నేరుగా తిరుమలకు నెయ్యి తెచ్చేసింది.
- నాలుగు వాహనాలు పెనుబాక నుంచి దిండిగల్‌కు వెళ్లి... అక్కడి నుంచి తిరుమలకు వచ్చాయి. ఇవి ఐదు లోడ్లను సరఫరా చేశాయి. ఒక ట్యాంకర్ మాత్రం వైష్ణవి (పెనుబాక) నుంచి మూడు లోడ్లను నేరుగా తిరుమలకు తీసుకొచ్చింది. ఇందులో మతలబేమిటి? 'కల్తీ' ప్రయాణంలో మజిలీలు ఎన్ని?
- వైష్ణవీ డెయిరీ... భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ నుంచి అనేకసార్లు నెయ్యి కొనుగోలు చేసింది. ఒక్క జూన్ నెలలోనే... రూ.412తో 19,500 కేజీలు... రూ.403 రేటుకు 29,000 కేజీలు... రూ.313.60 ధరతో 1.58 లక్షల కిలోల నెయ్యిని కొనుగోలు చేసింది. ఇక జూలైలో కిలో రూ.403 చొప్పున 64 వేల కేజీలు, రూ.412 రేటుతో 19,500 కేజీలు కొనుగోలు చేసింది. ఇదే నెయ్యిని వైష్ణవీ డెయిరీ దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీకి విక్రయించింది.

సత్యం నిలిచి గెలుస్తుంది: లోకేశ్



సత్యం నిలిచి గెలుస్తుందని మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. 'లడ్డూ కల్తీ వ్యవహారంపై ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తును మరింత బలోపేతం చేసే దిశగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నాను. జాతీయ సంస్థలైన సీబీఐ, ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటివి దర్యాప్తులో భాగం కావడం కల్తీ వెనుక ఉన్న నిందితులను నిర్దిష్టంగా గుర్తించడానికి దోహదపడుతుంది. తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారెవరో తేలుతుంది' అని ట్వీట్ చేశారు.

లడ్డూపై నిజాలు బయటకు రావాలి: అనిత

అనకాపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వ్యవహారంలో ఇప్పటికైనా నిజాలు బయటకు రావాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. వైసీపీ నాయకులు తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, కోర్టు చెప్పినట్టు సీబీఐ అధికారులతో కలిసి పనిచేసేందుకు ఇద్దరు పోలీసు అధికారులను నియమిస్తామని శుక్రవారమిక్కడ చెప్పారు. తానుంటే అన్ని పథకాలూ వచ్చేవని జగన్ అంటున్నారని, ఆయన ఉండకూడదనే మొన్నటి ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు 11 సీట్లు ఇచ్చారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు.

వైసీపీ హయాంలో హిందూ ఆలయాలపై దాడులు

తిరుపతిలో జగన్ రూల్స్ పాటించలేదు : కేంద్ర మంత్రి వర్మ

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో హిందూ ఆలయాలపై దాడులతో హైందవ ధర్మానికి హేళన జరిగిందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వ్యాఖ్యానించారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి రథం తగుల బెట్టడం నుంచి వందలాది హిందూ ఆలయాలపై వైసీపీ ప్రభుత్వంలో దాడులు జరిగాయని గుర్తుచేశారు. హిందూ ధర్మాన్ని, తిరుమలలో నిబంధనల్ని అవహేళన చేసి వ్యక్తి గత ముఖ్యమంత్రి జగన్ రెడ్డేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌తో చర్చించినట్లు కేంద్ర మంత్రి వర్మ తెలిపారు.

నా హయాంలో ఏఆర్ డెయిరీ బిడ్ వేయలేదు

టీడీపీ ప్రభుత్వం వచ్చాకే నెయ్యి సరఫరా మొదలు: వైవీ

న్యూఢిల్లీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న నాలుగేళ్ల సమయంలో నెయ్యి సరఫరా కోసం ఏఆర్ డెయిరీ ఫుడ్స్ కంపెనీ బిడ్ కూడా దాఖలు చేయలేదని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. భూమన కరుణాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఆ సంస్థ నెయ్యి సరఫరా చెయ్యలేదని, అసలు వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ కంపెనీ నుంచి నెయ్యి సరఫరానే జరుగలేదని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాకే ఏఆర్ డెయిరీ కంపెనీ నెయ్యి సరఫరా మొదలెట్టిందన్నారు. శుక్రవారమిక్కడ సుప్రీంకోర్టులో తిరుపతి లడ్డూ వివాదంపై విచారణ అనంతరం సుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణల వెనుక నిజానిజాలు అందరికీ తెలియాలనే సుప్రీంను ఆశ్రయించినట్లు తెలిపారు. ఆరోపణలు నిజమని తేలితే ఎటువంటి శిక్షకైనా సిద్ధమన్నారు.



తీర్పు కాపీ రాకముందే.. జగన్ వక్రభాష్యాలు

- టీటీడీ పాలక మండలి కాదు.. ధర్మకర్తల మండలి
- దానిని వాణిజ్య సంస్థగా మార్చేందుకు వైసీపీ సర్కారు యత్నం
- సామాన్యుడికి స్వామిని దూరం చేసింది
- ఆర్థిక మంత్రి కేశవ్ మండిపాటు

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం వక్రీకరించి చెప్పగల సమర్థుడు వైఎస్ జగన్ అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. నిజం చెప్పులు వేసుకునే లోపే అబద్ధం ఊరంతా తిరిగినట్లుగా ఆయన సుప్రీం తీర్పు కాపీ బయటకు రాక ముందే.. గంటన్నర ప్రెస్‌మీట్ పెట్టి వక్రభాష్యాలు చెప్పి వెళ్లిపోయారని దుయ్యబట్టారు. సీఎం చంద్రబాబుపై దుమ్మెత్తిపోయడానికే ఈ విలేకరుల సమావేశం పెట్టారని ఆరోపించారు. శుక్రవారమిక్కడ ఎన్టీఆర్ భవన్‌లో పయ్యావుల మీడియాతో మాట్లాడారు. 'జగన్ ఆత్మరక్షణలో పడి విలవిల్లాడుతున్నారు. ఒకవైపు నైరాశ్యంలో ఉన్న కేడర్.. మరోవైపు ఆయన్ను విడిచిపెట్టిపోతున్న నాయకులు. సొంత బంధువులు, రాజ్యసభ సభ్యులు పక్కపార్టీ గూటికి చేరుతున్నారు. రాజకీయంగా మనుగడ కోల్పోతున్నామన్న భయంతో జగన్ ఇలాంటి విన్యాసాలు చేస్తున్నారు' అని విమర్శించారు. సుప్రీం ఆదేశాల మేరకు జరిగే విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నట్లు జగన్ చెప్పి ఉండాల్సిందని.. కానీ ఆ మాట ఎక్కడా చెప్పలేదని అన్నారు. తిరుమలేశుడి ఆలయ సెట్టింగ్‌నే ఇంటిలో వేయించుకున్న మహానుభావుడని ఎద్దేవాచేశారు. ఆయన ఐదేళ్ల పాలనలో తిరుమల ప్రాశస్త్యం గురించి మాట్లాడారా అని నిలదీశారు. టీటీడీలో అక్రమాలకు సంబంధించి తనపై ఓవైపు విజిలెన్స్ విచారణ జరుగుతుండగా, దానిపై హైకోర్టులో పిటిషన్ వేసిన మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీం ఎదుట దాచిపెట్టారని, దీనిని ధర్మాసనం తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. 'రాజకీయ కోణాన్ని కోర్టు గుర్తించింది ఇక్కడే.. ఏ ఉద్దేశంతో తన తలుపు తట్టారో ధర్మాసనం గుర్తించింది. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌లో ఉన్నవారు మంచి రెప్యుటేషన్ ఉన్న అధికారులేనని సుప్రీం స్పష్టం చేసింది. అయినా కూడా కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టినట్లు, వేలెత్తి చూపినట్లు జగన్ కంఠశోష పెట్టారు. తీర్పు కాపీని ఆయనకు పంపిస్తున్నాం. చదువుకోండి. మొట్టికాయలు ఎవరికి పడ్డాయో, సీబీఐ విచారణో, సిట్ విచారణో అర్థమవుతుంది' అని వ్యాఖ్యానించారు. సుప్రీం ఏర్పాటుచేసిన సిట్‌కు తాము సంపూర్ణంగా సహకరిస్తామని స్పష్టం చేశారు. కూటమి అంతర్గత సమావేశంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యపై ప్రజాస్పందన తీవ్రంగా వచ్చిందన్నారు. దానికి జగన్ భయపడిపోయారని చెప్పారు. 'టీటీడీలో ప్రక్షాళన జరగాలని కోరుకుంటున్నదే మేము. జగన్ ఆదేశాలతో ఎవరైతే టీటీడీని అగౌరవపరిచారో వారంతా దోషులుగా నిలబడేరోజు దగ్గర్లోనే ఉంది. సిట్, తన కార్యక్రమాలను త్వరలోనే ప్రారంభిస్తుందని ఆశిస్తున్నాం.' అని పయ్యావుల విమర్శించారు.


తిరుమల లడ్డూ కల్తీపై స్వతంత్ర సిట్

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షిస్తారని తెలిపింది. తమ ఆదేశాలను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ సభ్యుల విశ్వసనీయతను శంకిస్తున్నట్లుగా భావించరాదని స్పష్టంచేసింది. వారందరికీ మంచి ప్రతిష్ఠ ఉందని.. వారు దర్యాప్తును కొనసాగిస్తే అభ్యంతరం చెప్పాల్సింది ఏమీ లేదని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పిన విషయాన్ని తన ఆదేశాల్లో ప్రస్తావించింది. అయితే అదే సమయంలో దర్యాప్తును పర్యవేక్షించేందుకు సిట్ అధికారుల కంటే సీనియర్ అయిన ఒక కేంద్ర ప్రభుత్వ అధికారిని నియమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను సంతృప్తిపరిచేందుకు స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని నియమిస్తున్నామని.. ఈ దర్యాప్తు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో జరగడం సముచితమని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. నెయ్యి కల్తీ ఆరోపణలు, ప్రత్యారోపణల్లో వాస్తవాల జోలికి తాము వెళ్లడం లేదని తెలిపింది. సుప్రీంకోర్టును రాజకీయ పోరాటానికి మైదానంగా ఉపయోగించుకోవడాన్ని అనుమతించబోమని స్పష్టం చేసింది. ఈ అంశంపై మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యంస్వామి, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, సురేశ్ చవహంకే, విక్రమ్ సంపత్ దాఖలు చేసిన పిటిషన్లను పరిష్కరించింది. వాస్తవానికి ఈ పిటిషన్లపై గురువారమే విచారణ జరగాల్సి ఉండగా.. సొలిసిటర్ జనరల్ శుక్రవారం ఉదయం వరకు సమయం కోరారు. ధర్మాసనం అందుకు అంగీకరించి శుక్రవారం మొదటి కేసుగా విచారణ జరిపింది. ఉదయం విచారణ ప్రారంభం కాగానే మెహతా మాట్లాడుతూ.. ప్రసాదంలో వినియోగానికి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణల్లో నిజం ఉంటే.. ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టంచేశారు. తాను రికార్డులు పరిశీలించానని.. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ ప్రస్తుత సభ్యులు సమర్థులని.. స్వతంత్రంగా వ్యవహరించేవారని, వారితో దర్యాప్తు కొనసాగించవచ్చని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వ అధికారి ఈ దర్యాప్తును పర్యవేక్షిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. నెయ్యి కల్తీ జరగడం నిస్సందేహంగా అంగీకార యోగ్యం కాదన్నారు. స్వతంత్ర సిట్ ద్వారా దర్యాప్తు చేస్తే తనకు అభ్యంతరం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అన్నట్లు తాము వార్తా పత్రికల్లో చదివామని తెలిపారు. టీటీడీ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా స్పందిస్తూ.. పత్రికల కథనాలపై ఆధారపడొద్దని కోరారు. టీటీడీ కార్యనిర్వహణాధికారి (ఈవో) చేసిన ప్రకటనలను కూడా వక్రీకరించారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. తాము సిట్‌తోనే ముందుకు వెళ్లాలనుకుంటున్నామని, కోర్టు ఏ అధికారినైనా ఇందులో చేర్చవచ్చని తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ.. సీఎం చంద్రబాబు లడ్డూ కల్తీపై ప్రకటన చేయకపోతే పరిస్థితి వేరుగా ఉండేదని.. బహిరంగంగా ప్రకటన చేశారని.. ఇది ప్రస్తుత సిట్ విచారణపై ప్రభావం చూపుతుందని, స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని నియమించడమే సరైందని అన్నారు.

ల్యాబ్ నివేదిక ఆధారంగానే సీఎం మాట్లాడారు..

నెయ్యి కల్తీకి సంబంధించి జూలైలోనే నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) నుంచి ల్యాబ్ రిపోర్టు వచ్చిందని, దాని ఆధారంగా సెప్టెంబరులో తన వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటన చేశారని రోహత్గీ కోర్టు దృష్టికి తెచ్చారు. సిట్ దర్యాప్తునకు, దానికీ సంబంధం లేదన్నారు. ముఖ్యమంత్రి చివర్లో అన్న నాలుగు వాక్యాలను మీడియా విస్తృత ప్రచారం చేసిందని తెలిపారు. నెయ్యి తయారీలో పంది కొవ్వు ఉపయోగించారనడానికి పూర్తి ఆధారాలున్నాయని చెప్పారు. పందికొవ్వు వాడారని సీఎంకెలా తెలుసని సిబల్ ప్రశ్నించారు. ల్యాబ్ నివేదికలో ఉందని రోహత్గీ తెలిపారు. అయితే శాకాహార కొవ్వు ఉన్నట్లు అందులో ఉందని సిబల్ అన్నారు. సీఎం చంద్రబాబు గతంలో చేసిన ప్రకటనల దృష్ట్యా రాష్ట్ర సిట్ స్వతంత్రంగా దర్యాప్తు చేయజాలదని.. స్వతంత్ర విచారణ అవసరమని నొక్కిచెప్పారు. జూలై 6, 12 తేదీల్లో రెండు సార్లు ట్యాంకర్లు వచ్చాయని, వాటిని ఉపయోగించలేదని టీటీడీ ఈవో అధికారికంగా చెప్పారు కదా అని జస్టిస్ విశ్వనాథన్ ప్రస్తావించగా.. వాటిలో కలుషిత నెయ్యి ఉందని లూథ్రా తెలిపారు. కలుషితమైన వాటిని కొండపైకి ఎలా రానిచ్చారని సిబల్ ప్రశ్నించారు. అవి గత ప్రభుత్వ హయాంలో డిసెంబరులో ఇచ్చిన కాంట్రాక్టు ప్రకారం వచ్చాయని లూథ్రా తిప్పికొట్టారు. అలాగే తొలి సరఫరాదారు నుంచి తిరుమలకు సరుకు రాలేదని తమకు సర్వీసు విభాగం నుంచి సమాచారం అందిందని తెలిపారు. లడ్డూ వ్యవహారంపై తాము అమికస్ క్యూరీ(కోర్టు సహాయకారి)ని కూడా నియమించవచ్చని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. తాము చెప్పిన వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామని రోహత్గీ తెలిపారు. జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. ఆరోపణలు చాలా తీవ్రమైనవనడంలో సందేహం లేదన్నారు. సిట్‌కు ప్రత్యామ్నాయంగా స్వతంత్ర సిట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందులో సీబీఐ, రాష్ట్ర పోలీసు శాఖ చెరో ఇద్దరిని నామినేట్ చేయాలని.. ఎఫ్ఎస్ఎస్ఏఐ సీనియర్ అధికారి మరో సభ్యుడిగా ఉండాలని అన్నారు. దీనికి అభ్యంతరం లేదని రోహత్గీ చెప్పారు.



- నెయ్యి కల్తీ ఆరోపణలు తీవ్రమైనవనడంలో సందేహం లేదు. అయితే ఈ వ్యవహారం రాజకీయ డ్రామాగా మారేందుకు అంగీకరించం. ప్రజల్లో విశ్వాసం కలిగించేందుకు రాష్ట్రప్రభుత్వం నియమించిన సిట్‌కు ప్రత్యామ్నాయంగా స్వతంత్ర సిట్ ఏర్పాటు చేస్తాం.
- కోట్లాది భక్తులకు ఊరట కలిగించేందుకు సీబీఐ, రాష్ట్ర పోలీసులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతినిధులతో కూడిన స్వతంత్ర సిట్ దర్యాప్తు జరపాలని భావిస్తున్నాం. ఇది కూడా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సాగాలి.

- సుప్రీంకోర్టు

తీర్పులో ఏమున్నదంటే..

'జూలై 6న సరఫరా చేసిన రెండు ట్యాంకర్లు, జూలై 12న పంపిన మరో 2 ట్యాంకర్లలో నెయ్యి కలుషితమైందంటూ ఎఫ్ఐఆర్ దాఖలైంది. తిరుమల లడ్డూ తయారీలో కలుషిత నెయ్యిని వినియోగించారని ఆరోపించారు. గత విచారణ సందర్భంగా.. రాష్ట్రప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తును కొనసాగించాలో, స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయిస్తారో కేంద్రం నుంచి ఆదేశాలు తీసుకోవాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరాం. సిట్ సభ్యుల విశ్వసనీయతకు సంబంధించి రికార్డులను తాను పరిశీలించానని.. అందులోని సభ్యులు మంచి ప్రతిష్ఠ కలిగినవారని ఆయన నివేదించారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ దర్యాప్తు కొనసాగించవచ్చని అన్నారు. అయితే ఈ సిట్ దర్యాప్తును పర్యవేక్షించేందుకు కోర్టు కేంద్రప్రభుత్వ అధికారిని నియమించవచ్చన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల జోలికి మేం వెళ్లడం లేదు. కోర్టును రాజకీయ రణభూమిగా ఉపయోగించుకోవడానికి సమ్మతించం. అయితే సీబీఐ, రాష్ట్రపోలీసులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతినిధులతో కూడిన స్వతంత్ర సిట్‌తో దర్యాప్తు జరపాలని మేం భావిస్తున్నాం. ఈ దర్యాప్తు కూడా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సాగడం సముచితం. మా ఆదేశాలు ప్రస్తుత సిట్ సభ్యుల స్వతంత్రత, నిష్పాక్షికతను శంకించేవిగా భావించరాదని స్పష్టం చేస్తున్నాం. కోట్లమంది భక్తుల మనోభావాలను ఉపశమింపజేసి.. విశ్వాసం పాదుకొల్పడానికే ఈ ఆదేశాలిస్తున్నాం' అని ధర్మాసనం తన ఆదేశాల్లో స్పష్టంచేసింది.

సిట్టూ అవసరంలేదు.. బిట్టూ అవసరంలేదు

- లడ్డూ అపవిత్రం అయిందనేది అబద్ధం
- సనాతన ధర్మంపై పవన్‌కు ఏం తెలుసు?: జగన్



అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): "తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రం అయిందనేది అబద్ధం. ఈ విషయం చెప్పడానికి సిట్టూ అవసరం లేదు.. బిట్టూ అవసరం లేదు" అని మాజీ సీఎం జగన్ వ్యాఖ్యానించారు. లడ్డూ కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు సీబీఐ పర్యవేక్షణలో సిట్ వేయడంపై ఆయన ఇలా స్పందించారు. శుక్రవారం తాడేపల్లి నివాసంలో జగన్ మీడియాతో మాట్లాడారు. "చంద్రబాబును సుప్రీంకోర్టు ఆక్షేపించింది. ఆయన వేసిన సిట్‌ను రద్దు చేసింది. లడ్డూ వ్యవహారంలో అసలేం జరగలేదని కంటికి క్లియర్‌గా కనిపిస్తోంది. అయినా, ఏదో జరిగిందని వీళ్లందరూ ఏదో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఏమీ జరగలేదని మేం చెబుతున్నాం. దానికి ఆధారాలూ చూపిస్తున్నాం. అయినా, ఎవరైనా వచ్చి(సీబీఐ సిట్) కొత్తగా ఇంకా ఏమి చేస్తారు?" అని జగన్ ప్రశ్నించారు. రాజకీయ స్వార్థం కోసం వీళ్ల(సిట్ అధికారులు) ఒక తప్పుడు రిపోర్టు తయారుచేసి, ప్రచారంలో పెడితే వెంకటేశ్వర స్వామికి కోపం వస్తుందన్నారు. "స్వామికి కోపం వస్తే మామూలుగా ఉండదు. అయితే, ఆయన తన కోపాన్ని చంద్రబాబు, కూటమి నేతలు, ఆయనను సమర్థిస్తూ మాట్లాడేవారిపైనా, అబద్ధాలను రెక్కలు కట్టుకుని ప్రచారం చేస్తున్నవారిపైనా మాత్రమే చూపాలి" అని పేర్కొన్నారు.

పవన్‌కు ఏం తెలుసు?

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సనాతన ధర్మమంటే తెలుసా అని జగన్ ప్రశ్నించారు. కోట్ల మంది భక్తుల్లో అనుమానాలు రేకెత్తించడంలోను, స్వామి పవిత్రతను తగ్గించడంలోను పవన్ భాగమయ్యారని ఆరోపించారు.



మాజీ సీఎం అయినా శిక్ష పడాల్సిందే!

తిరుమల లడ్డూ కల్తీపై విచారణలో జగన్ దొరికిపోవడం ఖాయం: అశోక్ గజపతిరాజు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది భక్తుల విశ్వాసం, పవిత్రతకు సంబంధించిన తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. సిట్ దర్యాప్తులో దొరికిపోవడం ఖాయమన్నారు. కల్తీ నెయ్యి విషయంలో తప్పుచేసింది మాజీ సీఎం అయినా, మాజీ ఎమ్మెల్యే అయినా శిక్షపడాలని స్పష్టం చేశారు. శుక్రవారమిక్కడ టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఏవిటో తెలియకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని, సిట్‌ను కోర్టు రద్దు చేసిందని ఆయన చెబుతున్న మాటల్లో వాస్తవం లేదన్నారు. పైగా కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ పరిధిని విస్తరించి బలోపేతం చేసిందని చెప్పారు. లడ్డూ కల్తీపై విచారణ త్వరితగతిన పూర్తిచేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ హయాంలో టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చి భక్తులకు స్వామిని దూరం చేశారని దుయ్యబట్టారు. టీటీడీలో అన్యమతస్థుల నియామకం, బస్సు టికెట్లపై అన్యమత ప్రచారం, కొండపై అన్యమత బోధనలు, వసతి అద్దె పెంపు వంటి కార్యక్రమాలతో తిరుమల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. కల్తీ నెయ్యిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడకముందే జూలైలో సరఫరాదారులకు టీటీడీ షోకాజ్ ఇచ్చిందని గుర్తుచేశారు. కల్తీ నెయ్యి అంశాన్ని దాచిపెట్టకూడదనే ఉద్దేశంతో.. ఇది ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులకు సంబంధించిన అంశం కాబట్టి రెండు నెలల తర్వాత ఆయన మాట్లాడారని తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారికి సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించాల్సి ఉన్నా సీఎం హోదాలో జగన్మోహన్‌రెడ్డి ఒక్కరే వెళ్లారని.. ఇది హిందూ సంప్రదాయాలను కాలరాయడం కాదా అని ప్రశ్నించారు. తిరుమలతోపాటు అనేక దేవాలయాల్లో ప్రసాదాల నాణ్యత తగ్గిపోయిందన్నారు. దేవాలయాల ట్రస్టీల నియామకంలో గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరించిందని, అనర్హులకు అవకాశం ఇచ్చిందని ఆరోపించారు. భక్తుల విశ్వాసం, నమ్మకంపైనే దేవాలయాలు నడిచేవని, ఇప్పుడా విలువలు పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. దేవాలయాలను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నారు. ఇంట్లో ఒక మతం, బయట మరో మతం ఉండకూడదన్నారు. జగన్ జోకర్‌గా తయారయ్యారని, దొంగలు నీతిని బోధిస్తుంటే తమవంటి వారికి కష్టంగా ఉందన్నారు. రామతీర్థంలో రాముడి తల తీసిన దోషులను ఆయన పట్టుకోలేకపోయారని, ఆయన హయాంలో 200 దేవాలయాల్లో ఘటనలు జరిగితే దోషులపై చర్యలు లేవని దుయ్యబట్టారు. సింహాచలం దేవస్థానానికి తమతోపాటు అనేక మంది భూములు విరాళంగా ఇచ్చారని తెలిపారు. దేవస్థానం భూముల్లో కొంత మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, ఈ నేపథ్యంలో కొనసాగుతున్న వివాదాలను అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా పరిష్కరించాలని సూచించారు.



గరుడ ధ్వజపటాన్ని ఎగురవేసి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకుర్పారణ చేస్తున్న అర్చకులు

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం

- ధ్వజారోహణంతో నాంది పలికిన అర్చకులు
- తొలిరోజు పెద్దశేష వాహనంపై మలయప్ప విహారం
- స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- 2025 టీటీడీ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన చంద్రబాబు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నేడు...

ఉదయం	: 8- 10 గంటల మధ్య చిన్నశేష వాహనం
మధ్యాహ్నం	: 1- 3 గంటల మధ్య స్నపన తిరుమంజనం
రాత్రి	: 7- 9 గంటల వరకు హంస వాహనం



సీఎం చంద్రబాబు దంపతులకు శ్రీవారి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ ఈవో, అదనపు ఈవో

తిరుమల, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలకు వైభవంగా నాంది పలికారు. తొలిరోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి పెద్దశేష వాహనంలో నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అంతకుముందు ఆలయంలో నిత్యపూజాదికాల అనంతరం ప్రధాన అర్చకులు వరుసగా శ్రీదేవి, భూదేవి, మలయప్ప, ఇతర దేవతలు, కంకణ భట్టాచార్యులైన గోవిందాచార్యులు, టీటీడీ ఈవో శ్యామలరావుకు కంకణ ధారణ చేశారు. మధ్యాహ్నం 3గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని బంగారు తిరుచ్చిలో మాడవీధుల్లో ఊరేగించారు. ధ్వజపటాన్ని కూడా ఊరేగిస్తూ బ్రహ్మోత్సవాలకు దేవతలందరికీ ఆహ్వానం పలికారు. సాయంత్రం 5.45- 6గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

తిరుమలలో గోవింద నామస్మరణే ప్రతిధ్వనించాలి

పవిత్రమైన తిరుమలలో గోవింద నామస్మరణ మాత్రమే ప్రతిధ్వనించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం ఆయన ఆలయంలోని రంగనాయక మండపంలో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు దాదాపు 15లక్షల మంది భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఇక్కడికి వచ్చేవారితో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు కూడా వాహన సేవలు వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అందరికంటే ఎక్కువసార్లు బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ లాంఛనాలు సమర్పించే అవకాశం లభించినందుకు గర్వపడుతున్నానన్నారు. అందరూ తిరుమల పవిత్రతను కాపాడాలని చంద్రబాబు కోరారు.

విరిగిన ధ్వజస్తంభం కొక్కీ

ధ్వజారోహణానికి కొన్ని గంటల ముందు శుక్రవారం మధ్యాహ్నం ధ్వజస్తంభం పైభాగంలోని కొక్కీ విరగడం అధికారులను, అర్చకులను కలవరపాటుకు గురిచేసింది. వెంటనే ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో అర్చకులే ధ్వజస్తంభం పైభాగానికి చేరుకుని విరిగిన కొక్కీని తొలగించి కొత్తది ఏర్పాటు చేసి ధ్వజారోహణ కార్యక్రమానికి సిద్ధం చేశారు.



పెద్దశేష వాహనంపై తిరుమల మాడ వీధుల్లో విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

ఎలాంటి అపచారం జరగలేదు: టీటీడీ

ధ్వజస్తంభంపై కొక్కీ విరిగిపోవడంతో తిరుమలలో అపశ్రుతి, అపచారం అంటూ సాగిన ప్రచారంపై టీటీడీ స్పందించింది. 'ధ్వజస్తంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురవేసే కొక్కీ విరగడం అపచారమని కొన్ని ప్రసార.. సామాజిక మాధ్యమాల్లో వదంతులు వస్తున్నాయి. భక్తులు వీటిని నమ్మొద్దు. సాధారణంగా బ్రహ్మోత్సవాల ముందే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడం.. ఏవైనా భిన్నమైన (దెబ్బతిన్న) వస్తువులు ఉంటే వాటిని మార్చి కొత్తవి అమర్చడం సంప్రదాయం. అందులో భాగంగానే ఈ కొక్కీని అర్చకులు తొలగించి, కొత్తదాన్ని ఏర్పాటు చేశారు. అంతలో అపచారం జరిగినట్టుగా కొన్ని మాధ్యమాలు ప్రసారం చేయడం దురదృష్టకరం' అంటూ టీటీడీ ఓ ప్రకటనలో వివరణ ఇచ్చింది.

పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు దంపతులు శ్రీ వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహానికి సాయంత్రం చేరుకున్న ముఖ్యమంత్రి.. కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత సంప్రదాయ వస్త్రధారణతో సతీమణి నారా భువనేశ్వరితో కలిసి బేడీఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు సీఎం తలకు పరివట్టం చుట్టి, శేషవస్త్రాన్ని మెడలో ధరింపజేశారు. అనంతరం నూతన పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని భాజాభజంత్రీలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మూలవర్లను దర్శించుకుని రంగనాయకుల మండపం చేరుకోగా వేదపండితులు ఆశీర్వాదం పలికారు. ఈ సందర్భంగా టీటీడీ ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన వాహన మండపానికి చేరుకుని రాత్రి 9గంటలకు పెద్దశేష వాహనంలో పాల్గొని, ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాయత్రీ దేవిగా దుర్గమ్మ

విజయవాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా అలంకరిస్తారు.



బ్రహ్మచారిణిగా శ్రీశైల భ్రామరి

శ్రీశైలం, అక్టోబరు 4: శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం భ్రమరాంబికా అమ్మవారు కుడిచేతిలో జపమాల, ఎడమచేతిలో కమండలాన్ని ధరించి బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం వాహన సేవల్లో భాగంగా మయూర వాహనంపై మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి మాఢవీధుల్లో విహరించారు. శనివారం భ్రమరాంబిక అమ్మవారు చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు రావణ వాహన సేవ నిర్వహిస్తారు.

నందిగం సురేశ్‌కు బెయిల్

- పలు షరతులు విధించిన హైకోర్టు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి కేసులో నిందితుడు వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.15 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. కేసు దర్యాప్తు పూర్తిచేసి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి నెల 1, 15 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని తేల్చి చెప్పింది. ఇలాంటి నేరాలను తిరిగి పునరావృతం చేయడం కానీ, ఇదే తరహా ఘటనల్లో పాల్గొనడం కానీ చేయవద్దని స్పష్టం చేసింది. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సాక్షులను బెదిరించడానికి, ప్రలోభ పెట్టడానికి వీల్లేదని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఇదే కేసులో మరో నిందితుడు, విజయవాడ డిప్యూటీ మేయర్ అవుతు శైలజ భర్త అవుతు శ్రీనివాసరెడ్డికి కూడా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. శ్రీనివాసరెడ్డికి కూడా ఇవే షరతులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన మూకదాడి కేసులో గుంటూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నందిగం సురేశ్, అవుతు శ్రీనివాసరెడ్డి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై ఇటీవల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి శుక్రవారం నిర్ణయం వెల్లడించారు.

వెంకాయమ్మ వ్యాజ్యంపై వివరాలివ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తాను సూచించిన విధంగా జడ్పీసీఈవో, డిప్యూటీ సీఈవోలను బదిలీ చేయడం లేదని పేర్కొంటూ ఒంగోలు జిల్లా ప్రజాపరిషత్(జడ్‌పీపీ) చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు ఆయా వివరాలను తమకు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్, ప్రకాశంజిల్లా కలెక్టర్, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో, డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లకు నోటీసులు జారీ చేసింది. వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ఉన్న జడ్పీ సీఈవో మాధురి, డిప్యూటీ సీఈవో హనుమంతరావులకు కూడా నోటీసులు ఇచ్చింది. విచారణను దసరా సెలవుల తరువాతకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ హోదాలో పరిపాలన అధికారులు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీసు సబార్డినేట్ల బదిలీలకు సంబంధించి తాను ఇచ్చిన జాబితాను అమలు చేసేలా ఒంగోలు జడ్పీపీ సీఈవో, డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిని ఆదేశించాలని కోరుతూ బూచేపల్లి వెంకాయమ్మ హైకోర్టును అభ్యర్థించారు.

ఏఆర్ డెయిరీ ఎండీ కేసు వాయిదా

- ముందస్తు బెయిల్ పిటిషన్‌పై 17న విచారణ

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి నెయ్యి సరఫరా చేసిన తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. రాజశేఖరన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఆరోపణలతో టీటీడీ మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సెప్టెంబరు 25న తిరుపతి ఈస్ట్ పోలీసులు రాజశేఖరన్‌పై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన పిటిషన్ వేశారు. ఇది శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని కోరారు. అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు.

దర్యాప్తునకు సహకరించండి

- సజ్జలకు న్యాయమూర్తి ఆదేశం
- పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు వద్దని స్పష్టీకరణ
- టీడీపీ ఆఫీస్‌పై మూకదాడి కేసులో హైకోర్టు ఉత్తర్వులు
- ఘటన జరిగినప్పుడు సజ్జల 600 కి.మీ. దూరంలో ఉన్నారు
- రామకృష్ణారెడ్డి తరఫున వాదనలు
- కాదు.. తాడేపల్లిలోనే ఉన్నారు: ప్రాసిక్యూషన్



అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి వ్యవహారంలో నమోదైన కేసు దర్యాప్తునకు సహకరించాలని వైసీపీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. ఘటన జరిగిన రోజు పిటిషనర్ తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో ఉన్నారని సహ నిందితులు వాంగ్మూలం ఇచ్చినట్లు ప్రాసిక్యూషన్ చెబుతోందని కోర్టు గుర్తు చేసింది. అదే రోజు ఘటన జరిగిన ప్రదేశానికి పిటిషనర్ 600 కిలోమీటర్ల దూరంలో ఉన్నారని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది పత్రికల్లో వచ్చిన వార్తలను కోర్టు దృష్టికి తీసుకొచ్చారని పేర్కొంది. ఈ నేపథ్యంలో సహనిందితులు ఇచ్చిన వాంగ్మూలాలను మరోసారి పరిశీలించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరుతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 25కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటివరకు సజ్జల రామకృష్ణారెడ్డిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

సజ్జలను అరెస్టు చేయాలనే!

టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి వ్యవహారంలో మంగళగిరి పోలీసులు సజ్జలపై కేసు నమోదు చేశారు. అయితే.. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. పోలీసులు మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సజ్జల పేరు లేదని, సహనిందితుల వాంగ్మూలం ఆధారంగా పోలీసులు ఈ కేసులో ఆయనను 120వ నిందితుడిగా చేర్చారని తెలిపారు. సహ నిందితుల వాంగ్మూలం ఆధారంగా నిందితులను చేర్చడానికి వీల్లేదని సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందన్నారు. ఘటన జరిగిన రోజు పిటిషనర్ 600 కిలోమీటర్ల దూరంలో ఉన్నారని పేర్కొన్నారు. పోరుమామిళ్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని తెలిపారు. దీనికి సంబంధించి పత్రికలలో ప్రచురించిన, టీవీలలో ప్రసారం చేసిన క్లిపింగ్స్‌ను కోర్టు ముందు ఉంచినట్లు తెలిపారు. కోర్టుకు పండగ సెలవులు ఇస్తున్న సమయాన్ని చూసి పిటిషనర్‌ను కేసులో నిందితుడిగా చేర్చారన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేసేందుకే పోలీసులు ఈ సమయాన్ని ఎంచుకున్నారని అన్నారు. వ్యాజ్యంపై విచారణ ముగిసేవరకు సజ్జలపై తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు.

దాడి వెనుక ఆయనే

ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. సజ్జల రామకృష్ణారెడ్డి ప్రోద్బలంతోనే టీడీపీ కార్యాలయంపై దాడి చేసినట్లు సహనిందితులు వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. నిందితుడు షేక్ సైదా.. దేవినేని అవినాశ్ అనుచరుడని వివరించారు. దాడి ఘటన జరిగిన రోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో రామకృష్ణారెడ్డిని వైసీపీ కార్యాలయంలో చూసినట్లు షేక్ సైదా, ఇతర నిందితులు వాంగ్మూలం ఇచ్చారన్నారు. దాడి ఘటనలో పిటిషనర్‌కు ప్రమేయం ఉందనేందుకు అన్ని ఆధారాలూ ఉన్నాయని తెలిపారు. పోలీసులు మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారని, దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందన్నారు. ముందస్తు బెయిల్ పొందేందుకు సరైన కారణాలు, వివరాలను సజ్జల తన పిటిషన్‌లో పేర్కొనలేదన్నారు. ఈ తరహా పిటిషన్‌ను ఆమోదించడానికి వీల్లేదన్నారు.

విండ్ పవర్ కార్యాలయంపై దాడి కేసు..

- ఎమ్మెల్యే అనుచరులకు 14 రోజుల రిమాండ్

ఆదోని, అక్టోబరు 4: కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని రెన్యూ విండ్ పవర్, గ్రీన్ ఇన్‌ఫ్రా కార్యాలయాలపై దాడుల కేసులో స్థానిక వైసీపీ ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి సోదరుడు, పలువురు వైసీపీ నేతల సహా 24 మందికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ మేరకు ఆదోని సెకండ్ క్లాస్ అడిషనల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శ్రీవల్లి ఆదేశాల మేరకు పోలీసులు నిందితులను ఆదోనీ సబ్‌జైలుకు తరలించారు. గురువారం ఆలూరు నియోజకవర్గంలో వేర్వేరు మండల్లాలోని ఆలూరు, మొలగవల్లి, జోహరపురం, జిల్లేల బుడకల గ్రామాల్లో రెన్యూ విండ్ పవర్, గ్రీన్ ఇన్‌ఫ్రా ఆఫీసులపై ఎమ్మెల్యే విరుపాక్షి తమ్ముడు వెంకటేశ్‌తో పాటు వారి అనుచరులు దాడులు చేసి, విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే సోదరుడు వెంకటేశ్, దేవనకొండ జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణతోపాటు మరో 22 మందిపై ఆలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డీఎస్పీ వెంకటరామయ్య నిందితులను అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి ఆదోని కోర్టుకు ప్రత్యేక వాహనంలో తరలించారు.



ఆలూరు ఎమ్మెల్యే అనుచరులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు



బంగారు రేకుల తాపడంతో మెరుస్తున్న చిన వెంకన్న గర్భాలయం

చినవెంకన్న గర్భాలయానికి పసిడి కాంతులు

- రూ.1.64 కోట్ల వ్యయంతో బంగారు రేకుల తాపడం

ద్వారకాతిరుమల, అక్టోబరు 4: ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల వేంటేశ్వర స్వామి గర్భాలయం పసిడి కాంతులతో శోభిల్లుతోంది. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.1.64 కోట్ల ఖర్చుతో శ్రీవారి గర్భగుడిని బంగారు రేకులతో శిల్పకళ ఉట్టిపడేలా తాపడం చేయించింది. ఈ పనులు శుక్రవారం పూర్తవడంతో ఆలయ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు పరిశీలించారు. బంగారు తాపడాన్ని స్వామివారికి అందజేస్తున్న పత్రాలను కంపెనీ ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం చైర్మన్‌కు అందించారు.

16 నుంచి మాన్యువల్ ఇసుక రీచ్‌లు

- 18 జిల్లాల పరిధిలో అందుబాటులోకి.. ఇప్పటికే పర్యావరణ అనుమతులు

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇసుక లభ్యతను పెంచేందుకు ప్రభుత్వం ఈ నెల 16 నుంచి మాన్యువల్ రీచ్‌లను ప్రారంభించనుంది. ఇప్పటికే పర్యావరణ అనుమతులు రావడంతో 18 జిల్లాల పరిధిలో మాన్యువల్ రీచ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గనుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. వర్షాలు కూడా తగ్గుముఖం పట్టడంతో పలు నదుల్లోని ఇసుకను డీసిల్టేషన్ పద్ధతిలో బయటకు తీయనున్నారు. ఇదిలా ఉంటే, ఇసుక కొరత నెలకొందన్న ప్రచారం నేపథ్యంలో వాస్తవిక పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలనుకుంటోంది. గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం ఇక్కడి ఏపీఎండీసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాల గనుల శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇసుక కొరత లేదని, అక్రమ రవాణా, అమ్మకంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు దాతల విరాళాలు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీలక్ష్మీ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజింగ్ పార్టనర్ డీవీ రాయుడు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబును ఆయన కలసి చెక్కు అందజేశారు. అలాగే మంత్రి నారా లోకేశ్‌ను పలువురు దాతలు కలసి, విరాళాల చెక్కులు అందించారు. గుంటూరుకు చెందిన కార్లపూడి వెంకటేశ్వరరావు శ్రీకృష్ణవేణి చిల్లీస్ తరఫున రూ.8.50 లక్షలు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్, వివిధ విద్యాసంస్థల నిర్వాహకులు కలిసి రూ.6,37,700, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో పి.ఈశ్వర్‌కుమార్ రూ.5 లక్షలు, కె.కళ్యాణ్‌బాబు రూ.3 లక్షలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన యడ్లపల్లి సుస్మిత రూ.1,11,111, డల్లాస్‌కు చెందిన కనికంటి సింధూర రూ.లక్ష, హైదరాబాద్‌కు చెందిన గంగిశెట్టి అభినయ్ రూ.లక్ష, ఆదోనికి చెందిన ఆర్య చంద్ర శ్రీకాంత్‌రెడ్డి రూ.లక్ష అందజేశారు. దాతలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అభినందించారు.

14 నుంచి బాయ్‌కాట్ స్విగ్గీ

- రాష్ట్రవ్యాప్తంగా అమ్మకాలు నిలిపివేత: ఏపీ హోటల్స్ అసోసియేషన్



స్విగ్గీని బాయ్‌కాట్ చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి, సంఘం సభ్యులు

విజయవాడ, అక్టోబరు 4: రాష్ట్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఈ నెల 14 నుంచి స్విగ్గీని బాయ్‌కాట్ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి తెలిపారు. విజయవాడలోని సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్విగ్గీ, జొమాటోల వల్ల హోటల్స్ రెస్టారెంట్లకు నష్టం జరుగుతోందని చెప్పారు. అవి హోటల్ యాజమాన్యాలను సంప్రదించకుండానే ఆఫర్లు పెడుతున్నారని, దీని వల్ల చిన్నచిన్న రెస్టారెంట్లకు నష్టం వాటిల్లుతోందని అన్నారు. స్విగ్గీలో రెస్టారెంట్ కనిపించాలంటే నగదు చెల్లించాలని చెప్పి అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయని, రెస్టారెంట్ల మధ్య పోటీ పెడుతున్నాయని ఆరోపించారు. కస్టమర్లకు డిస్కౌంట్లు ఇవ్వడంతో ఆ భారం హోటల్ యాజమాన్యాల మీద పడుతోందని వాపోయారు. కస్టమర్ కట్టే జీఎస్టీలోనూ కమీషన్ వసూలు చేస్తున్నాయని సంఘం కన్వీనర్ రమణారావు చెప్పారు. తమ సమస్యలపై జొమాటో సహకరించినప్పటికీ.. స్విగ్గీ మాత్రం సహకరించడం లేదన్నారు. అందుకే స్విగ్గీని బాయ్‌కాట్ చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

223 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు, మరో ముగ్గురు పరారీ

సీలేరు, అక్టోబరు 4: ఒడిశా నుంచి మహారాష్ట్ర తరలిస్తున్న 223 కిలోల గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ముగ్గురు పట్టుబడగా, మరో ముగ్గురు పరారయ్యారు. సీలేరు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్ పప్పులూరు పంచాయతీ కప్పతొట్టి నుంచి సీలేరు మీదుగా గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో గుంటవాడ జలాశయం వద్ద మాటు వేశారు. శుక్రవారం సాయంత్రం ఒడిశా నుంచి సీలేరు వైపు వస్తున్న ఆటో డ్రైవర్ పోలీసులను చూసి కొంత దూరంలోనే ఆపి పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు ఆటోలో ఉన్న ముగ్గురిని పట్టుకోగా, మరో ముగ్గురు తప్పించుకున్నారు. పరారైన ముగ్గురితో పాటు గంజాయి అడిగిన మరో ఇద్దరినీ అదుపులోకి తీసుకోవాల్సి ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు.

అమరావతిలో 9 రిజిస్ట్రేషన్ కేంద్రాల ఏర్పాటు

- రైతులకిచ్చే స్థలాలకు మాత్రమే రిజిస్ట్రేషన్లు

మంగళగిరి, అక్టోబరు 4: రాజధాని అమరావతి పరిధిలోని మూడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుసంధానంగా 9 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా ఆదేశాలు జారీ చేశారు. అమరావతి రైతులకు సీఆర్డీఏ తిరిగి ఇచ్చే స్థలాల రిజిస్ట్రేషన్లు మాత్రమే ఇక్కడ జరుగుతాయని వెల్లడించారు.

రైల్వేజోన్‌పై వాడీవేడిగా!

- దక్షిణ మధ్య రైల్వే జీఎంతో ఎంపీల భేటీ
- కార్యాచరణలోకి రాలేదని నిలదీత
- మీడియాతో మాత్రం జోన్‌పై మౌనం
- రైల్వే ప్రాజెక్టులు, సమస్యల ప్రస్తావన
- బోర్డు దృష్టికి తీసుకెళ్తామన్న అధికారులు
- కడప-బెంగళూరు రైల్వే లైన్‌కు మళ్లీ రీ సర్వే
- 2200 కోట్లతో అమరావతి నూతన రైల్వే లైన్
- ఏపీకి మరో 1000 కిలోమీటర్ల మేర కవచ్
- కోటిపల్లి- నర్సాపూర్ ప్రాజెక్టుకు అడుగులు: జీఎం

విశాఖ రైల్వే జోన్ కోసం ఏపీ ఎంపీలు గట్టి పట్టు పట్టారు. రైల్వే ఉన్నతాధికారులు మళ్లీ భూములు, భవనాల చుట్టూ కథ అల్లితే కుదరదని తేల్చేశారు. రైల్వే జోన్‌పై కేంద్రం ఇచ్చిన హామీని అమలు చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. దీనిపై మీడియా వద్ద నోరు విప్పకపోయినా, బెజవాడలో దక్షిణ మధ్య రైల్వే జీఎంతో జరిగిన సమావేశం వాడీవేడిగా సాగినట్టు తెలిసింది. ఇప్పటికే పదేళ్లు దాటేశారని, ఇక ఎప్పుడు చర్యలు తీసుకుంటారంటూ రైల్వే ఉన్నతాధికారులపై విరుచుకుపడ్డారు. ఎంపీల అభ్యర్థనలను రైల్వే బోర్డు దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చి.. సమావేశాన్ని అధికారులు ముగించినట్టు సమాచారం.



విజయవాడలో ఏపీ పార్లమెంట్ సభ్యులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్, డీఆర్‌ఎం నరేంద్రపాటిల్

విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే జోన్ అంశంపై దక్షిణ మధ్య రైల్వే జీఎంతో పార్లమెంట్ సభ్యుల సమావేశం వాడీవేడిగా జరిగింది. రైల్వే జోన్‌పై ప్రకటన చేసి పదేళ్లు దాటిన నేపథ్యంలో ఏర్పాటుకు ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ఏపీ ఎంపీలు ప్రశ్నించారు. రైల్వే ఉన్నతాధికారులు మళ్లీ భూములు, భవనాల చుట్టూ కథ అల్లారు. రైల్వే జోన్ ఏర్పాటుకు భూములు, భవనాలతో ముడిపెట్టవద్దని, కేంద్రం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంపీలు గట్టిగా కోరారు. శుక్రవారం విజయవాడలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ నేతృత్వంలో ఏపీ పార్లమెంట్ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మొత్తం 31 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు ఆహ్వానం పంపగా, 16 మంది ఎంపీలు హాజరయ్యారు. మెజారిటీ ఎంపీలు రైల్వేజోన్ అంశంపై గట్టిగా ప్రస్తావించారు. భూములు, భవనాల సమస్య తేలే వరకు తాత్కాలికంగా అద్దె భవనాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో విశాఖ డీఆర్‌ఎం కార్యాలయంలో కొన్ని గదులు కేటాయించి రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే జోన్ ఏర్పాటు జరిగితే మిగిలినవన్నీ సమకూర్చుకోవటం పెద్ద కష్టమేమీ కాదని ఎంపీలు ముక్తకంఠంతో వాదించారు. రైల్వే జోన్ అన్నది ఏ ఒక్క ప్రాంతానికో గాక రాష్ట్రం మొత్తానికి ప్రయోజనకరమైన అంశమని అభిప్రాయపడ్డారు. ఎంపీల అభ్యర్థలను రైల్వే బోర్డు దృష్టికి తీసుకువెళతామని అధికారులు చెప్పారు. సమావేశం తర్వాత బయటకు వచ్చిన ఎంపీలు రైల్వే జోన్ అంశం గురించి నిర్దిష్టమైన హామీ రానందున మీడియాకు ఏమీ చెప్పలేకపోయారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఈ అంశంపై మీడియా ప్రశ్నించగా.. రైల్వేజోన్ అయిపోయిందిగా అని పేర్కొన్నారు. ఇంకా ఏర్పాటు చేయలేదని అడిగితే.. కారణాలను వివరించారు. రైల్వేజోన్ కార్యాలయాల కోసం గత ప్రభుత్వం భూములు ఇవ్వలేదని, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ భూములు ఇచ్చిందని, కాబట్టి రైల్వే జోన్ అంశం ముగిసిపోయిందని చెప్పుకొచ్చారు. రైల్వేజోన్ మంజూరైంది కాబట్టి ఏర్పాటు విషయంలో ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు.

ఎంపీల వినతులు

సమావేశంలో పలువురు ఎంపీలు తమ నియోజకవర్గాల పరిధిలోని సమస్యలను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైల్వే జోన్ అంశం తర్వాత కోటిపల్లి-నర్సాపూర్ రైల్వేలైన్ ప్రాజెక్టుపై తీవ్ర చర్చ జరిగింది. గత ప్రభుత్వం అవసరమైన భూములు ఇవ్వనందున సమస్య తలెత్తిందని అధికారులు చెప్పారు. రైల్వే వర్క్‌షాప్‌ను అభివృద్ధి చేయాల్సిందిగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. అమరావతి నూతన రైల్వే పనులను వేగంగా చేపట్టాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. విజయవాడలో బుడమేరు వరద కారణంగా నగరం మునిగిపోయిందని, డ్రెయిన్ల పరిష్కారం కోసం రెవెన్యూ, కార్పొరేషన్, రైల్వే అధికారులు జేఏసీగా పనిచేయాలని సూచించారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటికే మంజూరు చేసిన మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌కు అనుసంధానంగా రేపల్లె-బాపట్ల రైల్వేలైన్‌ను మంజూరు చేయాల్సిందిగా కోరారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... గుంతకల్లు డివిజన్ పరిధిలోని పెండింగ్, అపరిష్కృత రైల్వే సమస్యలను పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విజయవాడ-బెంగళూరు మధ్యన కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ప్రతి రోజూ నడపాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్టు ఆ తర్వాత మీడియాకు చెప్పారు. బెంగళూరు-పుట్టపర్తికి నడిచే ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురం వరకు పొడిగించాలని కోరామన్నారు. ఆర్ ఓబీ, ఆర్‌యూబీలను నూరు శాతం కేంద్ర ప్రభుత్వం ద్వారానే చేపట్టాల్సిందిగా రైల్వే ఉన్నతాధికారులను కోరామని రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి చెప్పారు. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డితో పాటు మరికొందరు ఎంపీలు కడప-బెంగళూరు రైల్వేలైన్ ఆగిపోయిన పనులు, నూతన అలైన్‌మెంట్ గురించి సమావేశంలో చర్చించారు. ఈ అంశంపై రైల్వే జీఎం మీడియా సమావేశంలో కూడా స్పందించారు. ఎంపీలు ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలకు సంబంధించిన ప్రతిపాదనలు, కొత్త రైళ్లు, వందేభారత్ రైళ్లను మరికొన్ని ప్రాంతాలకు పొడిగించాలని, వాటికి మరిన్ని ప్రాంతాలలో హాల్ట్ కల్పించాలని ప్రతిపాదనలు అందచేశారని చెప్పారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ... కోటిపల్లి-నర్సాపూర్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం భూములు ఇవ్వకపోవటం వల్లనే పనులు ఆగిపోయాయన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాతో పాటు భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. వందే భారత్ రైళ్లు మరిన్ని ఏపీకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్‌ను తాడేపల్లిగూడెంలో హాల్ట్ ఇవ్వాలని, చెన్నై-విజయవాడ వందేభారత్‌ను భీమవరం వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేయగా అధికారులు సానుకూలంగా స్పందించారని అన్నారు.

త్వరలో అమరావతి రైల్వే లైన్ పనులు

అమరావతి నూతన రైల్వేలైన్‌కు రూ.2,200 కోట్లతో ఆమోదం లభించినందున త్వరలో దీనికి సంబంధించి రైల్వే బోర్డు నుంచి మార్గదర్శకాలు వస్తాయని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ చెప్పారు. ఎంపీల సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు 56.5 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. కడప-బెంగళూరు రైల్వే లైన్ పనులకు సంబంధించి గత ప్రభుత్వం అలైన్‌మెంట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసిందని, దీనిపై తాజాగా రీ సర్వే చేపడుతున్నామని చెప్పారు. కోటిపల్లి- నర్సాపూర్ ప్రాజెక్టుకు సంబంధించి గత ప్రభుత్వం భూములు సమకూర్చనందునే సమస్య ఏర్పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అతి త్వరలో అడ్డంకులన్నీ తొలగుతాయని చెప్పారు. 2023-24లో దక్షిణ మధ్య రైల్వే 141 మిలియన్ టన్నుల సరకు రవాణా ద్వారా రూ.13,620 కోట్ల ఆదాయం పొందినట్టు తెలిపారు. ప్రయాణికుల రవాణా, ఇతర ఆదాయాలను కలిపితే మొత్తం రూ. 20,329 కోట్ల ఆదాయాన్ని సాధించిందని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో 90 శాతం విద్యుదీకరణ పనులు జరిగాయన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 21 వేల కోట్ల వ్యయంతో రైల్వేలైన్ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రానున్న రోజులలో 2,180 కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన వాటికి సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) పూర్తయిందని వీటి విలువ రూ. 34 వేల కోట్లు ఉంటుందని చెప్పారు. మొత్తంగా రూ.55 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ఏపీలో మొత్తం 73 రైల్వేస్టేషన్లను రీ డెవలప్‌మెంట్ చేయాలని నిర్ణయించామని చెప్పారు. అమృత్‌భారత్ పథకంలో భాగంగా అమృత్ స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. వీటిలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 56 స్టేషన్లు ఉన్నాయని, ఈ అమృత్ స్టేషన్లను రూ.2,593 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్టు చెప్పారు. తిరుపతి, నెల్లూరు రైల్వేస్టేషన్ల రీ డెవలప్‌మెంట్ పనులు 50 శాతం మేర పూర్తయ్యాయని, ఈ రెండు స్టేషన్లకు రూ.311 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్‌ను పీపీపీ విధానంలో చేపట్టనున్నట్టు చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని 1465 కిలోమీటర్ల మేర 'కవచ్' పనులు చేపట్టినట్టు తెలిపారు. ఏపీలో 120 కిలోమీటర్ల మేర కర్నూలు-గుంతకల్లు మధ్య కవచ్ పనులు చేపట్టామన్నారు. కొత్తగా ఏపీకి మరో 1000 కిలోమీటర్ల మేర కవచ్ పనులకు ఆమోదం లభించిందన్నారు. ఏపీలో 1059 కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మరో 185 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయటానికి ఆమోదం లభించిందని తెలిపారు. గత ఐదేళ్లలో మొత్తం 35 కొత్త రైళ్లను ప్రవేశపెట్టామని, ఇందులో 6 వందేభారత్ రైళ్లు కూడా ఉన్నాయని చెప్పారు. తిరుపతి, కాకినాడ, విజయవాడలలో మెకనైజ్డ్ లాండ్రీలను నెలకొల్పామన్నారు. ఈ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.9,533 కోట్ల మేర ఏపీకి కేటాయింపులు జరిగాయని, గతం కంటే ఇది తొమ్మిది శాతం ఎక్కువని తెలిపారు.

డ్రెయినేజీ సమస్యలపై చర్చించా: కేశినేని

విజయవాడలో ఇటీవల బుడమేరు వరదల కారణంగా తలెత్తిన సమస్యలను పరిష్కరించుకునే క్రమంలో డ్రెయినేజీ సమస్యలపై రైల్వే శాఖ దృష్టి సారించాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్టు ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో చెప్పారు. డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి సంబంధించి రైల్వేతో ముడిపడి ఉన్నందున రైల్వే, కార్పొరేషన్, రెవెన్యూ శాఖల జేఏసీ ఏర్పాటుతో పాటు ఆ తర్వాత జేఏసీ పరిశీలనలో భాగంగా చేపట్టవలసిన అంశాలపై భాగస్వామ్యం తీసుకోవాల్సిందిగా కోరానన్నారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఏపీ రాజధాని అమరావతికి అతి త్వరలో నూతన రైల్వే లైన్ పనులు సాకారమవుతాయని చెప్పారు.

కీలక పాత్రధారి గుంటూరు రెడ్డి!

ఇసుక దోపిడీలో తెరపైకి కొత్త పేరు .. గుట్టు విప్పిన గనుల వెంకటరెడ్డి

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇసుక దోపిడీలో కొత్త పేరు తెరపైకి వచ్చింది. ఇసుక పాలసీ రూపొందించే ముందే ఒక కాంట్రాక్టు సంస్థకు చెందిన గుంటూరు రెడ్డి కీలక పాత్ర పోషించారని ఏసీబీ విచారణలో గనుల వెంకటరెడ్డి గుట్టు విప్పినట్లు తెలిసింది. ఆయన తన పేరు తెరపైకి రాకుండా జాగ్రత్త పడ్డారని, ఎఫ్ఐఆర్‌లో కూడా లేదని చెప్పినట్టు సమాచారం. అపజయమే ఎరుగని అర్థం వచ్చేలా పేరు పెట్టుకున్న ఆ రెడ్డి ఇసుక వ్యవహారంలో ముఖ్య పాత్ర పోషించారని, అప్పటి సీఎం కార్యాలయంతో ఆయనకు సంబంధాలు ఉండేవని చెప్పినట్లు తెలిసింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఏసీబీ విచారణలో రెండో రోజూ మొదట పాత పాటే పాడారు. 'మొత్తం ఫైళ్లన్నీ పరిశీలించారు. ఎక్కడికక్కడ సిబ్బందిని విచారించారు. ఇక నేను చెప్పేది ఏముంది. ఎవరు కర్త, ఎవరు కర్మ అనేది మీకు తెలుసు. దయచేసి నన్ను ఇబ్బంది పెట్టొద్దు' అని విచారణ అధికారుల ప్రశ్నలకు బదులిచ్చారు. 'ఎంఓయూ నుంచి బిల్లుల వసూలు, వాటాల పంపిణీ వరకూ అన్నింట్లో మీ పాత్ర కనిపిస్తోంది. కథలు కట్టిపెట్టి నిజాలు చెప్పండి' అంటూ ఏసీబీ అధికారులు గట్టిగా ప్రశ్నించారు. రూ. వేల కోట్ల సంపదను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ముందు ఏ పత్రికలో ప్రకటన ఇచ్చారు? అసలు వీరికే టెండర్ ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? రాష్ట్రంలో ఏ ఇతర సంస్థ ముందుకు రాలేదా? రెగ్యులేటరీ మెకానిజమ్‌కు ఎందుకు అటు వెళ్లొద్దని ఆదేశాలిచ్చారు? బిల్లులు అడిగిన ఏడీలపై ఎందుకు ఒత్తిడి తెచ్చారు? ఎంత తవ్వారో ఏడీలకు తెలుస్తుంటే మీరెందుకు బిల్లులు తీసుకున్నారంటూ ప్రశ్నల వర్షం కురిపించడంతో.. వెంకటరెడ్డి షాకయ్యారు.

సాక్ష్యాలు చూపించి...

అదుపులోకి తీసుకున్న రోజు పోలార్ బేర్ కథ.. కస్టడీకి తీసుకున్న మొదటి రోజు 'అంతా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలే' అంటూ అత్తెసరు సమాధానాలు చెప్పిన వెంకటరెడ్డికి రెండో రోజు విచారణలో ఏసీబీ తమ వద్ద ఉన్న ఆధారాలను ముందు పెట్టింది. 'ఒక ఎంవోయూ కుదుర్చుకునే ముందు సంబంధిత అధికారులు సమీక్షించుకుంటారు. ప్రభుత్వానికి ఆదాయం ఎక్కువ వచ్చేలా చూస్తారు. ఆ తర్వాత అవకతవకలకు తావు లేకుండా కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం చేసుకుంటారు. కానీ జేపీ వెంచర్స్, టర్న్ కీ, ప్రతిమ సంస్థలకు అయాచిత లబ్ధి చేకూర్చేలా మీరు ఒప్పందాలు ఎలా చేసుకున్నారు?' అంటూ గట్టిగా అడిగినట్లు తెలిసింది. బిత్తరపోయిన వెంకటరెడ్డి ఎట్టకేలకు నోరు విప్పారు.

ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి

కేంద్ర సర్వీసుల్లో పనిచేసిన అధికారిగా గతంలో ఎన్నడూ లేని, నిబంధనలు అనుమతించని చేతిరాత వే బిల్లులను మీరెలా స్వీకరించారు? కాంట్రాక్టరు సొంతంగా ముద్రించుకున్న వాటిని మీరెందుకు ఆమోదించారు' అని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. 'నేను ఇలా బలైపోతానని అప్పుడు ఊహించింటే అడ్డు చెప్పేవాడిని' అంటూ వెంకటరెడ్డి వాపోయారు. కాంట్రాక్టు సంస్థలు గోదావరిలో ఏకంగా 18 మీటర్ల లోతు వరకూ పొక్లెయిన్లతో తవ్వినా, ఇసుక పుష్కలంగా ఉన్న చోట యాభై అడుగులకు పైగా తోడుకున్నా ఎందుకు అడ్డుకోలేదని విచారణాధికారులు ప్రశ్నించారు. 'అడ్డు చెప్పే అవకాశమే ఎవరికీ ఉండదు సర్. పెద్ద పెద్ద బ్యూరోక్రాట్లకే అంత ధైర్యం లేదు. నా వల్ల అవుతుందా?' అని వెల్లడించారు. 'ఇసుక రేవుల వద్ద కాంట్రాక్టర్‌ను బిల్లులు అడిగిన మైనింగ్ ఏడీలకు ఫోన్లు చేసి ఒత్తిడి చేశావ్ కదా?' అని అధికారులు ఆధారాలు ముందు పెట్టి నిలదీశారు. దీంతో ఆయన కాసేపు మౌనంగా ఉన్నట్లు తెలిసింది.

ఈ దశలో జోక్యం చేసుకోలేం..

- గీతకార్మికుల షాపులపై ప్రభుత్వాన్ని ఆదేశించలేం: హైకోర్టు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా గీతకార్మికులకు రిజర్వ్ చేసిన షాపులను ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందే ప్రకటించేలా ప్రభుత్వానికి ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రభుత్వ విధాన నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. గీత కార్మికుల షాపులపై వేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. గీత కార్మికుల షాపులను ప్రకటించకుండా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఉమ్మడి కృష్ణా జిల్లా ఘంటసాల మండలం, కొడాలి గ్రామానికి చెందిన పరుచూరి శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది మనోహర్‌రెడ్డి, ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. మరోవైపు మండలాన్ని ఓ యునిట్‌గా తీసుకొని రిటైల్ ఎక్సైజ్ శ్లాబు నిర్ణయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 211, 212లను సవాల్ చేస్తూ కోనసీమ జిల్లా, కొత్తపేటకు చెందిన కొప్పుల వీర వెంకట సత్యనారాయణ మూర్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై కోర్టు శుక్రవారం విచారణ జరిపింది. మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు లైసెన్స్‌లు జారీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. ప్రధాన వ్యాజ్యంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 5 అక్టోబరు 2024



వంటిల్లు

తమిళనాడులోని చెట్టినాడ్ ప్రాంత ఆహారానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉంది. చెట్టినాడ్ ప్రాంతంలో నాన్‌వెజిటేరియన్ మాత్రమే కాదు వెజిటేరియన్ వంటలు కూడా చాలా రుచిగా వండుతారు. అలాంటి కొన్ని వంటలను హైదరాబాద్‌లోని బార్‌బెక్యూ నేషన్‌కు చెందిన చెఫ్ రాఘవేంద్ర మన ముందుకు తీసుకువస్తున్నారు.

చెట్టినాడ్ వెజ్ వెరైటీలు

చెట్టినాడ్ వెజ్ కర్రీ

కావాల్సిన పదార్థాలు:

చెట్టినాడ్ గ్రేవీ, కరివేపాకు- పావు కప్పు, నూనె- తగినంత, అల్లం వెల్లుల్లి పేస్ట్- అర స్పూను, అన్ని రకాల కూరల ముక్కలు- రెండు కప్పులు, పనీర్ ముక్కలు- ఒక కప్పు, ఎండు మిరపకాయలు- 10, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

- చెట్టినాడ్ గ్రేవీని ఒక గిన్నెలో వేయాలి. దానిలో తగినన్ని నీళ్లు పోసి- ఎక్కడా ఉండలు లేకుండా 15 నిమిషాలు సన్నని మంట మీద ఉడకపెట్టాలి.
- ఒక మూకుడులో కొద్దిగా నూనె వేసి కాగనివ్వాలి. ఆ తర్వాత కరివేపాకు, ఎండు మిర్చి వేసి వేయించాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. ఆ మిశ్రమంలో కూర ముక్కలు, పనీర్ ముక్కలు వేసి వేయించాలి.
- వేయించిన మిశ్రమంలో చెట్టినాడ్ గ్రేవీని వేసి పది నిమిషాలు ఉడకనివ్వాలి. ఆ తర్వాత తగినంత ఉప్పు వేయాలి.

జాగ్రత్తలు

- చెట్టినాడ్ గ్రేవీలో తగినన్ని నీళ్లు పోయాలి. లేకపోతే పలచగా అయిపోతుంది.
- గ్రేవీలో అల్లం వెల్లుల్లి పేస్ట్ ఉంటుంది కాబట్టి కర్రీలో మరీ ఎక్కువగా అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాల్సిన అవసరం లేదు.
- ఈ కర్రీని చపాతీతో కానీ ఇదియప్పంతో కానీ తింటే చాలా బావుంటుంది.

చెట్టినాడ్ గ్రేవీ తయారీ

కావాల్సిన పదార్థాలు:

ఎండు మిరపకాయలు-5, కొబ్బరి పొడి- మూడు స్పూనులు, ధనియాలు- రెండు స్పూనులు, జీలకర్ర- రెండు స్పూనులు, సోంపు- రెండు స్పూనులు, నల్ల మిరియాల పొడి- రెండు స్పూనులు, తరిగిన ఉల్లిపాయలు- రెండు, అల్లం- తగినంత, వెల్లుల్లి- మూడు, నువ్వుల నూనె- పావు కప్పు, నీళ్లు- తగినన్ని, ఉప్పు- తగినంత

తయారీ విధానం:

- ఒక మూకుడులో నూనెను వేడిచేయాలి. దీనిలో ఎండు మిర్చి, కొబ్బరి పొడి, ధనియాలు, జీలకర్ర, సోంపు, మిరియాల పొడి వేసి వేయించాలి. దోరగా వేగిన తర్వాత వీటిని ఒక ప్లేటులోకి తీసి చల్లార్చాలి.
- మూకుడులో మిగిలిన నూనెలో ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి వేసి వేయించాలి. ఇవి బాగా వేగిన తర్వాత వీటిని మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఈ ముద్దలో వేయించిన ఎండుమిర్చి, కొబ్బరి పొడి, ధనియాలు, జీలకర్ర, సోంపు, మిరియాల పొడిలను కలిపాలి. తగినంత ఉప్పు, కొద్దిగా నీళ్లు వేసి మిక్సీ జార్‌లో వేసి బాగా తిప్పాలి.



వెజ్ కొత్తు పరోటా

కావాల్సిన పదార్థాలు:

పనీర్ (చిన్న ముక్కలు)- వంద గ్రాములు, కూరల ముక్కలు- 200 గ్రాములు, తరిగిన ఉల్లిపాయలు- వంద గ్రాములు, తరిగిన టమోటాలు- 100 గ్రాములు, తరిగిన పచ్చి మిరపకాయలు- ఐదు, తరిగిన కొత్తిమీర - పావు కప్పు, ఆవాలు- రెండు స్పూనులు, కరివేపాకు- ఒక పావు కప్పు, కొబ్బరి పొడి- రెండు స్పూనులు, గరం మసాలా- రెండు స్పూనులు, కారం- రెండు స్పూనులు, నూనె- తగినంత, ఉప్పు- తగినంత, రెడీ టూ ఈట్ పరోటాలు- ఎనిమిది, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- రెడీ టూ ఈట్ పరోటాలను నెయ్యి వేసి బాగా కాల్చాలి. వాటిని చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవాలి.
- ఒక మూకుడులో కొద్దిగా నూనెను వేసి కాచాలి. నూనె కాగిన తర్వాత ఆవాలు వేయాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, టమోటా ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు వేసి దోరగా వేయించాలి.
- ఉల్లిపాయ ముక్కలు బాగా వేగిన తర్వాత ఆ మిశ్రమంలో కూర ముక్కలు, పనీర్ ముక్కలను కూడా వేయాలి. మూకుడుపై మూత పెట్టి 10 నిమిషాలు ఉడకనివ్వాలి.
- కూర ముక్కలు మగ్గిన తర్వాత దానిలో మసాలా, కారం, కొబ్బరిపొడి, ఉప్పు వేయాలి. కొద్దిగా నీళ్లు పోయాలి. ఈ మిశ్రమం బాగా ఉడికి దగ్గర పడిన తర్వాత కాల్చిన పరోటా ముక్కలను వేయాలి.
- ఈ మిశ్రమాన్ని బాగా కలిపి కొత్తిమీర, కరివేపాకులను కూడా కలపాలి. వేడిగా ఉన్నప్పుడే దీనిని తింటే మంచి రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- రెడీ టూ ఈట్ పరోటాలు అందుబాటులో లేకపోతే బాగా కాల్చిన చపాతీ ముక్కలను కూడా వాడుకోవచ్చు.
- నీళ్లను సరిసమంగా పోయాలి. ఎక్కువ అయితే పలచన అయిపోతుంది. అందువల్ల నీళ్లు పోసే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.
- దీనిని పెరుగుతో కలిపి తిన్నా చాలా బావుంటుంది.

చెఫ్ రాఘవేంద్ర
బార్‌బెక్యూ నేషన్
హైదరాబాద్



దేవీ నవరాత్రులు

నేటి అలంకారం

శ్రీ అన్నపూర్ణాదేవి

అశ్వయుజ శుద్ధ తదియ, శనివారం

విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మవారు... శరన్నవరాత్రి మహోత్సవాల్లో మూడో రోజున అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిస్తారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం, సర్వజీవనాధారం. జీవుల ఆకలిని తీర్చడం కన్నా మించినది ఏదీ లేదు. అందుకే అన్ని దానాల కన్నా అన్నదానం



గొప్పదంటారు. అన్నాన్ని ప్రసాదించే మాతృమూర్తి... శ్రీఅన్నపూర్ణాదేవి. ఎడమ చేతిలో అమృతాన్నం ఉన్న బంగారు పాత్రతో, కుడి చేతిలో వజ్రాలు పొదిగిన గరిటతో... ఈశ్వరుడికి భిక్ష పెట్టిన దేవత. ఆమె నిత్యాన్నదానేశ్వరి. సాక్షాత్తూ శివ స్వరూపిణి. ఈ అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శిస్తే... అన్నాదులకు లోటు లేకుండా ఉంటుందని భక్తుల నమ్మిక. ఆ తల్లిని ధ్యానిస్తే ధన, ధాన్య వృద్ధి, మధుర భాషణం, ఐశ్వర్య సిద్ధి కలుగుతాయని పెద్దలు చెబుతారు. అన్నపూర్ణాదేవిని కుంకుమతో పూజించాలి. జ్ఞానభిక్ష పెట్టాలనీ, వైరాగ్యం కలగజేయాలనీ కోరుకోవాలి.

నైవేద్యం:
కట్టె పొంగలి, పరమాన్నం
అలంకరించే చీర రంగు:
ఎరుపు
అర్చించే పూల రంగు:
తెలుపు
పారాయణ చేయాల్సినవి:
అన్నపూర్ణాష్టకం



చల్లనివన్నీ హిమక్రీములు కావు..!

కాలం ఏదైనా.. వయస్సు ఎంతైనా అందరూ ఆనందంగా తినేది ఐస్‌క్రీమ్. అయితే మనం ప్రతి రోజూ తినే ఐస్‌క్రీమ్ నిజంగా పాలతో తయారు చేసినదేనా? ఒక వేళ చేయకపోతే... అసలైన ఐస్‌క్రీమ్‌ను ఎలా కనుగొనాలి? అసలైన ఐస్‌క్రీమ్‌లో ఉపయోగించే పదార్థాలేవిటి? గాడిద, ఒంటెలాంటి జంతువుల పాలతో ఐస్‌క్రీమ్‌లు తయారుచేయవచ్చా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవటానికి ఆహార నిపుణుడు, ఐస్‌బెర్గ్ కంపెనీ ఎండీ సుహాస్. బి శెట్టిని 'నవ్య' పలకరించింది.



మన దేశంలో తొలి ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీని 1900 సంవత్సరం ముంబయిలో స్థాపించారు.



మనం ఐస్‌క్రీమ్ అనుకొని తినేది నిజంగా పాలతో చేసిన ఐస్‌క్రీమేనా?

మన దేశంలో ఎక్కువ కంపెనీలు అమ్మేది నిజమైన ఐస్‌క్రీమ్ కాదు. ఫుడ్ స్టాండర్డ్స్ ప్రకారం- ఐస్‌క్రీమ్‌ను పాలు, క్రీమ్, పంచదారలతో తయారుచేయాలి. వాటిలో ఎటువంటి వెజిటబుల్ ఆయిల్స్, వెజిటబుల్ ఫ్యాట్స్ కలపకూడదు. అయితే పాల కన్నా వెజిటబుల్ ఆయిల్స్, ఫ్యాట్స్ ఖరీదు తక్కువ కాబట్టి- ఎక్కువ కంపెనీలు వీటితోనే ఐస్‌క్రీమ్ తయారు చేస్తాయి. అందుకే వీటిని ఐస్‌క్రీమ్ అని కాకుండా ఫ్రోజన్ డిజర్ట్స్ అని పిలుస్తారు. నిజంగా పాలతో తయారు చేసే ఐస్‌క్రీమ్‌తో పోలిస్తే... వీటి ఖరీదు తక్కువ ఉంటుంది.

ఫ్రోజన్ డిజర్ట్స్.. నిజమైన ఐస్‌క్రీమ్‌లలో ఏఏ పదార్థాలు వాడతారు?

ఫ్రోజన్ డిజర్ట్స్‌లో పామాయిల్ లేదా కొబ్బరి నూనె వాడతారు. ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి కృత్రిమ రంగులు, కొన్ని రసాయన పదార్థాలు వాడతారు. ఇవన్నీ ఐస్‌క్రీమ్ ప్యాకెట్స్‌పై ముద్రించి ఉంటాయి. ఈ తరహా ఐస్‌క్రీమ్ ఎక్కువగా తింటే ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడవచ్చు. ఇక నిజమైన ఐస్‌క్రీమ్‌లో పాలు, క్రీమ్, పంచదార, పళ్ల ముక్కలు మాత్రమే వాడతారు. సహజసిద్ధమైన రంగులు కూడా వాడతారు.

ఈ మధ్యకాలంలో ఆర్గానిక్ ఐస్‌క్రీమ్‌లు ఎక్కువ ప్రచారంలోకి వస్తున్నాయి.. వాటిని వేటితో తయారు చేస్తారు...

సేంద్రీయ వ్యవసాయం ద్వారా పెంచిన ఆహారాన్ని తినే ఆవులు లేదా గేదెల పాలతో చేసిన ఐస్‌క్రీమ్‌ను ఆర్గానిక్ ఐస్‌క్రీమ్ అంటారు. వీటిలో పంచదార బదులుగా కోకోనట్ సుగర్, పామ్ సుగర్, ఆర్గానిక్ బెల్లంతో తయారుచేస్తారు. దీనిలో వాడే రంగులు కూడా సహజమైనవే! ఉదాహరణకు దీనిలో వాడే పసుపు రంగు పసుపు నుంచి.. ఎర్ర రంగు బీట్‌రూట్ నుంచి తయారుచేస్తారు. దీని ఖరీదు మామూలు ఐస్‌క్రీమ్‌ల కన్నా ఎక్కువే ఉంటుంది.

పాలతో తయారు చేసిన ఐస్‌క్రీమ్ నోటిలో నెమ్మదిగా కరుగుతుంది. నకిలీ ఐస్‌క్రీమ్‌లు తిన్న తర్వాత నీళ్లలాంటి పదార్థం మిగిలిపోతుంది. అంతేకాదు.. నిజమైన ఐస్‌క్రీమ్‌లో తియ్యదనం తక్కువగా ఉంటుంది. నకిలీ ఐస్‌క్రీమ్‌లో ఎక్కువ ఉంటుంది.



సుహాస్. బి శెట్టి

ఐస్‌క్రీమ్‌లకు ఎక్స్‌పైరీ డేట్ ఉంటుందా?

ఉంటుంది. చాలా బ్రాండ్స్ తయారుచేసే ఐస్‌క్రీమ్‌లు 12 నెలల దాకా తినవచ్చు. సహజసిద్ధమైన పదార్థాలు వాడితే తక్కువ షెల్ఫ్‌లైఫ్ ఉంటుంది. ఉదాహరణకు ఐస్‌బర్గ్ ఐస్‌క్రీమ్స్‌లో మేము గర్ గమ్, గోంద్ గమ్ వంటివి వాడతాం. అందువల్ల వీటిని ఆరునెలలు మాత్రమే నిల్వ చేయగలం.

ఇంట్లో ఐస్ క్రీమ్ తయారుచేసుకోవచ్చా?

చిక్కని పాలు, క్రీమ్, పంచదార, వెనీలా ఎక్స్‌ట్రాక్ట్ ఉంటే మనమే తయారుచేసుకోవచ్చు. కొందరు కార్న్‌స్టార్చ్ (మొక్కజొన్న పొడి) కూడా వాడతారు. దీని వల్ల ఐస్‌క్రీమ్ చిక్కబడుతుంది.



ప్రపంచంలో వెయ్యికి పైగా ఐస్‌క్రీమ్ ఫ్లేవర్స్ లభిస్తాయి. కొన్ని దేశాల్లో నువ్వులతోనూ వెల్లుల్లితోనూ ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది వెనీలా ఐస్‌క్రీమ్‌ను ఎక్కువగా ఇష్టపడతారు.

ఆవులు, గేదెలు కాకుండా ఇతర జంతువుల పాలతో కూడా ఐస్‌క్రీమ్ చేసుకోవచ్చా?

ఈ మధ్యకాలంలో- గాడిద, ఒంటె, మేక పాలతో చేసే ఐస్‌క్రీమ్‌లకు చాలా మంచి డిమాండ్ ఉంది. ఈ జంతువుల పాలలో విటమిన్ ఏ, డీ, ఈ, సీ ఉంటాయి. ఐరన్ ఉంటుంది. మన దేశంలో ఈ జంతువుల పాలతో ఐస్‌క్రీమ్‌లను తొలిసారి మేమే తయారు చేశాం.





చవులూరించే పాల గారెలు

మన ఆహారంలో పాలు తప్పనిసరైన పదార్థం. అయితే పాలను తాగటం వల్ల రకరకాల సమస్యలు ఏర్పడుతాయనేది కొందరి అభిప్రాయం. దీనికి కారణం- పాలను తగినంతగా కాయకపోవటం. పాలను కాస్తే- దానిలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా చనిపోయి ఆరోగ్యానికి ఎటువంటి హాని జరగదు. ఈ విషయాన్ని పాశ్చాత్యుల కన్నా ముందే క్షేమ కుతూహలం గ్రంథాన్ని రాసిన క్షేమశర్మ చెప్పాడు.

క్షేమశర్మ పాలు కాచే విధానాన్ని- 'దుగ్ధా వినష్టం భృష్టాభృష్టాంతరాంతరమ్' అనే శ్లోకంలో పేర్కొంటాడు. ఈ శ్లోక ప్రకారం- పాలను రెండు, మూడు పొంగులు వచ్చే వరకూ కాచాలి. దానిని చల్లార్చాలి. మళ్లీ పాలను కాచి- రెండు మూడు పొంగులు రానివ్వాలి. ఆ తర్వాత మంచి తెల్లని వస్త్రంలో పాలను వడబోయాలి. ఇలా మూడు నాలుగు సార్లు చేయాలి. దీని వల్ల పాలలో ఉండే దోషాలన్నీ పోతాయని క్షేమశర్మ చెబుతాడు. ఇలా పాలను కాచటంలో కూడా రెండు పద్ధతులు ఉన్నాయి. సక్తువద్భవేత్ దీనిలో మొదటిది. అంటే బియ్యపిండిలో కొద్దిగా నీళ్లు కలిపితే మిశ్రమం ఎంత చిక్కగా అవుతుందో- ఆ మాదిరిగా పాలను కాచటం మొదటి పద్ధతి. "పాకపిండీకృతం" రెండో పద్ధతి. వండిన అన్నపు ముద్ద మాదిరిగా చిక్కగా కాచటం రెండో పద్ధతి. ఈ తరహా పాలను తెలుగులో 'ఆనవాలు' అంటారు.



ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. బ్యాక్టీరియా సంహరణ ఒకటే పాలను కాచటానికి పరమావధి కాదు. చిక్కపడేదాకా కాచటం వల్ల పాలకు లఘుత్వం చేకూరుతుంది. వాతం చేయవు. పాలే కాదు. నీళ్లను కూడా ఇలా కాచితేనే మంచి ఫలితాలు ఉంటాయి.

క్షీకవటకవటీ (పాల గారెలు) తయారీ...

క్షేమశర్మ తన గ్రంథంలో పాలగారెల తయారీ గురించి కూడా ప్రస్తావించాడు.

"మరీచగర్భితా నష్టదుగ్ధజా వటకా వటీ!
పక్వా ఘృతే క్షిపేత్ క్షీరే ఖండపాకే ద్రవాక్షిపేత్!!

ఈ శ్లోకం ప్రకారం పాలను బాగా చిక్కపడేలా కాచాలి. అప్పుడు వచ్చే ముద్దలో తగినంత మిరియాల పొడి వేయాలి. ఈ మిశ్రమాన్ని ఉండలుగా చేసుకోవాలి. ఒకో ఉండను తీసుకొని- అరచేతిలో గారెల మాదిరిగా గుండ్రంగా నొక్కి మధ్యలో చిల్లు పెట్టాలి. వీటిని నేతిలో వేయించాలి. ఈ వేగిన పాలగారెలను చిక్కగా కాచిన పాలలో కానీ.. పంచదార లేతపాకంలో కానీ వేయాలి. ఇలా తయారుచేసిన పాలగారెలు రసగుల్లాల కన్నా మధురంగా ఉంటాయి. పాలగారెలను వేరే విధంగా ఎలా చేయాలో క్షేమశర్మ చెప్పాడు. బియ్యాన్ని బాగా నానబెట్టాలి. ఈ బియ్యాన్ని రుబ్బుతూ- చిక్కని పాలను పోయాలి. అప్పుడు గారెల పిండి మాదిరి మిశ్రమం ఏర్పడుతుంది. దానితో ఉండలు చేసి అరచేతిలో గారెల మాదిరిగా గుండ్రంగా నొక్కి మధ్యలో చిల్లు పెట్టాలి. వాటిని నేతిలో వేయించి- పంచదార లేత పాకంలో నాననివ్వాలి.

• గంగరాజు అరుణాదేవి

పవన్ కల్యాణ్ వీటిపై దృష్టి పెట్టండి: తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 4: 'రాష్ట్రంలో పలుచోట్ల జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు పనులు అటవీ అనుమతులులేక నిలిచిపోయాయి. కొన్నిచోట్ల పనులే ప్రారంభం కాలేదు. వీటిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి సారించాలి' అని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. 'సనాతన, హిందు ధర్మం గురించి పవన్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదం. గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు వినియోగంలో లేక పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండి వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామీణ రోడ్లు దారుణంగా ఉన్నాయి. నిధులు లేక స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యం అవుతున్నాయి. వీటిపై పవన్ దృష్టిసారించాలి' అని తులసిరెడ్డి హితవు పలికారు.

నార్మ్‌తో రంగా వర్సిటీ ఒప్పందం

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)తో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం చేసుకుంది. శుక్రవారం వీసీ శారదాజయలక్ష్మి సమక్షంలో రిజిస్ట్రార్ రామచంద్రరావు, నార్మ్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. అగ్రికల్చర్ సర్వీస్ ఉద్యోగాల్లో నియమితులైన వారికి శిక్షణ ఇచ్చే నార్మ్ ద్వారా వ్యవసాయ విద్యార్థులకు శిక్షణ, పీజీ, పీహెచ్‌డీ విషయాల్లో పరస్పర సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకునేందుకు మూడేళ్లకు ఒప్పందం చేసుకోగా, మరో మూడేళ్ల ఒప్పందాన్ని కొనసాగించడానికి తాజా ఎంవోయూ కుదుర్చుకున్నారు.

ప్రకృతి సేద్యంతో రైతు ఆర్థిక స్థితి మెరుగు

- వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రాజశేఖర్

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్య పద్ధతులను అనుసరిస్తే.. రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ చెప్పారు. శుక్రవారం గుంటూరు(లాం)లోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై వీసీ శారదాజయలక్ష్మి అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో సేద్య విధానాల్లో మార్పు కోసం సమీక్ష జరగాలన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత కోసం ప్రకృతి వ్యవసాయంలోని సైన్స్‌ను గుర్తించాలన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ, విశ్వవిద్యాలయం, రైతుసాధికార సంస్థ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

ముగిసిన పింక్ బస్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని స్విమ్స్ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో అమరావతి సచివాలయంలో మహిళా ఉద్యోగులకు పింక్ బస్ ద్వారా రెండు రోజులపాటు జరిపిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. నోటి క్యాన్సర్ పరీక్షలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలను గుర్తించేందుకు పాప్ స్మియర్, రొమ్ముక్యాన్సర్‌కు సంబంధించిన మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేపట్టారు.

జగన్‌వి నీచ రాజకీయాలు: ఎమ్మెల్యే జీవీ

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జగన్ బెంగుళూరులో ఫుల్‌టైమ్, తాడేపల్లిలో పార్ట్‌టైమ్ ఉంటూ నీచ రాజకీయాలు చేస్తున్నాడని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ చేసిన పాపాల నుంచి జగన్ ఎక్కడికీ తప్పించుకోలేడని అన్నారు. మరోవైపు శివశక్తి ఫౌండేషన్ తరఫున తన తల్లి పేరుతో మహిళా కాలేజ్ ఏర్పాటుకు అనుమతివ్వాలని ఎమ్మెల్యే ఆంజనేయులు మంత్రి లోకేశ్‌ను కోరారు.

రాష్ట్రంలో ఉల్లాస్ పథకం

- ఎస్‌హెచ్‌జీలు, ఆయాలు, వంట మనుషులు, నైట్ వాచ్‌మెన్లకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్వచ్ఛంద సహాయక బృందాల్లోని లబ్ధిదారులు, ప్రభుత్వ పాఠశాలల ఆయాలు, వంట మనుషులు, సహాయకులు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్‌వాడీలకు కేంద్రం ప్రవేశపెట్టిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పథకాన్ని అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. పథకం అమలుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఆర్థిక అక్షరాస్యత కోసం ఆర్థిక విధానాలు, బడ్జెట్ నైపుణ్యాలు, ఆర్థిక వ్యూహాలపై వారికి శిక్షణ అందిస్తారు. డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇస్తారు. మహిళలకు అగ్రిమెంట్లు, కాంట్రాక్టులు, ఆర్థిక ధృవపత్రాలపై అవగాహన కల్పిస్తారు.

లోకేశ్‌ను కలిశానని కక్షగట్టి వేధించారు

- దివంగత కానిస్టేబుల్ భార్య ఆవేదన
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన మంత్రి ఫరూక్

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర సమయంలో టీడీపీ నేత లోకేశ్‌ను కలిసి గోడు విన్నవించుకున్నందుకు తనపై కక్షగట్టి తీవ్రంగా వేధించారని నంద్యాలకు చెందిన దివంగత కానిస్టేబుల్ భార్య శ్రావణి వాపోయారు. ఆమె శుక్రవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డిని కలిసి తన గోడు వినిపించారు. 'కానిస్టేబుల్ అయిన నా భర్తను దారుణంగా చంపారు. యువగళం పాదయాత్రలో లోకేశ్‌ను కలిసి దీని గురించి చెప్పాను. తర్వాత వైసీపీ నాయకులు, పోలీసు అధికారులు కలిసి నన్ను ఎస్పీ ఆఫీసుకు పిలిపించి లోకేశ్‌ను ఎందుకు కలిశావని ప్రశ్నించారు. నాపై కక్షగట్టి నా భర్తకు శాఖాపరంగా రావాల్సిన రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా, స్పెషల్ కేసు కింద పరిగణించి ఇస్తామన్న ఉద్యోగం ఇవ్వలేదు. నాకు ఇప్పుడైనా న్యాయం చేయండి' అని ఆమె వేడుకొన్నారు. ఆమెకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో టిడ్కో పథకం కింద మంజూరైన డబుల్ బెడ్ రూం ఇంటికి తాను రూ.50వేలు చెల్లించానని, వైసీపీ హయాంలో ఇల్లు రద్దు చేశారని అనంతపురం పట్టణానికి చెందిన కృష్ణవేణి ఫిర్యాదు చేశారు. తనకు ఆ ఇల్లు ఇప్పించాలని ఆమె కోరారు. తమ గ్రామానికి విద్యుత్, రహదారి సౌకర్యం కల్పించాలని అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు గ్రామానికి చెందిన సర్పంచి లక్ష్మణ్, కించాయిపుట్టు గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు వినతిపత్రం సమర్పించారు. వెలుగోడు ముంపు గ్రామాల్లో కొందరికి నష్ట పరిహారం రాలేదని, పదిహేనేళ్లుగా పోరాడుతున్నా ఫలితం లేకుండా పోయిందని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని సుంకేశుల గ్రామానికి చెందిన పానుగంటి రంగయ్య ఫిర్యాదు చేశారు. తమకు వరదల నష్ట పరిహారం అందలేదని విజయవాడ భవానిపురానికి చెందిన సలోమి, మరి కొందరు బాధితులు ఫిర్యాదు చేశారు. వారి సమస్యపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. తన ఇంటి స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించారని, ఆ ఆక్రమణను విడిపించాలని గుంటూరు జిల్లా తాడికొండ మండలం కర్లపూడికి చెందిన వెంకాయమ్మ ఫిర్యాదు చేశారు. ఏలూరు జిల్లా కామవరపు కోట పంచాయతీలో నాయక్ తెగకు చెందిన వారికి గిరిజన సర్టిఫికెట్ ఇవ్వడం లేదని, ఈ సమస్య పరిష్కరించాలని అక్కడి టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు.

వైఎస్ఆర్ జిల్లాను వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చండి

- సీఎంకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ లేఖ

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గొప్ప చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉన్న కడప జిల్లా పేరును గత ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్పు చేసిందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వైఎస్ఆర్ జిల్లా పేరును 'వైఎస్ఆర్ కడప' జిల్లాగా మార్చాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. గత ప్రభుత్వం కడప జిల్లా పేరును మార్చడం వల్ల జిల్లా వ్యాప్తంగా ప్రజలు, శ్రీవారి భక్తుల మనసులునొచ్చుకున్నా భయం చేత ఎవ్వరూ తమ అభిప్రాయాలు బయటపెట్టలేదన్నారు. తాను గతంలో అసెంబ్లీలో ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు గుర్తుచేశారు. కడప జిల్లా అభివృద్ధికి వైఎస్ కృషి చేసిన మాట వాస్తవమే అయినా, ఆ జిల్లాకున్న ప్రాశస్త్యాన్ని కూడా గుర్తించి కడప పేరును పూర్తిగా తొలగించకుడా.. వైఎస్ఆర్ కడపగా మార్చాలని కోరారు.

రాజకీయాలను వదిలేసిన అదృష్టవంతుడిని: దగ్గుబాటి

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 4: రాజకీయాలను వదిలేసిన అదృష్టవంతుడినని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. బాపట్ల జిల్లా కారంచేడులో శుక్రవారం జరిగిన వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలు డబ్బుతో కూడుకున్నాయని, కోట్లు ఖర్చుపెట్టి గెలిచిన తర్వాత కూడా ప్రజల నుంచి తిట్లు తప్పటం లేదని అన్నారు. 'ఓడరేవులో ప్రమాదాలు జరగకుండా ఇటీవల చీరాల ఎమ్మెల్యే కొండయ్య గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి వారికి జీతాలు చెల్లించే విధంగా రిసార్ట్స్ వాళ్లతో మాట్లాడారు. అయితే కొండయ్య డబ్బులు వసూలు చేస్తున్నారని రిపోర్టర్లు వార్తలు రాశారు. వరద బాధితులకు సాయం కోసం వైశ్య కమ్యూనిటీ నుంచి విరాళాలు సేకరించిన తరుణంలో కూడా ఇలాంటి ఆరోపణలు చేశారు. డబ్బులు ఖర్చుపెట్టి రాజకీయంలోకి వచ్చి, ప్రజలకు సేవ చేద్దామన్నా ఇలాంటి ఆరోపణలు తప్పట్లేదు' అని దగ్గుబాటి వ్యాఖ్యానించారు.



కారంచేడులో ఆర్వో వాటర్ ప్లాంటు నిర్మాణానికిగాను రాంకీ గ్రూప్ సంస్థకు రూ.కోటి చెక్కును అందజేస్తున్న దగ్గుబాటి హితేశ్, చిత్రంలో మంత్రి గొట్టిపాటి, ఎంపీ పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు తదితరులు

ఎమ్మెల్యే కొలికపూడికి బ్రేకులు!

- నేడు పార్టీ కార్యాలయానికి రావాలని టీడీపీ నాయకత్వం ఆదేశం

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద వ్యాఖ్యలు, చర్యలతో వార్తలకెక్కిన తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు పార్టీ అధిష్ఠానం బ్రేకులు వేసింది. ఆయన ఫిర్యాదులు, ఆదేశాలపై ఆచితూచి వెళ్లాలని నియోజకవర్గంలోని కీలక అధికారులకు సూచనలు అందినట్లు సమాచారం. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి శ్యావల దేవదత్‌ను క్రియాశీలం చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొలికపూడిని శనివారం కేంద్ర కార్యాలయానికి రావాలని నాయకత్వం ఆదేశించింది. ఫిర్యాదులపై ఆయన వివరణ తీసుకోనున్నారు. మరోవైపు అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి వ్యవహారశైలిని నిరసిస్తూ పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. గతంలో వైసీపీలో పని చేసి వచ్చిన ఆయన ఆ పార్టీ వారినే ప్రోత్సహిస్తున్నారని, మొదటి నుంచి టీడీపీలో ఉంటున్నవారిని వేధిస్తున్నారని నేతలు పల్లాకు ఫిర్యాదు చేశారు. కాగా, ఫిర్యాదుల నేపథ్యంలో పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్‌గా కర్నూలు నగర కార్పొరేటర్ పద్మలతారెడ్డి స్థానంలో కర్నూలు తెలుగు మహిళ అధ్యక్షురాలు ముంతాజ్‌ను నియమించారు.

పవన్ వ్యాఖ్యలపై వేచి చూద్దాం!

- తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్పందన
- మదురైలో ఏపీ ఉపముఖ్యమంత్రిపై పోలీసులకు న్యాయవాది ఫిర్యాదు

చెన్నై, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని నాశనం చేయాలనుకునేవారంతా నాశనమైపోతారంటూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి నర్మ గర్భంగా స్పందించారు. శుక్రవారం చెన్నైలో ఆయన పవన్ వ్యాఖ్యలపై మాట్లాడుతూ 'లెటజ్ వెయిట్ అండ్ సీ' అని వ్యాఖ్యానించారు. డెంగీ, మలేరియాలను సమూలంగా నిర్మూలించినట్లు సనాతన ధర్మాన్ని కూడా సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఉదయనిధి గతంలో వ్యాఖ్యానించారు. మరోవైపు పవన్ కల్యాణ్‌పై న్యాయవాది వాంజినాథన్ మదురై పోలీస్ కమిషనర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేని ఉదయనిధి పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా మాట్లాడారని, ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఎంకే నేత సయ్యద్ హఫీజుల్లా మాట్లాడుతూ తమ పార్టీ ఎప్పుడూ సనాతన ధర్మం గురించి తప్పుగా మాట్లాడలేదని పేర్కొన్నారు.

పవన్ కుమార్తెలపై పోస్టులు పెట్టిన మహిళపై ఫిర్యాదు

చిలకలూరిపేట, అక్టోబరు 4: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమార్తెలపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త పెద్దిరెడ్డి సుధారాణిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్ చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్‌కు ఫిర్యాదిచ్చారు.

మా ఫామ్‌హౌస్‌కు అధికారుల్ని పంపండి

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో కట్టడాలుంటే మార్కింగ్ చేయించండి.. నా సొంత ఖర్చులతో కూల్చేయిస్తాను
- రేవంత్‌రెడ్డికి కేవీపీ రామచంద్రరావు బహిరంగ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): "నిబంధనలకు విరుద్ధంగా కట్టిన కేవీపీ రామచంద్రరావు ఫామ్‌హౌస్‌ను ఎందుకు కూల్చొద్దు" అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ స్పందించారు. అజీజ్‌నగర్‌లో ఉన్న తమ ఫామ్‌హౌస్‌కు సంబంధిత అధికారులను పంపి, చట్ట ప్రకారం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిని మార్క్ చేయించాలని.. ఆ పరిధిలో ఏదైనా కట్టడం ఉంటే తన సొంత ఖర్చులతో 48 గంటల్లో కూల్చేస్తానని శుక్రవారం ఆయన రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. "గడిచిన ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత గలిగిన కార్యకర్తగా కొనసాగుతున్నాను. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతి కార్యక్రమాన్ని, పథకాన్ని త్రికరణశుద్ధిగా సమర్థిసాను. చిత్తశుద్ధితో అమలు చేసేందుకు నా శాయశక్తులా కృషి చేస్తాను. అయితే ఈ రోజున ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రికి ఇలా చెప్పాల్సి రావడం బాధాకరం. అయినా తప్పట్లేదు" అని ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన, సుందరీకరణను తాను పూర్తిగా స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. "పేదలకు నష్టం కలుగకుండా మన ప్రభుత్వం చేపట్టే అన్ని అభివృద్ధి పనులనూ క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తగా స్వాగతిస్తాను. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆశయాన్ని దెబ్బతీయడానికి బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ప్రయత్నాలను ఖండిస్తున్నాను" అని కేవీపీ స్పష్టం చేశారు. తమ ఫామ్‌హౌస్‌లో మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని.. ఈ సందర్భంగా ఆయన రేవంత్‌రెడ్డిని కోరారు. మార్కింగ్ చేసే సమయం, తేదీని ముందే ప్రకటిస్తే తనపై పదే పదే ఆరోపణలు చేస్తున్న విపక్ష నేతలు, వారి అనుకూల మీడియా వీక్షించే అవకాశం కలుగుతుందన్నారు. "కాంగ్రెస్ పార్టీ నాయకునిగా నాకు చట్టం నుంచి ఏ మినహాయింపులూ వద్దు. ఒక సాధారణ పౌరుడి విషయంలో చట్టం ఏ విధంగా వ్యవహరిస్తుందో అదే విధంగా వ్యవహరిస్తే చాలు. మీ నాయకత్వంలో ఉన్న మన కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడానికి నాలో నరనరానా ఉన్న కాంగ్రెస్ రక్తం అంగీకరించనందునే మీకు ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను" అని కేవీపీ పేర్కొన్నారు.

గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గోపీమూర్తి

అమరావతి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొర్రా గోపీమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు ఆయన పేరును బలపరిచారని యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. గోపీమూర్తి పశ్చిమ గోదావరిలో టీచర్‌గా పనిచేస్తూ, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలి

- సీఎం చంద్రబాబుకు అమ్మవారి అనుగ్రహం ఉండాలి
- దుర్గమ్మను కోరుకున్న ఎంపీలు కేశినేని చిన్ని, జి.హరీష్

చిట్టినగర్, అక్టోబరు 4: 'ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుండాలని, సీఎం చంద్రబాబుపై అమ్మవారి అనుగ్రహం ఉండాలని, ఆయన తలపెడుతున్న ప్రతి కార్యక్రమం సఫలీకృతం కావాలని కోరుకున్నాం.' అని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), అమలాపురం ఎంపీ జి.హరీష్ మాథుర్ తెలిపారు. గాయత్రీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను శుక్రవారం వారు దర్శించుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

ప్రజలందరిపై దుర్గమ్మ కటాక్షం ఉండాలి: పల్లా శ్రీనివాస్

రాష్ట్ర ప్రజలందరికీ కనకదుర్గమ్మ కరుణాకటాక్షాలు ఉండాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ కోరుకున్నారు. గాయత్రీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు.

జగన్మాతే నగరాన్ని కాపాడింది: యార్లగడ్డ వెంకట్రావ్

వన్‌టౌన్: నగరాన్ని వరదలు చుట్టుముట్టినా జగన్మాత దయతో అతి తక్కువ ప్రాణనష్టంతో నగరవాసులు బయటపడ్డారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గాయత్రీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని కుటుంబసభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న దుర్గామల్లేశ్వరస్వామి నగరోత్సవంలో పల్లకీని మోశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వన్‌టౌన్/లబ్బీపేట: కనకదుర్గానగర్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10.30 గంటలవరకు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు ఈవో ప్రశంసాపత్రాలు, లడ్డూ ప్రసాదం అందించి అభినందించారు.



మాట్లాడుతున్న ఎంపీలు హరీష్ మాథుర్, కేశినేని చిన్ని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు దుర్గమ్మ చిత్రపటాన్ని బహూకరిస్తున్న పండితులు



పల్లకీ మోస్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న

దుర్గమ్మ చీర..బహు ప్రీతిపాత్రం

ఆటోనగర్: కనకదుర్గమ్మకు సమర్పించిన చీరలను తీసుకుంటే మంచి జరుగుతుందని భక్తులు ఎంతో విశ్వసిస్తారు. దీంతో చీరల విక్రయ కౌంటర్ల వద్ద భక్తులు కిటకిటలాడుతున్నారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల విక్రయ కౌంటర్లను ప్రసాదం కౌంటర్లకు ఎదురుగా ఏర్పాటు చేశారు.

కూలి డబ్బులివ్వట్లేదు..భోజనం పెట్టడం లేదు

- కాంట్రాక్టర్‌పై ప్రైవేట్ పారిశుధ్య కార్మికుల ఆగ్రహం

వన్‌టౌన్: దుర్గగుడిలో దసరా మహోత్సవాల్లో పనిచేస్తున్న తమకు కాంట్రాక్టర్ రెండు రోజుల నుంచి కూలి డబ్బులు ఇవ్వడం లేదని, భోజనాలు పెట్టడం లేదని ప్రైవేట్ పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి నుంచి 100 మందికి పైగా తాము వచ్చామని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం విధుల్లో ఉన్న కార్మికులు భోజనం సమయంలో దేవస్థానం అన్నప్రసాద కేంద్రం వద్దకు వచ్చారు. అక్కడ క్యూలలో బారులు తీరిన భక్తులు ఉండడంతో కార్మికులకు భోజనం అందుబాటులో లేదు. కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని కార్మికులు తెలిపారు. దేవస్థానం నిబంధనల ప్రకారం కాంట్రాక్టరే భోజనం సమకూర్చాలి.



తెనాలి నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులు



బాధ్యతలు స్వీకరించాక మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

శాప్‌లో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తా

- ప్రమాణస్వీకారోత్సవంలో చైర్మన్ అనిమిరెడ్డి రవినాయుడు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 4: "రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా. శాప్‌ను సమూలంగా ప్రక్షాళన చేస్తా. నైపుణ్యం ఉన్న కోచ్‌లను నియమించి, వారితో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇప్పించి రాష్ట్రం నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారుల ప్రాతినిధ్యం పెంచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా. శాప్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేసి క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, ఇతరుల నుంచి వినతులు స్వీకరించేలా చేస్తా." అని రాష్ట్ర క్రీడాప్రాధికారసంస్థ(శాప్)నూతన చైర్మన్ అనిమిరెడ్డి రవినాయుడు స్పష్టం చేశారు. నగరంలోని శాప్ ప్రధాన కార్యాలయంలో మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్‌గా శుక్రవారం రవినాయుడు బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి సంబరాలు చేశారు. అనంతరం క్రీడా మైదానంలో నిర్వహించిన సభలో రవినాయుడు మాట్లాడారు. తనకు సముచితం స్థానం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు రుణపడి ఉంటానని తెలిపారు.

జగన్.. ఓ చెల్లని రూపాయి: మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

'వైసీపీ ఐదేళ్ల పాలనలో క్రీడా శాఖను, శాప్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. జగన్.ఇప్పుడొక చెల్లని రూపాయి. ప్రజలు ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో లేరు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కీలకమైన చర్యలు శాప్ నుంచి తీసుకుంటే తాను మద్దతుగా ఉంటా. క్రీడల్లో రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుతా.' అని మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

శుభాకాంక్షల వెల్లువ

అనిమిరెడ్డి రవినాయుడుకు మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్‌బాబు, రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, రామాంజనేయులు, గద్దె రామ్మోహన్‌రావు, ప్రత్తిపాటి పుల్లారావు, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీతల సుజాత, దామచర్ల సత్యనారాయణ, దీపక్‌రెడ్డి, గద్దె అనురాధ, కల్యాణి, మల్లిబాబు, నాదెళ్ల బ్రహ్మం చౌదరి, మాల్యాద్రి శుభాకాంక్షలు తెలిపారు.

లడ్డూ నాణ్యత పరిశీలన

వన్‌టౌన్, అక్టోబరు 4: దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు విక్రయించేందుకు సిద్ధం చేసిన లడ్డూ ప్రసాదాన్ని శుక్రవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పరిశీలించారు. కొండదిగువన శృంగేరి మఠం పక్కన రేకుల షెడ్డులో తయారు చేస్తున్న లడ్డూలు, వాటి తయారీకి వినియోగిస్తున్న నెయ్యి, శనగ పిండి, జీడిపప్పు, కిస్‌మిస్ నాణ్యతను పరిశీలించారు.



కిస్‌మిస్ నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

విజయవాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మంది రైల్వేకోర్టు శుక్రవారం జరిమానా విధించింది. ఐదో ట్రాఫిక్ స్టేషన్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 19 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఎనిమిది మందికి రూ.15వేలు చొప్పున, 11 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించింది.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

పటమట, అక్టోబరు 4: ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాయల్ సర్వీస్ ట్రస్ట్ ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందిస్తామని ట్రస్ట్ అధ్యక్షుడు శీతాలం రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన పోస్టుమెట్రిక్ విద్యార్థులు ట్రస్ట్ నిర్దేశించిన నమూనాలో తమ దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోగా ఎస్.రాంబాబు, 64-8-10/2, ఫ్లాట్ 2ఏ శ్రీసూర్య పార్క్ వ్యూ, పటమటలంక, విజయవాడ-520010 అడ్రస్‌కు పంపాలని వివరించారు. గడువు ముగిశాక వచ్చిన దరఖాస్తులు పరిశీలించబోమని, వివరాలకు 79894 60929కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు, భవన నిర్మాణ కార్మికులు

ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలి

ధర్నాచౌక్, అక్టోబరు 4: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలుచేసి భవన నిర్మాణ రంగాన్ని కాపాడాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాచౌక్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. నాలుగు నెలలుగా ఇసుక లభించక, ఉపాధిలేక భవన నిర్మాణ కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం నూతన విధానం ప్రకటించాక వారంలో కేవలం ఒక్కరోజు మాత్రమే అదీ అర్ధరాత్రి ఆన్‌లైన్‌లు విడుదల చేస్తున్నారని విమర్శించారు. ట్రాక్టర్ బేస్ లెవల్‌కు రూ.ఏడున్నర వేలు వసూలు చేస్తున్నారని, గతంలో ట్రాక్టర్ ఇసుక నాలుగున్నర వేలు ఉండేదని అన్నారు. రెండు వారాల్లోగా అందరికీ ఇసుక అందుబాటులోకి తేవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సత్యాగ్రహం చేస్తామని ఆయన హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా టీడీపీ హయాంలోనూ ఇసుక అవినీతి జరుగుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని ఇసుకను అందుబాటులోకి తెచ్చి, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు.

ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ ఇంజనీర్స్ జేఏసీ చైర్మన్ విజయబాబు

ధర్నాచౌక్, అక్టోబరు 4: అన్ని డిపార్ట్‌మెంట్ ఇంజనీర్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఇంజనీర్స్ జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జేఏసీ సర్వసభ్య సమావేశం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా నిరంతర సేవలందిస్తున్నామని జేఏసీ చైర్మన్ కె.విజయబాబు తెలిపారు. 2014- 19 మధ్య చేపట్టిన వివిధ పనుల్లో ఇంజనీర్లపై పెట్టిన విజిలెన్స్ కేసులను తాత్కాలికంగా పక్కనపెట్టి తాత్కాలిక అడ్‌హాక్ ప్రమోషన్లు చేపట్టాలన్నారు. లష్కర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అన్ని ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్లలో ఒకేరకమైన సర్వీస్ రూల్స్ రూపకల్పన చేయాలన్నారు. ఇరిగేషన్‌శాఖలో అమలు చేస్తున్న నేటివ్ డిస్ట్రిక్ట్ నిబంధన ఎత్తివేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు నష్టపరిహారం అందించాలి

- ప్రభుత్వానికి కాంగ్రెస్ వినతి

గవర్నర్‌పేట, అక్టోబరు 4: బుడమేరు వరదలకు సర్వం కోల్పోయిన గృహాలకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని వీధి వ్యాపారులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కోరింది. కాంగ్రెస్ నగర కమిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు నేతృత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోకు వినతిపత్రం అందించింది. సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో తోపుడుబండ్లపై ఆహారపదార్థాలు, కూరగాయలు అమ్మేవారు, బడ్డీకొట్ల నిర్వాహకులు, ఇతర వీధి వ్యాపారాలు చేసుకునే వారు సర్వం కోల్పోయారని, వారు తిరిగి వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం సాయపడాలని కోరారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ పేషీలో వినతిపత్రం అందజేశారు. ఏపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ అన్సారీ, నాయకులు సూరిబాబు, కండెల వరప్రసాద్ పాల్గొన్నారు.



వరద బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

వరద బాధితులను ఆదుకుందాం

- ప్రభుత్వంతో పాటు మీరూ ముందుకు రండి
- స్వచ్ఛంద సేవా సంస్థలకు మంత్రి భరత్ పిలుపు

గవర్నర్‌పేట, అక్టోబరు 4: వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కుటుంబానికి రూ.5 వేలు చొప్పున 600 కుటుంబాలకు రూ.30 లక్షల సాయం చెక్కులను మంత్రి అందజేశారు. వరద బాధిత ఆర్యవైశ్యులకు తమ వంతుగా రూ.3లక్షలు సాయం అందించామని అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు, మహిళా అధ్యక్షురాలు ఆరవేటి నిర్మల తెలిపారు. నగరానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

విజయవాడ ● శనివారం 5 అక్టోబరు 2024

యూసీడ్, సీడ్ నోటిఫికేషన్‌లు



బాంబేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీబీ)- డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన ఎంట్రెన్స్ టెస్ట్‌లకు నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. 'అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్(యూసీడ్) 2025' ద్వారా 'బీడిజైన్' ప్రోగ్రామ్‌లో; 'కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్(సీడ్) 2025' ద్వారా 'ఎండిజైన్', 'పీహెచ్‌డీ' ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు.

యూసీడ్

ఈ ఎగ్జామ్ ద్వారా ఐఐటీ(హైదరాబాద్, బాంబే, ఢిల్లీ, గువహటి, రూర్కీ), ఐఐఐటీడీఎం(జబల్పూర్) సహా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీడిజైన్ కోర్సు చేసే అవకాశం కల్పిస్తారు. యూసీడ్ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది. అభ్యర్థులు వరసగా రెండుసార్లు మాత్రమే ఈ టెస్ట్ రాయడానికి వీలుంది.

సీట్ల వివరాలు: ఐఐటీ హైదరాబాద్‌లో 26, ఐఐటీ బాంబేలో 37, ఐఐటీ ఢిల్లీలో 20, ఐఐటీ గువహటీలో 56, ఐఐటీ రూర్కీలో 20, ఐఐఐటీడీఎం జబల్పూర్‌లో 66 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి సైన్స్/కామర్స్/ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ గ్రూప్ చదివినవారు పై అయిదు సంస్థల్లో చేరవచ్చు. ఐఐఐటీడీఎంలో ప్రవేశానికి బైపీసీ అభ్యర్థులు కూడా అర్హులే. బైపీసీ సహా ఆర్ట్స్, కామర్స్ గ్రూప్‌లు చదివినవారు ఐఐటీ(హైదరాబాద్, బాంబే, ఢిల్లీ)లో చేరవచ్చు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు పూర్తిచేసినవారు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నిర్వహించే సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నిర్వహించే హైస్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) ఎగ్జామినేషన్(లండన్/కేంబ్రిడ్జ్/శ్రీలంక) అడ్వాన్స్‌డ్ లెవెల్ పూర్తిచేసినవారు యూసీడ్‌కు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అర్హులే. 2023లోగానీ అంతకుముందుగానీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థులు 2000 అక్టోబరు 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 300. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్ 200 మార్కులకు ఉంటుంది. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. దీనికి రెండు గంటల సమయం ఇస్తారు. ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో 14 న్యూమరికల్ ఆన్సర్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు నాలుగు మార్కులు నిర్దేశించారు. వర్చ్యువల్ కీబోర్డ్ ఉపయోగించి స్క్రీన్‌పై సమాధానాన్ని టైప్ చేయాలి. వీటికి నెగెటివ్ మార్కులు ఉండవు. రెండో సెక్షన్‌లో 15 మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు ఇస్తారు. వీటికి ఒకటి కంటే ఎక్కువ సమాధానాలు ఉంటాయి. అన్నింటినీ సరిగా గుర్తిస్తే ప్రశ్నకు నాలుగు మార్కులు ఇస్తారు. ఎన్ని సమాధానాలు సరిగా గుర్తిస్తే అన్ని మార్కులు ఇస్తారు. సమాదానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మూడో సెక్షన్‌లో 28 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. తప్పుగా గుర్తించిన సమాధానానికి 0.71 మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్ 100 మార్కులకు ఉంటుంది. దీనికి గంట సమయం ఇస్తారు. ఇందులో అభ్యర్థి డ్రాయింగ్ నైపుణ్యాన్ని పరీక్షించేలా స్కెచింగ్, డిజైన్ అప్టిట్యూడ్ అంశాలనుంచి రెండు ప్రశ్నలను కంప్యూటర్ స్క్రీన్‌మీద చూపిస్తారు. దీనికి సమాధానాన్ని ఆన్సర్ బుక్‌లో రాయాలి. మొదటి పార్ట్‌లో నిర్దేశిత కటాఫ్ మేరకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి సంబంధించిన రెండో పార్ట్‌ను పరిశీలించి యూసీడ్ 2025 స్కోర్ ప్రకటిస్తారు.

సీడ్

ఈ ఎగ్జామ్ ద్వారా ఐఐఎస్సీ(బెంగళూరు), ఐఐఐటీడీఎం(జబల్పూర్), ఐఐటీ(హైదరాబాద్, బాంబే, ఢిల్లీ, గువహటి, కాన్పూర్, రూర్కీ) సంస్థల్లో ఎండిజైన్ చేసే అవకాశం కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైన్ స్కూళ్లలో పీహెచ్‌డీ చేయవచ్చు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా 'సీడ్' రాయవచ్చు. సీడ్ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది.

ఎండిజైన్ స్పెషలైజేషన్‌లు: బెంగళూరు ఐఐఎస్సీలో ప్రొడక్ట్ డిజైన్ అండ్ ఇంజనీరింగ్; బాంబే ఐఐటీలో ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, యానిమేషన్, ఇంటరాక్షన్ డిజైన్, మొబిలిటీ అండ్ వెహికిల్ డిజైన్; ఢిల్లీ, రూర్కీ ఐఐటీల్లో ఇండస్ట్రియల్ డిజైన్; గువహటి, కాన్పూర్ ఐఐటీల్లో డిజైన్; హైదరాబాద్ ఐఐటీలో విజువల్ డిజైన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి.

అర్హత: ఇంటర్ తరవాత కనీసం మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి తరవాత అయిదేళ్ల జీడీ ఆర్ట్స్ డిప్లొమా ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

టెస్ట్ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్ 150 మార్కులకు ఉంటుంది. దీనికి గంట సమయం ఇస్తారు. ఇందులో ఎనిమిది న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు, పది మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు ఉంటాయి. వీటితోపాటు 26 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు ప్రత్యేకించారు. రుణాత్మక మార్కులు ఉన్నాయి. మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నల్లో సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే 1 మార్కు, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల్లో అయితే 0.5 మార్కులు కోత విధిస్తారు. రెండో పార్ట్ 100 మార్కులకు ఉంటుంది. దీనికి రెండు గంటల సమయం ఇస్తారు. ఇందులో స్కెచింగ్, క్రియేటివిటీ, ఫామ్ సెన్సిటివిటీ, విజువల్ సెన్సిటివిటీ, ప్రాబ్లమ్ ఐడెంటిఫికేషన్ విభాగాల నుంచి అయిదు ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి 20 మార్కులు ప్రత్యేకించారు. మొదటి పార్ట్‌లో నిర్దేశిత కటాఫ్ మేరకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి సంబంధించిన రెండో పార్ట్‌ను మాత్రమే పరిశీలిస్తారు. మొదటి పార్ట్‌కు 25 శాతం, రెండో పార్ట్‌కు 75 శాతం వెయిటేజీ ఇస్తూ సీడ్ 2025 స్కోర్ నిర్ణయిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** రూ.4,000 (మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000)
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరి 3 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం, భోపాల్, ముంబై, ఢిల్లీ ప్రధాన నగరాలు
- **పరీక్ష కేంద్రానికి తీసుకురావాల్సినవి:** పెన్స్, పెన్సిల్స్, స్కెచ్ పెన్స్, కలర్స్, అడ్మిట్ కార్డ్, కాలేజ్ ఐడీ కార్డ్/పాస్‌పోర్ట్/డ్రైవింగ్ లైసెన్స్/పాన్ కార్డ్/ ఓటర్ ఐడీ/ఆధార్ కార్డ్
- **యూసీడ్ 2025, సీడ్ 2025లను నిర్వహించే తేదీ:** 2025 జనవరి 19
- **కీ విడుదల:** 2025 జనవరి 29
- **కటాఫ్ ప్రకటన:** 2025 ఫిబ్రవరి 6
- **సీడ్ ఫలితాలు విడుదల:** 2025 మార్చి 5
- **యూసీడ్ ఫలితాలు విడుదల:** మార్చి 7
- **యూసీడ్, సీడ్ స్కోర్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 మార్చి 10 నుంచి జూన్ 11 వరకు
- **వెబ్‌సైట్:** www.uceed.iitb.ac.in, www.ceed.iitb.ac.in

హెచ్‌ఏఎల్‌లో మేనేజర్లు

ఖాళీలు: 44

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. డిప్యూటీ జనరల్ మేనేజర్(గ్రేడ్-7): 1
2. మేనేజర్(గ్రేడ్-4): 4
3. డిప్యూటీ మేనేజర్(గ్రేడ్-3): 25
4. ఆఫీసర్(గ్రేడ్-2): 14

విభాగాలు: ఫైనాన్స్, ఫైర్, ఫ్లైట్ ఆపరేషన్ అండ్ సేఫ్టీ, హెచ్ఆర్, పబ్లిక్ రిలేషన్స్ అండ్ మీడియా కమ్యూనికేషన్, కంపెనీ సెక్రటరీ, ఇంటిగ్రేటెడ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/ఐసీడబ్ల్యూఏఐ డిగ్రీ(బీఎస్సీ), ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఆఫీసర్(గ్రేడ్-2) పోస్టులకు 30 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్(గ్రేడ్-3) పోస్టులకు 35; మేనేజర్(గ్రేడ్-4) పోస్టులకు 38 ఏళ్లు; డిప్యూటీ జనరల్ మేనేజర్(గ్రేడ్-7) పోస్టులకు 47 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు ఆఫీసర్(గ్రేడ్-2) పోస్టులకు రూ.40,000 - రూ.1,40,000; డిప్యూటీ మేనేజర్(గ్రేడ్-3) పోస్టులకు రూ.50,000 - రూ.1,60,000; మేనేజర్(గ్రేడ్-4) పోస్టులకు రూ.60,000 - రూ.1,80,000; డిప్యూటీ జనరల్ మేనేజర్(గ్రేడ్-7) పోస్టులకు రూ.90,000 - రూ.2,40,000.

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్ టెస్ట్, పని అనుభవం, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 30

వెబ్‌సైట్: halindia.co.in/home

జాబ్ కార్నర్



బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ఖాళీలు: 4

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ప్రాజెక్ట్ ఇంజనీర్-1(ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్)

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/టెలికమ్యూనికేషన్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు మొదటి ఏడాది రూ.40,000; రెండో ఏడాది రూ.45,000; మూడో ఏడాది రూ.50,000; నాలుగో ఏడాది రూ.55,000 చెల్లిస్తారు.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ద మేనేజర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జాలహళ్లి పోస్ట్, బెంగళూరు' చిరునామాకు పంపించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 24

వెబ్‌సైట్: https://bel-india.in/

ఆంధ్ర వర్సిటీలో డిప్లొమాలు



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ డిప్లొమా, డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఈవెనింగ్ కోర్సులు. కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి.

- ఏయూ క్యాంపస్‌లో 60 సీట్లు, అకాడమీ ఆఫ్ యోగ(భీమునిపట్నం)లో 60 సీట్లు, యోగ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ(అనకాపల్లి)లో 50 సీట్లు, సెంటర్ ఫర్ యోగ అండ్ వెల్‌నెస్(విశాఖపట్నం)లో 50 సీట్లు, ఎంవీఆర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్(విశాఖపట్నం)లో 50 సీట్లు, ఏఐఎం రామ యోగ ట్రస్ట్(పార్వతీపురం)లో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండేళ్ల డిప్లొమా: యాక్టింగ్, డైరెక్షన్ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏడాది డిప్లొమా: లైట్ మ్యూజిక్, డివోషనల్ సాంగ్స్ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

- కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, తాళవాద్యాలు(మృదంగం, ఘటం, కంజీర) కోర్సుల్లో ఒక్కోదానిలో 20 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత స్పెషలైజేషన్‌లో నాలుగేళ్ల లెర్నింగ్ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసి ఉండాలి.

ఆర్నెల్ల డిప్లొమా: యోగ కోర్సుకు సంబంధించి ఏయూ క్యాంపస్‌లో 60 సీట్లు, భారతీయ విద్యాకేంద్రం(విశాఖపట్నం)లో 80 సీట్లు, సెంటర్ ఫర్ యోగ అండ్ వెల్‌నెస్(విశాఖపట్నం)లో 80 సీట్లు, పతంజలి యోగ కేంద్రం(విశాఖపట్నం)లో 80 సీట్లు, శ్రీ యోగ విద్యా సంస్థ(విజయనగరం)లో 60 సీట్లు, యోగ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ(అనకాపల్లి)లో 80 సీట్లు, ఎంవీఆర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్(విశాఖపట్నం)లో 50 సీట్లు, ఏఐఎం రామ యోగ ట్రస్ట్(పార్వతీపురం)లో 60 సీట్లు ఉన్నాయి.

- ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, స్పానిష్, ఫొటోగ్రఫీ కోర్సులకు సంబంధించి ఏయూ క్యాంపస్‌లో ఒక్కోదానిలో 40 సీట్లు ఉన్నాయి.
- ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** పీజీ డిప్లొమాకి రూ.16,500; డిప్లొమాకి రూ.10,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 ● **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 21
- **కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 23
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

ఐఐటీ ఢిల్లీలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీడీ)- ఎంఎస్ (రీసెర్చ్), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్, స్పాన్సర్డ్ కేటగిరీల్లో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. అభ్యర్థులు గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఎంఎస్(రీసెర్చ్) ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పార్ట్ టైమ్ ఎంఎస్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గేట్ వ్యాలిడ్ స్కోర్/సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.



ఎంఎస్(రీసెర్చ్) స్పెషలైజేషన్‌లు: అప్లయిడ్ మెకానిక్స్, అట్మాస్ఫిరిక్ అండ్ ఓషనిక్ సైన్సెస్, ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబాలజీ, ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సెన్సర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్-సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ.

పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు: అప్లయిడ్ మెకానిక్స్, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మేథమెటిక్స్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్.

అర్హత: ఎంఎస్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారికి ఈ స్కోర్ అవసరం లేదు.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం


- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** అక్టోబరు 7 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 25
- **వెబ్‌సైట్:** https://home.iitd.ac.in

లిటిల్స్

దుప్పి తెలివి

అనగనగా ఒక అడవిలో రాకీ అనే దుప్పి ఉండేది.అది చాలా తెలివైనది మరియు చురుకైనది. ఒక రోజు రాకీ ఆహారం కోసం వెతుక్కుంటూ చాలా దూరం పోయింది.అంతలోగా వర్షం రావడంతో దగ్గరలో కనిపించినగుహలోకి వెళ్లి, తల దాచుకుంది.

కాసేపయాక గుహ బయటకు తొంగి చూస్తే, బయట ఒక పులి నించుని గుహవైపే చూస్తూ కనిపించింది. గుహ లోపల చీకటిగా ఉండటంతో తాను పులికి కనిపించే అవకాశం లేదని కొంత ధైర్యం తెచ్చుకున్న దుప్పి ఏదో ఒకలాగా అక్కడి నుండి బయట పడితేగానీతన ప్రాణాలు దక్కవ అనుకున్నది. గుహ లోపలికి జరిగి, గంబీరంగా గొంతు మార్చి ఇలా అన్నది. మన ముగ్గురం పులిని వేటాడి తిని చాలా కాలమైంది ఈ సమయంలో పులి ఏదైనా కనపడితే, మన పంట పండినట్టే. అన్నట్టు పులి గుండె మాత్రం నేనే తింటాను ఇప్పటికి తొంభై తొమ్మిది పులుల గుండెలు తిన్నాను. ఇవాళ వంద పూర్తి చేస్తాను'అన్నది. ఆ మాటలన్నీ గుహ బయట ఉండి విన్న పులి గుహ లోపల తనను వేటాడి తినగల పెద్ద జంతువు ఏదో ఉందనుకుని భయ పడింది.




మరికొంత సేపటికి అక్కడికి ఒక తోడేలు వచ్చి, ఏమిటి అలా భయపడుతూ నించున్నావు? అని అడిగింది, దానికి పులి జవాబు చెప్పే లోపలే గుహ లోపల నుండి దుప్పి మళ్లీ గొంతు మార్చి,' మీరిద్దరూ ఇక్కడే ఉండండి ఇవాళ పులి దొరక్కపోతే ఒక తోడేలు దొరికినా

మన ఆకలి తీరినట్టే' అన్నది. ఆ మాటలు వినగానే పులి ,తోడేలు రెండూ కలసి అక్కడినుండి అడవిలోకి పరుగు తీశాయి. అలా తెలివైన దుప్పి రాకీ తన ఉపాయంతో ఆ రోజు పులిమరియు తోడేలు బారినుండి తన ప్రాణాలను కాపాడుకుంది.


ఎలుగుబంట్లు ఏన్ని?



సరైన బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 427

				9	6			8
						6		
			3	1	8	2	5	9
							1	
6		8				3		5
	3							
9	5	3	4	2	1			
		2						
4			9	7				

సుడోకు - 426 సమాధానం

9	6	3	7	5	8	1	4	2
1	4	8	2	6	9	5	3	7
5	7	2	1	3	4	9	6	8
3	8	6	9	4	7	2	5	1
7	9	4	5	1	2	6	8	3
2	5	1	6	8	3	7	9	4
6	3	5	8	2	1	4	7	9
8	2	9	4	7	5	3	1	6
4	1	7	3	9	6	8	2	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.